www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..


గురువారం

31-10-2024

సంపుటి : 01 । సంచిక : 179 । పేజీలు : 13 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్





# ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయండి..

## బీసీ రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు ఆదేశం



**విశ్వంభర, హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో విడుదల చేసింది. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు అప్పగించింది. దీనిని సవాల్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం చేసే బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఒకటి రెండు నెలల పాటు రాష్ట్రంలో బీసీ కమిషన్ అధ్యయనం చేసి నివేదిక అందిస్తుంది. గతంలో మహారాష్ట్రలో ఇలాగే బీసీ కమిషన్ చేసిన అధ్యయనాన్ని అక్కడి హైకోర్టు కొట్టివేసింది. ఇక్కడ నివేదిక సమర్పించిన తర్వాత అదేవిధంగా జరిగితే సమయం వృథా అవుతుంది. అందువల్ల ఇప్పుడే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలి'' అని పిటిషనర్ తరఫున మాజీ అడ్వొకేట్ జనరల్ ప్రసాద్ కోర్టును కోరారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

# ఈబీ-5 వీసా పెట్టుబడులపై టీ-హబ్‌లో సెమినార్

**విశ్వంభర, హైదరాబాద్ :** అమెరికా పెట్టుబడుల కోసం జారీ చేసే ఈబీ5 (ఎంప్లాయిమెంట్ బేస్డ్ 5) గురించి వీఎస్పీ క్యాపిటల్ టీహబ్‌లో సెమినార్ నిర్వహించారు. వీసా హోల్డర్లు 20 మిలియన్ డాలర్లు విలువైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాపర్టీస్, కమర్షియల్ రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసి గ్రీన్ కార్డును పొందవచ్చు అని తెలిపింది. ఈ వీసా తో పెట్టుబడిదారులు వారి కుటుంబాలు వీఎస్పీ ప్రాజెక్టులో భాగం సుమారు రూ.7 కోట్లు ఇన్వెస్ట్ చేస్తే ఈబీ5 వీసా పొందవచ్చు అని వీఎస్పీ క్యాపిటల్ చైర్మన్ విక్రం సాగర్ పసాలా తెలిపారు.

ప్యారడైజ్ గ్రూప్ మాజీ ప్రమోటర్ డాక్టర్ కజిమ్ వంటి వారు సహా పలువురు ఈబీ5 ద్వారా అమెరికాలో ఇన్వెస్ట్ చేసి స్థిరపడ్డారని వివరించారు. అటార్నీ అబ్దుల్ ఈ సందర్భంగా వీసా పై ఇన్వెస్టర్లు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చి అమెరికా లోని సబర్బన్, డౌంటౌన్ ప్రాంతాలు మొదలైన వాటిలో రియాల్టీ, గ్రీన్ ఎనర్జీ, మైనింగ్, రిన్యేబుల్ సోర్సెస్, ఆయిల్ మైనింగ్ వంటి సెక్టర్స్ లో కూడా ఇన్వెస్ట్ చేయొచ్చని తెలిపారు. ఈ సెమినార్‌లో అబ్దుల్ ఆరిఫ్ (అటార్నీ), విక్రం సాగర్ (ఫౌండర్ కోర్ ట్రాకర్ & వీఎస్పి క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్స్), శ్రీనివాస్ మర్రి (కళారాజ్ మీడియా అధినేత) కరుణాకర్ రెడ్డి, డా.ఖజిమ్ హిమాతి, తారిక్ అజ్మి, అబ్దుల్ రెహ్మాన్, విజయ్ రామరాజు పాల్గొన్నారు.




# సీఎం రేవంత్‌రెడ్డి కుర్చీకి ఏమీ కాదు

- టచ్ చేసే వాళ్లు ఇంకా పుట్టలేదు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ ఎస్‌కు రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 100 స్థానాలు భారాసకు వస్తాయని మాజీ మంత్రి హరీశ్‌రావు కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. నాలుగు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో బీఆర్ ఎస్ పరిస్థితి ఏమైందో మరిచిపోయారా అని ప్రశ్నించారు. జనం మిమ్మల్ని జీరో చేసి విసిరి అవతల పారేస్తే.. వంద సీట్లు వస్తాయని ఇంకా పొంకనాలు కొడతారా అని ధ్వజమెత్తారు.



రెండు ఎన్నికల్లో ప్రజలు బీఆర్ ఎస్‌ను తిరస్కరించారని, భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తెలంగాణ ప్రజలు తిరిగి కేసీఆర్ మొహం కూడా చూడరని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతగా ఉండమని జనం ఓట్లేస్తే ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. బీఆర్ ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే తెలంగాణ డ్రగ్స్‌కు అడ్డాగా మారుతుందని, హైదరాబాద్‌లో గంజాయి సాగు చేసే పరిస్థితి వస్తుందని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి కుర్చీకి ఏమీ కాదు.. ఆ కుర్చీని టచ్ చేసే వాళ్లు పుట్టలేదన్నారు. బీఆర్ ఎస్‌లో తన కుర్చీ ఉంటుందో, ఊడుతుందో హరీశ్‌రావు చూసుకోవాలని వ్యాఖ్యానించారు.

# జేఈఈ మెయిన్ -2025 నోటిఫికేషన్ విడుదల

* జనవరి 22 నుంచి తొలి విడత పరీక్షలు

* ఏప్రిల్ 1 నుంచి రెండో విడత పరీక్షలు

**విశ్వంభర, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ఎన్ఐటీల్లో బీటెక్/ బీఆర్కే సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ మెయిన్2025 ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను ఎన్‌టీఏ ప్రకటించింది. తొలి విడత పరీక్షలు జనవరి 22 నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే రెండో విడత పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి జరగనున్నాయి. కానీ గతేడాదితో పోల్చితే ఈసారి మాత్రం 40 రోజులు ఆలస్యంగా ప్రకటనను విడుదల చేశారు. ఈసారి అందరినీ ఆశ్చర్య పరిచే విషయం ఏంటంటే పరీక్షల ఫలితాల తేదీలను కూడా ప్రకటించారు. ఈసారి కూడా సిలబస్‌లో ఎలాంటి మార్పు లేదని నోటిఫికేషన్‌ను చూస్తే అర్థం అవుతుంది. పరీక్షల విషయానికి వస్తే గతేడాది జనవరి 24న పరీక్షలు జరగ్గా ఈసారి రెండు రోజులు ముందుకు జరిపి నిర్వహించడం విశేషం.

**పరీక్షల షెడ్యూల్ :**

**తొలి విడత**

ఆన్‌లైన్ దరఖాస్తులు : అక్టోబరు 28 నుంచి నవంబరు 22 వరకు
హాల్ టికెట్లు డౌన్‌లోడ్ : పరీక్షకు మూడు రోజుల ముందుగానే.
పరీక్షలు నిర్వహణ : జనవరి 22 నుంచి జనవరి 31 మధ్య(2025)
ఫలితాలు : ఫిబ్రవరి 12.

**రెండో విడత**

ఆన్‌లైన్ దరఖాస్తులు : జనవరి 31 నుంచి ఫిబ్రవరి 24 వరకు
హాల్ టికెట్లు : పరీక్ష తేదీకి మూడు రోజుల ముందు
పరీక్షలు : ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 8 మధ్య(2025)
ఫలితాలు : ఏప్రిల్ 17 నాటికి.

# గ్రూప్-3 ఎగ్జామ్ షెడ్యూల్ విడుదల

* నవంబర్ 10 నుంచి హాల్‌టికెట్లు తీసుకోవచ్చు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో గ్రూప్3 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్3 పరీక్షను నిర్వహించనున్నట్లుగా ఇప్పటికే ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. రెండు సెషన్లలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2 పరీక్షను నిర్వహించనున్నారు. అలాగే, నవంబర్ 18వ తేదీన పేపర్ 3 పరీక్షను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. నవంబర్ 10వ తేదీన హాల్ టికెట్లు అందుబాటులోకి రానున్నాయి.

ఆలస్యంగా వస్తే నో ఎంట్రీ : గ్రూప్3 పరీక్ష ఫస్ట్ సెషన్‌కు ఉదయం 8.30 గంటల నుంచి, రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1.30 గంటల లోపే ఎగ్జామ్ సెంటర్లలోనికి అనుమతిస్తారు. మార్నింగ్ సెషన్‌లో 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 2.30 గంటలకు గేట్లు మూసివేస్తామని ఆ తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు తేల్చి చెప్పారు.

హాల్‌టికెట్లు మీ వద్దే ఉంచుకోండి : ఎంపిక ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అభ్యర్థులు తమ హాల్‌టికెట్లు, క్వశ్చన్‌పేపర్లను జాగ్రత్త చేసుకోవాలని అభ్యర్థులకు బోర్డ్ సూచించింది. డూప్లికేట్ హాల్‌టికెట్లను తర్వాత జారీ చేయబోమని తెలిపింది. రాష్ట్రంలో దాదాపు 1380కి పైగా గ్రూప్3 ఉద్యోగాలకు 5.36 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షల అనంతరం డిసెంబర్‌లో గ్రూప్2 పరీక్షలు జరగనున్నాయి. వీటికి సంబంధించిన షెడ్యూల్‌ను టీజీపీఎస్సీ గతంలోనే విడుదల చేసింది. డిసెంబర్ 15, 16వ తేదీల్లో గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

ఇటీవలే గ్రూప్1 మెయిన్స్ పరీక్షను టీజీపీఎస్సీ నిర్వహించింది. తొలుత అభ్యర్థులు పరీక్షను వాయిదా వేయాలని ఆందోళనలు నిర్వహించారు. సర్వోన్నత న్యాయస్థానం సైతం ఈ విషయంలో జోక్యం చేసుకోబోమని తేల్చిచెప్పడంతో టీజీపీఎస్సీ మెయిన్స్ పరీక్షను నిర్వహించింది.

# మురికి కూపంగా మలక్‌పేట్ మార్కెట్‌యార్డ్

- అదురుతున్న పుక్కుపుటాలు
- ప్రమాదకరంగా దారులు
- పట్టించుకోని అధికారులు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద వ్యవసాయ మ్యారేట్ అయిన హైదరాబాద్ మలక్‌పేట మార్కెట్ యార్డ్ (గంజ్) ముకికూపంగా మారింది. మలక్‌పేట్ మార్కెట్‌లో ఎటు చూసిన చెత్త చెదారంతో పాటు డ్రైనేజి నీటి ప్రవాహం చెరువును తలపిస్తున్నది. దీనికి తోడు మార్కెట్‌లో రోడ్లు గుంతల మాయంగా మారి ఇక్కడికి వచ్చే రైతులకు, వ్యాపారస్తులకు, వినియోగదారులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తుంది. మురికి నీరు గుంతల్లో నిండి ఉండడం వల్ల ఆ గుంతలు సరిగా కనిపించక వాహన దారులు క్రిందపడి గాయాలపాలైన సంఘటనలు కోకొల్లలు. దీంతో వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మురుగునీటి దుర్వాసనతో అటుగా వెళ్లేవారి పుక్కుపుటాలు అదురుతున్నాయి.




ఇక్కడి వ్యాపారులు నిత్యం దుర్వాసనతో ఇబ్బందులోపడుతూ ఆనారోగ్యం పాలవుతున్నారు. ఇక్కడ ఉల్లిగడ్డ, ఎండుమిర్చి, ఆలు తదితర ఆహార వినియోగ పదార్థాలు రోడ్డమీద పెట్టి అమ్ముతుంటారు, ఈ మురుగునీరు వీటి కిందికి చేరి ఈ ఆహార వినియోగ పదార్థాలు చేడిపోతున్నాయి. పన్నుల రూపంలో యార్డ్‌కు ఆదాయం భాగానే ఉన్నా.. సమస్య పరిష్కరించడం లేదని స్థానిక వ్యాపారులు, తరుచూ వచ్చే వినియోగదారులు మార్కెట్ యార్డ్ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంభదిత అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

Project By
GNR
ANVAYA
Premium luxury villa
KONGARAKALAN
Creating A Beautiful Home For You And Your Family
Marketed By
South Icon Group
NO Pre EMI's UPTO 24 Months
PRICE 5499/- Per Sft
200 Yards@ 1.5 Cr
400 Yards @ 2.5 Cr
Approved By hmda
80% Loan Available From All Leading Banks




30 Ac Area Villa Project With 320 Premium Luxury Villas
Evergreen Surroundings for A Life Time Beside Forest

AMENITIES
- Gym
- Aerobics
- Indoor Games
- Olympiad Size Swimming pool,
- Badminton court
- Squash Court
- Banquet halls
- Multi-purpose & conference hall
- Creche
- Spa and Saloon
- Bar and Lounge
- Supermarket
- Canteen
- Clinic
- Billiards pool table
- Library

LOCATION HIGHLIGHTS
- 28 ACRES BIGGEST GATED COMMUNITY BT ROAD FACING LAYOUT
- 30 MIN DRIVE FROM KOKAPET/FINANCIAL DISTRICT THROUGH TSPA JUNCTION
- PROXIMITY TO 19000 ACERS PHARMA CITY
- PROXIMITY TO TCS ADIBATLA, AEROSPACE AND FABCITY.
- PROXIMITY TO EDUCATIONAL INSTITUTIONS
- 30 MIN DRIVE FROM HI-TECH CITY, GACHIBOWLI
- 15MIN DRIVE FROM RGIA AIRPORT

South Icon Group
Corp Office : Plot No. 63P & 62 (NP) 3rd Floor, Samatha nagar Nagole 'X' Roads, Hyderabad - 500 068.
CONTACT FOR MORE DETAILS
9652167668

STUDENT VISA ASSISTANCE



BP TECH INDIA, USA
Happy Diwali Festival of Lights...
- Training By Real Time Experience
- Hands on Based Training
- Job Assistance
- Personality Development

.NET
Java
python
DevOps
Power BI
Selenium
SOFTWARE TESTING
aws

FIRST TIME IN NAGOLE

Address:
Plot No.63P % 62 (NP)
2nd Floor, Samatha Nagar,
Nagole X Road,
Hyderabad - 500 068.

bptechindiapvtltd@gmail.com
www.bptechllc.in
+91 70955 35566

రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం విశ్వంభర తెలుగు దినపత్రిక అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
31-10-2024
సంపుటి : 01 | సంచిక : 179 | పేజీలు : 13 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# కులగణనలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ

## నవంబరులోగా ప్రక్రియ పూర్తి చేయాలి



కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదు..
మెగా హెల్త్ చెకప్ లాంటిది
33 జిల్లాలకు పరిశీలకులను నియమించాలి
పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

**విశ్వంభర, హైదరాబాద్:** కులగణనలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా మార్చాలని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సోనియా-గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టి తీరుతామని స్పష్టం చేశారు. కులగణనపై గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న సీఎం.. ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. కుల గణనపై సమన్వయం **మిగతా5లో...**

# టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు

## 24 మందితో పాలకమండలి.. తెలంగాణ నుంచి అయిదుగురికి చోటు



**విశ్వంభర, అమరావతి:** 24 మంది సభ్యులతో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిని ఏర్పాటు చేసింది. ఏపీకి చెందిన ముగ్గురు ఎంఎల్ ఏలు , తెలంగాణ నుంచి ఐదుగురు, కర్ణాకటక నుంచి ముగ్గురు, తమిళనాడు నుంచి ఇద్దరు, గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఒక్కొక్కరికి బోర్డు అవకాశం కల్పించింది. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఛైర్మన్‌గా టీవీ5 అధినేత బి.ఆర్.నాయుడు నియమితులు కాగా బోర్డు సభ్యులు గా మొత్తం 23 మందిని టీటీడీ బోర్డు నియమించింది. వారిలో ఏపీ నుంచి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, **మిగతా5లో...**

విధ్వంసపాలన చీకట్లు తొలిగాయి

# ఇక తెలంగాణలో వెలుగులే!

## ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో గత పదేళ్ల విధ్వంసపు పాలనలోని చీకట్లు తొలగిపోయాయని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సాగుతున్న ప్రజా పాలనలో తెలంగాణ వెలుగులు విరజిమ్ముతుందని **మిగతా5లో...**



# దేదీప్యమానంగా దీపోత్సవం

- అయోధ్యలో వెలుగుల ధగధగలు
- సరయూ నదీ తీరంలో 51 ఘాట్లలో 22.23 లక్షల ప్రమిదలతో కాంతిమయం
- ఉజ్జయిని పేరిట ఉన్న రికార్డు బ్రేక్..
- గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం
- విదేశీ కళాకారులతో ప్రదర్శనలు
- మహాహారతిలో పాల్గొన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

**అయోధ్య:** దివ్వెల పండుగ దీపావళి వేళ.. అయోధ్య నగరం దేదీప్యమానంగా వెలిగిపోయింది. దీపావళి సందర్భంగా అయోధ్యలోని సరయూ నది తీరాన దీపోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. లక్షల ప్రమిదలతో సరయూ తీరం దేదీప్యమానంగా వెలిగిపోయింది. సరయూ నదీ తీరంలో 51 ఘాట్లలో **మిగతా5లో...**




# ఎల్ఓసీ వెంబడి ఉద్రిక్తతలకు ముగింపు

- లద్దాఖ్‌లో భారత్, చైనా బలగాల ఉపసంహరణ పూర్తి!
- వెల్లడించిన సైనిక వర్గాలు
- కొనసాగనున్న 2020నాటి యథాస్థితి

5



# ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న నాయకురాలు ఇందిరా గాంధీ

- దేశం కోసం, పేదలకోసం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు
- ఆమె తీసుకున్న నియంతృత్వమైన నిర్ణయం ఎమర్జెన్సీ..
- బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఆమెదే..

మన మెదక్ జిల్లాతో ఇందిరకు ప్రత్యేక అనుబంధం.. జనరంజక పాలన అందించి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న నాయకురాలు ఇందిరా గాంధీ. గతంలో పాలన అంటే.. ఇందిరమ్మ రాజ్యంలా ఉండాలనే అంతగా గుర్తింపు వచ్చింది. తిరుగులేని నేతగా ఎదిగింది. దేశ రాజకీయాలను ఒంటి చేతితో శాసించింది. బలమైన నాయకురాలుగా ప్రత్యర్థి పార్టీలకు వణుకు పుట్టించారు. తన పాలనలో ఎన్నో సంచలన నిర్ణయాలు తీసుకుంది.

1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక మొట్టమొదటి, ఏకైక మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ. 49 ఏళ్ల వయసులోనే దేశ ప్రధానిగా కీలక బాధ్యతలు చేపట్టిన ఆమె.. సుమారు 16 ఏళ్లకు పైగా దేశానికి సేవలందించారు. ఐరన్ లేడీగా పేరొందిన ఆమె.. వాజ్ పేయి లాంటి వారితో దుర్గాదేవిగా కీర్తించబడింది. తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిన ఇందిరా గాంధీ. 40వవర్ధంతిని పురస్కరించుకుని ఈ సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలు, ఆమె తీసుకున్న సాహసోపేత నిర్ణయాలపై ప్రత్యేక కథనం..

ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న ఇందిరా గాంధీ..

1966 జనవరిలో ఇందిరా గాంధీ మొదటిసారిగా ప్రధాని పదవి చేపట్టాక ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో భారత్ ఓటమిపాలైంది. దీంతో దేశ ఆర్థికవ్యవస్థ క్షీణించిపోయింది. ఈ ప్రభావానికి మూడో పంచవర్ష ప్రణాళికను కూడా ఆపివేయాల్సి వచ్చింది. దీంతో ఇందిరా వార్షిక ప్రణాళికలు అమలు చేశారు. దేశ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు కారణమైన కొఠారీ కమిషన్ సిఫార్సులను అమల్లోకి తీసుకొచ్చి ఐరన్ లేడీగా ఎదిగిపోయారు. 1967 పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇందిరాగాంధీ విజయం సాధించి రెండోసారి ప్రధాని అయ్యారు. 1968లో హరిత విప్లవం ద్వారా అధిక దిగుబడిని అందించే గోధుమ, వరి వంగడాలను సృష్టించి, భవిష్యత్ తరాలకు ఆహార కొరత రాకుండా ఆమె కృషి చేశారు. అలాగే 1969లో 14 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేశారు. అంతేకాదు అంతరిక్షంలోకి తొలి భారతీయుడిని పంపారు. అక్కడికి వెళ్లిన వ్యోమగామి రాకేశ్ శర్మతో కూడా ఆమె మాట్లాడారు. 1970లో శ్వేత విప్లవం ద్వారా పాడిపరిశ్రమను వృద్ధిలోకి తీసుకొచ్చారు. ఇక 1972 ఎన్నికల్లో 'గరీబీ హటావో' నినాదంతో మూడోసారి అధికార బాధ్యతలు తీసుకున్నారు. 1974లో పోఖ్రాన్ లో అణుశక్తి పరీక్షలు జరిపి అగ్రదేశాలను ఇండియా వైపు చూసేలా చేశారు. ఆ తర్వాత 1976లో దేశ రాజ్యాంగ పీఠికలో లౌకిక, సామ్యవాద పదాలను చేర్చారు. తొలిసారిగా కామన్వెల్త్ దేశాల సదస్సు, ఢిల్లీలో ఆసియన్ గేమ్స్ సైతం నిర్వహించారు. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఇందిరాగాంధీ సేవలను, చేపట్టిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుని ప్రశంసిస్తారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజలైతే ఆమెను ఇప్పటికీ ప్రేమగా 'ఇందిరమ్మ' అని పిలుస్తుంటారు. అలాగే ఇళ్లు లేని పేదల కోసం పక్కా ఇల్లు నిర్మాణం, ఉపాధి కల్పన, భూమి పంపిణీ వంటివి ప్రారంభించారు ఇందిరా. దళిత, గిరిజన, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారు.

ఇందిరాగాంధీ ఆ ఆర్డినెన్స్ తెచ్చేవరకూ అన్నీ ప్రయివేట్ బ్యాంకులే..

స్వాతంత్ర్యానంతరం భారత్లో మొదట్లో ప్రయివేట్ సెక్టార్ లోనే బ్యాంకులన్నీ ఉండేవి. భారతదేశంలోని అన్ని ప్రైవేట్ బ్యాంకులు పారిశ్రామికవేత్తల చేతిలో ఉన్నాయి. అప్పట్లో ప్రజలు బ్యాంకులకు వెళ్ళడానికి సిగ్గుపడేవారు. అలాగే, బ్యాంకుల వ్యాపారం పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమై ఉండేది. స్వాతంత్ర్యం పొందిన 10 సంవత్సరాలలో, 300 కి పైగా చిన్న బ్యాంకులు దివాలా అంచుకు చేరుకున్నాయి. దీంతో కోట్ల మంది ప్రజల సొమ్ములు వీటిలో మునిగిపోయాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, బ్యాంకులను ప్రభుత్వానికి అణగదొక్కే ఆలోచన ఐరోపాలో పుట్టింది. మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా దేశాలు భారీ ఆర్థిక నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఇది ఈ దేశాల ఆర్థిక పరిస్థితిని బలహీనపరిచింది. అనేక యూరోపియన్ దేశాలు సంక్షోభాన్ని అధిగమించడానికి బ్యాంకులను జాతీయం చేశాయి. ఈ ఫార్ములానే భారత్ లో అమలు చేయాలని ఇందిరాగాంధీకి ఆలోచన వచ్చింది. ఈ కారణంగా, ఈ బ్యాంకుల నిర్వహణ ప్రభుత్వం చేపట్టాలని నిర్ణయించింది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకులను తీసుకెళ్లడం అవసరమని ఇందిరా గాంధీ భావించారు. దేశ సామాజిక అభివృద్ధిలో ప్రైవేట్ బ్యాంకులు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. అందుకే బ్యాంకుల జాతీయం అవసరమని ఆమె అన్నారు. ఈ నిర్ణయం అమలును ఇందిరా తన ప్రధాన కార్యదర్శి పిఎన్ హక్సర్‌కు అప్పగించారు. హక్సర్ సోవియట్ యూనియన్ సోషలిస్ట్ భావజాలం ద్వారా ప్రభావితమైనవారు. ప్రభుత్వం అక్కడి బ్యాంకులను నియంత్రించింది. 1967 లో ఇందిరా కాంగ్రెస్ పార్టీలో 10 పాయింట్ల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమంలో, బ్యాంకులపై ప్రభుత్వ నియంత్రణ, రాజుమహారాజులకు ప్రభుత్వం సహాయం చేయడం, కనీస వేతనాలు నిర్ణయించడం ప్రధాన అంశాలు. 7 జూలై 1969 న కాంగ్రెస్ బెంగళూరు సమావేశంలో బ్యాంకుల జాతీయం గురించి ఇందిరా ప్రతిపాదించారు. ఇందిరా నిర్ణయం అప్పట్లో చాలా వివాదాస్పదంగా మారింది .ఇందిరా ఈ నిర్ణయాన్ని అప్పటి ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ వ్యతిరేకించారు. దీని తరువాత ఇందిరా మొరార్జీ దేశాయ్ మంత్రిత్వ శాఖను మార్చాలని ఇందిరా గాంధీ ఆదేశించారు. దీనిపై ఆగ్రహించిన మొరార్జీ దేశాయ్ ఆర్థిక మంత్రి పదవికి రాజీనామా చేశారు. జూలై 19, 1969 న, ఇందిరా గాంధీ ఆర్డినెన్స్ ప్రకటించారు. 14 బ్యాంకులను జాతీయం చేశారు. దీని తరువాత ఏప్రిల్ 1980 లో మరో 6 బ్యాంకుల జాతీయం జరిగింది. ఇందిరా గాంధీ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలలో ఈ నిర్ణయం ఒకటి. వాస్తవానికి, జాతీయం చేసిన తరువాత, బ్యాంకుల శాఖల సంఖ్య విపరీతంగా పెరిగింది. నగరాలను విడిచిపెట్టి తరువాత గ్రామాలు, పట్టణాల్లో బ్యాంకులు ప్రారంభమయ్యాయి. ఇది భారతదేశ గ్రామీణ జనాభాకు బ్యాంకింగ్‌తో అనుసంధానించడానికి అవకాశం ఇచ్చింది. మూడు దశాబ్దాలలో దేశంలోని బ్యాంకుల శాఖలు 8 వేల నుంచి 60 వేలకు పెరిగాయి. జాతీయం అయిన 14 బ్యాంకులు ఆ సమయంలో దేశ డిపాజిట్లలో 80 శాతం కలిగి ఉన్నాయి. అయితే, ఈ మూలధనం అధిక లాభదాయక రంగాలలో మాత్రమే పెట్టుబడి పెట్టాయి బ్యాంకుల యాజమాన్యాలు. మరోవైపు,



ఇందిరాగాంధీ తీసుకున్న నియంతృత్వమైన నిర్ణయం ఎమర్జెన్సీ..

ఎమర్జెన్సీ.. అచ్చతెలుగులో చెప్పాలంటే అత్యవసర స్థితి... అసలు ఈ మాట వింటేనే నిలువెల్లా వణుకు పుడుతుంది. ఇందిరాగాంధీ ప్రధానిగాఉన్న సమయంలో దేశ సార్వభౌమాధికారం మొత్తం తన చేతుల్లోకి తీసుకున్న అత్యంత నియంతృత్వమైన నిర్ణయం ఇది. ప్రజాస్వామ్యంలో ప్రజలు, న్యాయస్థానాలు తన అధికారాన్ని ప్రశ్నిస్తున్నప్పుడు.. ప్రతికూల నిర్ణయాలు వెలువడుతున్నప్పుడు ఇందిరాగాంధీ ఈ అస్త్రాన్ని ప్రయోగించారు. స్వతంత్ర భారత దేశంలో అత్యంత క్రూరమైన, అనర్థమైన నిర్ణయం ఇదే అంటారు విశ్లేషకులు. అంతేకాదు.. ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా అభివర్ణిస్తారు. ప్రజల హక్కులను కాలరాసే ఈ నిర్ణయం ఆమోదయోగ్యం కాదని వాదిస్తారు. కానీ, అప్పుడు ఆ కాలంలో ఇది సాధ్యమయ్యింది. దేశం మొత్తంమీద ప్రజలకు కనీస ప్రాథమిక హక్కులు కూడా దక్కని పరిస్థితి దాపురించింది. ఢిల్లీలో కూర్చొని దేశం మొత్తం మీద అధికారం చెలాయించవచ్చన్న అధికార ఆలోచనకు పరాకాష్టగా నిలిచింది అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ. దేశంలో అంతర్గతంగా అలజడి చెలరేగిందన్న కారణంతో 1975 జూన్ 25వ తేదీన దేశంలో ఎమర్జెన్సీని విధించారు. భారత రాజ్యాంగంలోని అధికరణం 352(1) కింద అంతర్గత కల్లోల స్థితిని ఉద్దేశించి రాజ్యాంగంలో నిర్దేశించిన అంతర్గత అత్యవసర స్థితిని ఇందిరాగాంధీ వినియోగించుకున్నారు. అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ద్వారా 1975 జూన్ 25వ తేదీ అర్థరాత్రి గం॥ 11.45 నిమిషాలకు అధికారికంగా దేశంలో ఎమర్జెన్సీని విధించారు. ఈ అత్యవసర స్థితి దేశవ్యాప్తంగా 1977వ సంవత్సరం మార్చి 21వ తేదీన ఆ ఆదేశాలను ఉపసంహరించే దాకా కొనసాగింది. తన ఆదేశాల ద్వారా పరిపాలిస్తూ ఎన్నికలను కూడా ఆపేసి, ప్రశ్నించే పౌరహక్కులను కూడా అడ్డుకునే అధికారాన్ని ఈ అధికరణం ప్రధాన మంత్రికి అందించింది. ప్రజల కనీస హక్కులను కూడా ఈ అధికరణం కాలరాస్తుంది. ఎమర్జెన్సీ కారణంగా దేశంలో 21 నెలల పాటు నియంతృత్వం రాజ్యమేలింది. ఈ అధికరణం ద్వారా తనకు వర్తించిన విస్తృతమైన అధికారాలను వినియోగించుకున్నారు. దేశంలో ఎమర్జెన్సీ అంటే అత్యయిక స్థితిని విధించిన వెంటనే ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం మొదలయ్యింది. ఎన్నికలను వాయిదా వేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను ఎక్కడికక్కడ అణచివేశారు. పత్రికలపై ఏనాడూ లేని రీతిలో నియంత్రణ విధించారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రధానంగా రాజకీయ ప్రత్యర్థులను జైలుపాలు చేశారు. పత్రికలపై సెన్సార్ విధించారు. అంటే, పత్రికల్లో వచ్చే వార్తలు సైతం ముందుగా ప్రధానమంత్రి కార్యాలయానికి చూపించాలన్నమాట. స్వతంత్ర భారత చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన నిర్ణయాలు, కాలాల గురించి చర్చించుకుంటే దేశంలో అత్యవసర స్థితిఎమర్జెన్సీని ప్రధానంగా చెప్పుకుంటారు. ఈ అరాచకం దేశవ్యాప్తంగా 1977వ సంవత్సరం మార్చి 21వ తేదీ వరకు అంటే 21 నెలలపాటు సాగింది. ఆమె విధించిన ఎమర్జెన్సీతో ఆమె పాలన తీవ్ర వివాదాస్పదంగా మారిపోయింది. ఈ నిర్ణయం ఆమెను అప్రతిష్టపాలుజేసింది. చివరికి 1977 ఎన్నికల్లో ఇందిర ఓడిపోయారు. కానీ 1980లో మరోసారి ప్రధాని అయ్యారు.

మెదక్ నుంచి బరిలో దిగి గెలిచిన ఇందిరా గాంధీ..

మెదక్ పార్లమెంట్ స్థానానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ నుంచి 1980 ఎన్నికల్లో ఇందిరాగాంధీ పోటీ చేసి గెలిచారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆమె ప్రధాని అయ్యారు . దీంతో దేశ రాజకీయ చిత్రపటంలో మెదక్‌కు చోటు దక్కింది. ఇందిరాగాంధీ ఇక్కడ నుంచి పోటీ చేయడం వెనుక ఆసక్తికరమైన రాజకీయ కారణాలున్నాయి . ఎమర్జెన్సీ అనంతరం 1978లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా సర్కారు రెండేళ్లకే పతనమైంది. రెండేళ్లకే మళ్లీ ఎన్నికలొచ్చాయి . నార్త్ లో ఆశించిన స్థాయిలో స్థానాలు రాకపోవచ్చన్న అనుమానాలతో కాంగ్రెస్ సౌత్ మీద ఫోకస్ పెట్టంది. అన్ని కోణాల్లో ఆలోచించి మెదక్‌లో గెలుపు ఖాయమన్న అభిప్రాయానికి వచ్చింది. దీంతో ఇందిరా గాంధీ రాయ్ బరేలితో పాటు మెదక్ నుంచి కూడా ఎన్నికల బరిలో దిగారు .ఈ ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు పోటీ చేశారు. కాంగ్రెస్ (ఐ) క్యాండి డేట్‌గా ఇందిరాగాంధీ, జనతా పార్టీ క్యాండి డేట్‌గా ఎస్. జైపాల్ రెడ్డి, జనతా(ఎస్ ) పార్టీ క్యాండి డేట్‌గా కేశవరావ్ జాదవ్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఇందిరా గాంధీకి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎం.బాగారెడ్డి ఎలక్షన్ ఏజెంట్‌గా పనిచేశారు. ఇందిరాగాంధీ గెలువడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ ఎన్నికల్లో ఇందిరాగాంధీ 67.9 శాతం ఓట్లతో ఘన విజయం సాధించారు. ఆమెకు 3,15,077 ఓట్లు రాగా, జైపాల్ రెడ్డికి 82,453 ఓట్లు వచ్చాయి . ఇక్కడ ఇందిరా గాంధీకి వచ్చిన 2,32,624 ఓట్ల ఆధిక్యమే ఆ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ. ఈ ఎన్నికల్లో ఇందిర మెదక్‌తో పాటు తన సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీ నుంచి కూడా గెలిచారు. అయితే ఆమె రాయ్ బరేలీ స్థానంలో రాజీనామా చేసి మెదక్ నుంచే పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఇక్కడ ఎంపీగానే ప్రధాని పీఠమెక్కారు. ప్రధాని ఇందిరాగాంధీ 1984 అక్టోబరు 31న హత్యకు గురయ్యే నాటికి మెదక్ ఎంపీగానే ఉన్నారు. మెదక్ ఎంపీగా ఆమె పలు సందర్భాల్లో మెదక్ జిల్లాకు వచ్చారు. 1984 జులై 19న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌ల సదస్సుకు హాజరయ్యారు. మెదక్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, తదితర పనులకు శంకుస్థాపన చేశారు. సంగారెడ్డిలో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కూడా ఇందిరాగాంధీ పాల్గొన్నారు.

**ఆపరేషన్ బ్లూ స్టార్...**

1984 వ సంవత్సరం లో పాకిస్తాన్ ప్రేరేపిత ఖలిస్తాన్ తీవ్రవాదులు కొంతమంది భక్తులను బందీలుగా చేసుకుని అమ్రిత్సర్ లో గల గోల్డెన్ టెంపుల్ లో దాక్కున్నారు. ఇండియన్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం వారి వద్ద భయంకరమైన మారణాయుధాలు ఉన్నాయి. మూడు రోజుల పాటు సాగిన చర్చల తర్వాత వారు లొంగిపోవటానికి నిరాకరించారు. విధి లేని పరిస్థితుల్లో ఇందిరా గాంధీ మిలిటరీ ఆపరేషన్ కి అనుమతి ఇచ్చారు. రెండు రోజుల పోరాటం అనంతరం వారందరినీ మట్టు బెట్టారు కాని సైనిక పోరాటంలో ఆలయం బాగా దెబ్బతింది. సిక్కుల ఆచారం ప్రకారం ఆలయంలోకి బూట్లు వేసుకుని వెళ్ళరాదు. ఆలయంలో మిలిటరీ ఆపరేషన్ కి అనుమతి ఇచ్చినందుకు సిక్కులు ఇందిరా గాంధీ మీద వ్యతిరేకత పెంచుకున్నారు. సిక్కులు కోపంగా ఉన్నారని ఇందిరా గాంధీ వద్ద ఉన్న సిక్కు బాడీ గార్డ్ లను తీసెయ్యాలి అని చెప్పినా ఆవిడ వినలేదు. 4 నెలల అనంతరం అక్టోబర్ 31 న వారి చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు.

ఆ 4 గంటల్లో!.. ఇందిరాగాంధీ చివరి క్షణాలను వివరించిన వైద్యుడు

శరీరమంతా తుపాకీ బుల్లెట్లతో నిండిపోయిన ఇందిరా గాంధీ.. ఆసుపత్రి బెడ్‌పై పడి ఉండటాన్ని చూసి వణికిపోయానని ఎయిమ్స్ మాజీ డైరెక్టరు, అప్పటి కార్డియాలజీ విభాగాధిపతి పి.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆమె హత్యకు గురైన 1984 అక్టోబరు 31వ తేదీన ఎయిమ్స్‌లో జరిగిన సంఘటనల గురించి తాను రాసిన 'హార్ట్‌ఫెల్ట్' పుస్తకంలో వివరించారు. గత వారం ఆ పుస్తకం విడుదలైంది. అందులో ఇందిరను ఆసుపత్రికి తరలించిన తర్వాత నాలుగు గంటల్లో ఏం జరిగిందో కూలంకషంగా వివరించారు. 'పొంటి నిండా బుల్లెట్ గాయాలతో ఉన్న ఇందిరా గాంధీని ఆసుపత్రికి తీసుకొచ్చారు. బుల్లెట్లు ఆసుపత్రి నేలనిండా చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆమె శరీరం నుంచి రక్తం ధారగా కారుతోంది. ఆమె పొట్టలోంచి రక్తం ఉబికివస్తోంది. ఆమెను కాపాడటానికి నాలుగు గంటలపాటు వైద్యులు, సర్జన్లు, నర్సింగ్ స్టాఫ్ ఎంతగానో శ్రమించారు. ఆమెకు ఓ నెగిటివ్ రక్తాన్ని ఎక్కించడానికి ఒకవైపు ప్రయత్నిస్తుండగా మరోవైపు ఆసుపత్రి కారిడార్‌లో రాజకీయ చర్చలు జరుగుతున్నాయి. తదుపరి ప్రధాని ఎవరు.. ఎప్పుడు ప్రమాణం చేయాలనే చర్చ సాగింది. నేను వెంటనే పదవీ విరమణ చేయబోతున్న డైరెక్టర్ టాండన్, కొత్తగా బాధ్యతలు తీసుకోబోతున్న స్నేహ భార్గవ్ వద్దకు వెళ్లా. వారిద్దరూ నిస్సహాయంగా నా వైపు సలహా కోసం చూశారు. కార్డియాక్ సర్జరీ అధిపతిగా నేను అత్యవసర నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. వెంటనే రక్తస్రావాన్ని ఆపాలని సూచించా. కనీసం అధీకృత సంతకం కోసం కూడా నేను ఆగలేదు. ఇందిరను బైపాస్ యంత్రంపై ఉంచి.. బుల్లెట్లతో నిండిపోయిన ఆమె పొట్ట భాగంలో రక్తస్రావాన్ని ఆపాలనేది ప్రణాళిక. దీనిపై 4 గంటలపాటు పని చేశాం. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బైపాస్ చేయడానికి వైద్యులు ప్రయత్నించారు. కానీ కాపాడలేకపోయాం. ఆమె చనిపోయిన విషయాన్ని కుమారుడు రాజీవ్ గాంధీకి చెప్పడానికి బయటకు వచ్చినప్పుడు నాకు నోటివెంట మాటలు రాలేదు' అని వేణుగోపాల్ పుస్తకంలో వివరించారు. 'హార్ట్‌ఫెల్ట్: ఏ కార్డియాక్ సర్జన్స్ పయనీరింగ్ జర్నీ' పేరుతో వేణుగోపాల్ తన సతీమణి ప్రియా సర్కార్‌తో కలిసి రాసిన ఈ పుస్తకాన్ని హార్పర్ కొలిన్స్ ఇండియా సంస్థ ప్రచురించింది.

**దుర్గాదేవిగా అభివర్ణించిన వాజ్‌పేయి..**

సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇందిరా వెనుకాడేవారు కాదు. తన హయాంలో వ్యవసాయం, అంతరిక్షం, అణుశక్తి ఇలా రంగాల్లో పురోగతి సాధించేందుకు కృషి చేశారు. ఆమె ప్రధానిగా ఉన్నప్పుడు విపక్ష నేతలు ఎన్ని విమర్శలు చేసినా కూడా ఇందిరా గాంధీ ధైర్యంగా ముందుకెళ్లేవారు. ముఖ్యంగా తూర్పు పాకిస్థాన్ అంటే ప్రస్తుతం ఉన్న బంగ్లాదేశ్ విముక్తికి ఆమె తీసుకున్న నిర్ణయానికి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాడ్‌పేయి ఇందిరాను దుర్గాదేవిగా అభివర్ణించారు.



పోతుగంటి వెంకటరమణ
బ్యూరో చీఫ్, విశ్వంభర దినపత్రిక

# సర్దార్ పటేల్ ఉక్కు సంకల్పంతో.. భారత్‌లో విలీనమైన 562 సంస్థానాలు

- భారతదేశ ఐక్యత , సమగ్రతకు ఆయన చేసిన సేవలు అసమానం
- నేడు జాతీయ ఐక్యతా దినోత్సవం

జాతీయ ఐక్యతా దినోత్సవం.. సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క అచంచలమైన స్ఫూర్తికి, భారతదేశ ఐక్యత ,సమగ్రతకు ఆయన చేసిన అసమాన సేవలకు నివాళులు అర్పించే ఒక ముఖ్యమైన సందర్భం. భారతదేశ ఐక్యతకు రూపశిల్పిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అక్టోబర్ 31. ఆరోజున ఆయన గౌరవార్థం ని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని 'రాష్ట్రీయ ఏక్తా దివస్' అని కూడా పిలుస్తారు. ఆయన నాయకత్వాన్ని, సంస్థానాల ఏకీకరణలో ఆయన అవిశ్రాంత కృషిని, జాతీయ ఐక్యత పట్ల ఆయన అచంచల నిబద్ధతను, జాతికి స్ఫూర్తినిచ్చే విలువలను స్మరించుకునే రోజు ఇది. నేడు జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా విశ్వంభర దినపత్రిక ప్రత్యేక వ్యాసం.

**'భారతదేశపు ఉక్కు మనిషిగా కీర్తి..**


భారతదేశ మొదటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అసాధారణమైన ధైర్యసాహసాలు,ఇనుప సంకల్పం కారణంగా ఆయనను 'భారతదేశపు ఉక్కు మనిషిగా కీర్తిస్తారు.ఆయనను "సర్దార్" (చీఫ్) అని ఆప్యాయంగా పిలిచేవారు, ఎందుకంటే అతని అసాధారణ నాయకత్వ నైపుణ్యాలు, స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యానంతర సవాళ్ల ద్వారా దేశాన్ని నడిపించడంలో కీలక పాత్ర పోషించాయి. సర్దార్ పటేల్ భారత జాతీయ కాంగ్రెస్‌లో సభ్యుడు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 1900లో అతను గోద్రాలో స్వతంత్ర జిల్లా న్యాయవాది కార్యాలయాన్ని స్థాపించారు.

తన స్నేహితుల కోరిక మేరకు పటేల్ 1917లో అహ్మదాబాద్ శానిటేషన్ కమీషనర్ పదవికి జరిగిన ఎన్నికలలో పాల్గొని గెలిచారు. వల్లభ్‌భాయ్ పటేల్ గాంధీజీ ఆలోచనలకు ఎంతగానో ప్రభావితుడై 1920లో సహాయ నిరాకరణ ఉద్యమంలో స్వదేశీ ఖాదీ వస్తువులను స్వీకరించి విదేశీ దుస్తులను బహిష్కరించడం ప్రారంభించారు. తన దౌత్యంలో విజయం సాధించిన కారణంగా, అతను 1927లో అహ్మదాబాద్ కార్పొరేషన్ అధ్యక్షుడయ్యారు. 1929లో భారత జాతీయ కాంగ్రెస్ లాహోర్ సమావేశంలో మహాత్మా గాంధీ తర్వాత రాష్ట్రపతి పదవికి సర్దార్ పటేల్ రెండవ అభ్యర్థిగా నిలిచారు. స్వాతంత్ర్యం తరువాత, మొదటి ప్రధాన మంత్రి పండిత్ నెహ్రూ కాగా, మొదటి ఉప ప్రధాని సర్దార్ పటేల్ అయ్యారు. కానీ ఇద్దరి రాజకీయ ఆలోచనలలో నేల, ఆకాశం తేడా ఉంది. నెహ్రూ గ్రంథాల పండితుడు, పటేల్ ఆయుధాల పూజారిగా వ్యవహరించారు. 1947 నాటి భారతదేశంపాకిస్తాన్ యుద్ధంలో కీలక పాత్ర పోషించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, పటేల్ భారతదేశంలో రాచరిక రాష్ట్రాలను విలీనం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. బ్రిటీష్ పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత 565 కంటే రాచరిక సంస్థలను భారత యూనియన్‌లో విలీనం చేశారు. కొత్త స్వతంత్ర దేశం జాతీయ ఐక్యతకు అయన చూపించిన నిబద్ధత.. సర్దార్ పటేల్‌కు ఉక్కు మనిషి అనే బిరుదును తెచ్చిపెట్టింది. ఆయన దేశానికి సేవలకు గుర్తుగా 2014లో సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకోవాలని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. భారత ప్రభుత్వం అక్టోబర్ 31 పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవం లేదా రాష్ట్రీయ ఏక్తా దివస్ గా ప్రకటించింది. 2018లో గుజరాత్‌లో 182 మీటర్ల ఎత్తైన పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ యూనిటీ అని పేరు పెట్టారు. సర్దార్ పటేల్ 143వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని నర్మదా నది సమీపంలో స్టాట్యూ ఆఫ్ యూనిటీని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. జాతీయ ఐక్యతా దినోత్సవం దేశాన్ని ఏకం చేయడానికి పటేల్, ఇతర కార్యకర్తలు చేసిన పోరాటాలు, త్యాగాలను గుర్తు చేస్తుంది. ఇది 'భిన్నత్వంలో ఏకత్వం' స్ఫూర్తిని ప్రోత్సహిస్తుంది. జాతీయ సమగ్రతను కాపాడుకోవడం ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

**సర్దార్ పటేల్ ఉక్కు సంకల్పం.. భారత్‌లో విలీనమైన 562 సంస్థానాలు**

స్వాతంత్ర భారత భారత తొలి ఉప ప్రధాని, హోమ్ మంత్రి బర్డోలీ వీరుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ . స్వాతంత్ర అనంతరం దేశంలో ఏర్పడ్డ అనిశ్చితిని, అనైక్యతను తన చతురతతో పటేల్ పరిష్కరించారు. తొలి నుంచి విభజించు పాలించు విధానాన్ని అవలంభించిన ఆంగ్లేయులు మత ప్రాతిపదికన అఖండ భారతావనిని రెండు ముక్కలుగా చేశారు. అలాగే వెళ్తూ వెళ్తూ దేశంలోని సంస్థానాలకు స్వయం నిర్ణయాధికారాన్ని కూడా కట్టబెట్టారు. దీని ప్రకారం తమకు నచ్చితే సంస్థానాధీశులు భారత్ యూనియన్‌లో విలీనం కావచ్చు లేదా స్వతంత్రంగా వ్యవహరించవచ్చు.మీరు భారత్‌లో లేదా... పాకిస్థాన్‌లో విలీనం కావచ్చే లేదంటే మీకు మీరు సొంతంగా రాజ్యాలు ఏలుకోవచ్చు' అనే స్వేచ్ఛను ఇచ్చారు. దీంతో సంస్థానాధీశులకు ఎక్కడలేని శక్తి వచ్చింది. ఎవరికివారు జెండా ఎగరేయడం మొదలుపెట్టారు. అన్నింటికీ మించి హైదరాబాద్, జూనాగఢ్, కశ్మీర్ లాంటి కీలక సంస్థానాలపై పాకిస్థాన్ కన్నేసింది. ఒకవేళ అవి పాక్‌లో కలిసిపోతే నిత్యం అశాంతి, అస్థిరత, ఘర్షణే. ఒకే ఇల్లులా ఉండాల్సిన దేశంలో ఇన్ని వేరు కుంపట్ల మంటలు భరించాలా? ఇలా కుదరదు.. పిల్ల రాజ్యాలన్నింటి తల్లి భారతి ఒడిలో చేర్చాలి... దేశమంతా ఒక్కటిగా ఉండాలి.. ఇందుకు ఉక్కు సంకల్పం కావాలి.. అలా సంస్థానాలను దేశంలో విలీనం చేసే బాధ్యతను 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వీకరించారు. దీనికోసం ప్రత్యేకంగా కేంద్రంల 'రాష్ట్రాల శాఖ' ఏర్పాటైంది. ఈ సమస్యను తనదైన శైలిలో పరిష్కరించి ఇండియన్ బిస్మార్క్‌గా వల్లభాయ్ పటేల్ మన్ననలు అందుకున్నారు. జర్మనీ ఏకీకరణలో బిస్మార్క్ పాత్ర ఎలాంటిందో భారత యూనియన్‌లో స్వదేశీ సంస్థానాలు వీలినంలో పటేల్ ఉక్కు సంకల్పం అలాంటిది. 1947లో స్వాతంత్రం వచ్చేనాటికి దేశంలో 565 స్వదేశీ సంస్థానాలు ఉన్నాయి. వీటిలో కశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ మినహా మిగిలినవి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితో బేషరుతుగా భారత సమాఖ్యలో అంతర్భాగమయ్యాయి.

మిగతా మూడు సంస్థానాలను భారత్ యూనియన్‌లో విలీనం చేయడానికి పటేల్ పట్టుదలతో వ్యవహరించారు. వీటిలో ముఖ్యమైంది హైదరాబాద్ సంస్థానం. ఇందులోని 80 శాతం ప్రజలు హిందువులు, మిగతా 20 శాతం ముస్లింలు ఇతర మతాలకు చెందినవారు. ప్రపంచంలో అత్యంత ధనికుడిగా పేరొందిన ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ హైదరాబాద్ సంస్థానాన్ని ముస్లిం రాజ్యంగా చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. తమ సంస్థానానికి సొంతంగా కరెన్సీ, రైల్వే, సైనిక వ్యవస్థలు ఉండటం వల్ల హైదరాబాద్‌ను స్వతంత్ర రాజ్యంగా ఉంచాలనే బలీయమైన కోరిక ఆయనది.



స్వాతంత్ర్యం అనంతరం మరికొంత కాలం వేచి చూసిన తర్వాత ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేస్తానని ఏడో నిజామ్ ప్రతిపాదించాడు. కానీ నిజాం వైఖరిపట్ల అనుమానంగా ఉన్న పటేల్ అందుకు అంగీకరించలేదు. ఇదే సమయంలో నిజాం సంస్థానంలోని రజాకార్లు మతకల్లోలాన్ని సృష్టించి ఆ ప్రాంతంలోని ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. నిజాం సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేయడానికి ఇదే సరైన సమయంగా పటేల్ భావించారు. ఆపరేషన్ పోలో ద్వారా సైనిక చర్యను చేపట్టి హైదరాబాద్ సంస్థానాన్ని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగానే 1947 సెప్టెంబరు 13 న ప్రారంభమైన ఆపరేషన్ మూడు రోజులు పాటు కొనసాగి అదే నెల 17 న ముగిసింది. సైనికచర్యను ప్రధాని నెహ్రూ వ్యతిరేకించినా ఆయన ఆదేశాలను పట్టించుకోకుండా హైదరాబాద్ ప్రజలకు కిసాన్ వీరుడు విముక్తి కలిగించారు. నెహ్రూ యూరప్ పర్యటనకు వెళ్లడంతో ఇదే సైనిక చర్యకు సరైన సమయంగా భావించిన పటేల్ ఇండియన్ ఆర్మీకి ఆదేశాలు జారీచేశారు. కశ్మీర్‌ది మరో విచిత్రమైన పరిస్థితి. ఈ సంస్థానాధీశుడు రాజా హరిసింగ్ భారత్ యూనియన్‌లో కశ్మీర్‌ను విలీనం చేస్తున్నట్లు ప్రకటించాడు.

అయితే దాయాది పాకిస్థాన్ కశ్మీర్‌లోని వేర్పాటువాదులను ప్రోత్సహించి దీన్ని వ్యతిరేకించేలా చేసింది. దీనిపై కూడా సైనిక చర్య ద్వారా శాశ్వత పరిష్కారం చేయాలని పటేల్ భావించినా నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దీనికి ఒప్పుకోలేదు. అప్పుడే పుట్టుకొచ్చింది ఆర్టికల్ 370, 35ఏ. దాదాపు 75 ఏళ్లుగా రావణకష్టానికి ఆజ్యం పోసింది. మోదీ ప్రభుత్వం దీనిపై 2019లో సాహసోపేత నిర్ణయం తీసుకుంది. కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దుచేసి పూర్తిగా భారత్‌లో విలీనం చేసింది. అయితే, ఇక్కడితో సమస్య పరిష్కారం కాలేదు. దశాబ్దాలుగా సాగుతోన్న వివాదం పరిష్కారమై కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం ఏర్పడాలంటే మరికొన్నేళ్లు వేచిచూడక తప్పని పరిస్థితి.

# ఇప్పటికప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్‌కు వంద సీట్లు

**విశ్వంభర, హైదరాబాద్:** ఇప్పటికప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు వంద సీట్లు వస్తాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం మీడియాతోచిట్‌చాట్ నిర్వహించారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని స్పష్టం చేశారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని.. రేవంత్ సీఎం అయ్యేవాడు కాదన్నారు. కేసీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. సీనియర్లు తన కుర్చీని గుంజుకోకుండా రేవంత్ చేసుకోవాలని.. తన కుర్చీని ఎప్పుడు గుంజుకుపోతారోనన్న భయంలో రేవంత్ ఉన్నాడన్నారు. ఐదేళ్ల తర్వాత వచ్చేది బీఆర్ఎస్ మాత్రమేనని.. సీఎం అయ్యేది కేసీఆర్ అని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ మూడుసార్లు ఓడిందని.. మరి కాంగ్రెస్ ఖతం అయిపోయిందా? అంటూ ప్రశ్నించారు. 31 సాకులు చూపుతూ రుణమాఫీ చేయకుండా రేవంత్ రైతులను మోసం చేశారని విమర్శించారు.



**రేవంత్‌పై జోకులు పేలుతున్నయ్..**

ఆరు మంత్రి పదవులు నింపేందుకే రేవంత్‌కు హైకమాండ్ అనుమతి ఇవ్వట్లేదని.. విద్య, మైనారిటీ, పోలీసుశాఖలకు మంత్రులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ లేరన్నారు. కేసీఆర్ పవర్‌ఫుల్ ఫైటర్, లీడర్ అని చెప్పారు. రేవంత్‌రెడ్డి చిల్లరమాటలు ఆపితే మంచిదని సూచించారు. ఓ మంత్రి గవర్నర్‌ని కలిశారని.. ఇంకో మంత్రి కాబోయే సీఎంనని సోషల్ మీడియాలో పెట్టుకుంటున్నారన్నారు. సీఎం చిట్‌చాట్‌లో మాట్లాడి కుర్చీకి ఉన్న గౌరవం తగ్గించారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అబద్దాలు చూసి గోబెల్స్ కూడా సిగ్గుపడుతారన్నారు. రేవంత్ మాట్లాడితే ఎక్కడ ఆ దుర్భాష విని పిల్లలు చెడిపోతారోనని.. ఇండ్లల్లో తల్లిదండ్రులు టీవీలను బంద్ చేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు మూడువైపులా సముద్రం ఉందంటారని.. అలా అయితే గోవా వెళ్లడం ఎందుకని జోకులు వేస్తున్నారన్నారు. రాజీవ్ కంప్యూటర్ కనిపెట్టాడని అంటాడని.. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతారని.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండీ ఇలా మాట్లాడుతూ పోతే.. గ్రూప్-1 పరీక్ష రాసేవాళ్లు ఏమైపోవాలి? అన్నారు.

**రాజకీయ సన్యాసం తీసుకోకుండా ఎంపీగా ఎందుకు పోటీ చేశావ్..?**

మల్లన్నసాగర్ బాధితులకు ఒక్క ఇల్లూ కట్టలేదని తప్పుగా మాట్లాడారని.. మల్లన్నసాగర్‌కు 50వేల ఎకరాలు కాదు.. 17వేల ఎకరాలేనన్నారు. 14వేల ఎకరాలు ప్రభుత్వ పట్టా అసైన్డ్ భూమి.. 3వేల ఎకరాలు ఫారెస్ట్ భూమి అని చెప్పారు. ఏడు గ్రామాలు ముంపునకు గురైతే 14 గ్రామాలు అయ్యాయని తెలిపారు. సీఎం ఇలా మాట్లాడుతూపోతే ఇక ఆయన మాటలను ఎవరూ నమ్మరన్నారు. తాను కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. సన్యాసం తీసుకోకుండా ఎంపీకి ఎందుకు పోటీశారని నిలదీశారు. శుద్ధమైన నదీ జలాలకు బీఆర్ఎస్ అనుకూలమని.. పేదల ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకమని క్లారిటీ ఇచ్చారు. కాళేశ్వరం మంచినీళ్లు మూసీకి తీసుకురావాలన్నది కేసీఆర్ విజన్ అని తెలిపారు. కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తెచ్చేందుకు కేసీఆర్ డీపీఆర్ చేశారన్నారు.

**ఇండ్లను కూల్చి మాల్స్ కట్టొద్దంటున్నాం..**

కొండపోచమ్మ సాగర్ కాకుండా మల్లన్నసాగర్ నుంచి ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. రూ.1100కోట్లతో అయ్యే పనిని రూ.7వేలకోట్ల కమిషన్ కోసం పెంచారని మండిపడ్డారు. గచ్చిబౌలిలో 450 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని.. మూసీ బాధితులకు ఆ స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.75కోట్లకు ఎకరా భూమి అమ్మింది రేవంత్ ప్రభుత్వమేనన్నారు. 2013 యాక్ట్ కంటే బాగా ఇవ్వమని తాము అడుగుతున్నామన్నారు. రేవంత్ పాలనలో ఇండ్లు కూల్చారు తప్పా.. ఒక్కటైనా కట్టారా? అని హరీశ్‌రావు నిలదీశారు. ఇండ్లను కూలగొట్టి మాల్ కట్టొద్దని అంటున్నామని.. ఏక్ పోలీసింగ్ కోసం పోలీసుల పోరు జరుపుతున్నారని.. రేవంత్ చెప్పిందే వారు అడుగుతున్నారన్నారు. తల్లి పిల్లల్ని నమ్మనట్లుగా హోంశాఖను తనవద్దే ఉంచుకొని నమ్మకపోతే ఎలా? అంటూ ధ్వజమెత్తారు. అంబేద్కర్ విగ్రహానికి సీఎం దండ వేయరని.. అక్కడికి ఎవరినీ వెళ్లనీయరంటూ హరీశ్‌రావు ధ్వజమెత్తారు.



ఆనందసాయి



నన్నూరి నర్సిరెడ్డి



సుచిత్ర ఎల్ల



మహేందర్ రెడ్డి

# టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు

**(మొదటి పేజీ తరువాయి)**

మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, పనబాక లక్ష్మి, నన్నపనేని సదాశివరావు, జాస్తి పూర్ణ సాంబశివరావు, కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, శాంతారామ్ నియమితులయ్యారు.

**తెలంగాణ నుంచి ఎవరంటే..**

తెలంగాణ నుంచి నన్నూరి నర్సిరెడ్డి, బొంగునూరు మహేందర్ రెడ్డి, భారత్ బయోటెక్ జేఎండీ సుచిత్ర ఎల్ల, అనుగోలు రంగశ్రీ, ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయికి అవకాశం దక్కింది. కర్ణాటక నుంచి దర్శన్, నరేష్‌కుమార్, జస్టిస్ హెచ్.ఎల్.దత్‌లు బోర్డులో చోటు దక్కించుకున్నారు. తమిళనాడు నుంచి కృష్ణమూర్తి, పి.రామ్మూర్తి ఉన్నారు. మహారాష్ట్ర నుంచి శ్రీ సౌరభ్ హెచ్.బోరా, గుజరాత్ నుంచి డాక్టర్ అదిత్ దేశాయ్ బోర్డు సభ్యులుగా వ్యవహరించనున్నారు.

## టీటీడీ పాలకమండలి సభ్యులు:

| | |
|---|---|
| జ్యోతుల నెహ్రూ | జస్టిస్ హెచ్.ఎల్.దత్ |
| వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి | పి.రామ్మూర్తి |
| ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు | తమ్మిశెట్టి జానకీదేవి |
| పనబాక లక్ష్మి | బి.మహేందర్‌రెడ్డి |
| నర్సిరెడ్డి | అనుగోలు రంగశ్రీ |
| జాస్తి పూర్ణ సాంబశివరావు | సుచిత్ర ఎల్ల |
| నన్నపనేని సదాశివరావు | బూరగపు ఆనందసాయి |
| కృష్ణమూర్తి | నరేశ్ కుమార్ |
| కోటేశ్వరరావు | డా.అదిత్ దేశాయ్ |
| మల్లెల రాజశేఖర్ గౌడ్ | సౌరభ్ హెచ్.బోరా |
| జంగా కృష్ణమూర్తి | శాంతారామ్ |
| ఆర్.ఎన్.దర్శన్ | |

# ఎల్ఓసీ వెంబడి ఉద్రిక్తతలకు ముగింపు

**ఢిల్లీ:** తూర్పు లద్దాఖ్‌లోని డెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో భారత్, చైనా బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయినట్లు సైనిక వర్గాలు తాజాగా వెల్లడించాయి. స్థానిక కమాండర్ల స్థాయిలో చర్చలు కొనసాగుతాయని.. ఇరువర్గాలు గురువారం మిఠాయిలు పంచుకోనున్నట్లు తెలిపాయి.ఎల్ఏసీ వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ.. ఇటీవల భారత్, చైనాల మధ్య గస్తీ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే లద్దాఖ్‌లోని డెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో భారత్, చైనా బలగాల ఉపసంహరణ పూర్తయింది.ఇటీవల భారత్, చైనా మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా కీలక ప్రాంతాల నుంచి ఇరుదేశాల సైనికులు తమ మౌలిక సదుపాయాలను, ఇతర సామగ్రిని వెనక్కి తీసుకున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఇరు దేశాల మధ్య కుదిరిన గస్తీ ఒప్పందం ప్రకారం.. అక్టోబర్ 29 లోగా బలగాలను ఉపసంహరించుకోవాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపాయి. దీంతో 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు.

# కులగణనలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ

**(మొదటి పేజీ తరువాయి)**

చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది ప్రత్యేక అబ్జర్వర్లను నియమించాలని రేవంత్ రెడ్డి సూచించారు. బాధ్యతగా పనిచేయాలని కష్టానికి తగిన ఫలితం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా పార్టీ క్షమించదని హెచ్చరించారు. నవంబర్ లోగా ప్రక్రియ పూర్తి చేసి భవిష్యత్తు యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాల్సి ఉందని స్పష్టం చేశారు. కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదని అది మెగా హెల్త్ చెకప్ లాంటిదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో మన తెలంగాణను మోడల్ గా పరిగణనలోకి తీసుకునేలా డాక్యుమెంటును కేంద్రానికి పంపుతామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నది బీసీ కులగణన కాదు.. సమగ్ర కులగణన అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

## నువ్వు చెప్పులు మోసిన నాడు కేసీఆర్ ఉద్యమానికి ఊపిరిపోశాడు

- నువ్వా ఆయన పేరు చెరిపేసేది?
- రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు మర్చిపోయేలా చేశానన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. చిట్టి నాయుడు.. నువ్వా కేసీఆర్ పేరును తుడిచేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ చరిత కేసీఆర్ అని చెప్పారు. నువ్వు చెప్పులు మోసిన నాడు ఆయన ఉద్యమానికి ఊపిరి పోశాడని తెలిపారు. నువ్వు పదవుల కోసం పరితపిస్తున్న నాడు, ఆయన ఉన్న పదవిని తృణప్రాయంగా వదిలేశారని పేర్కొన్నారు. నువ్వు ఉద్యమకారుల మీద గన్ను ఎక్కుపెట్టిన నాడు.. ఆయన ఉద్యమానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టారని చెప్పారు. నువ్వు సాధించుకున్న తెలంగాణను సంపెటందుకు బ్యాగులు మోస్తున్ననాడు, ఆయన తెలంగాణ భవిష్యత్ కు ఊపిరి పోశాడని ఎక్స్ వేదికగా అన్నారు.

# తెలంగాణలో మయోనైజ్ నిషేధం

**విశ్వంభర, హైదరాబాద్:** మయోనైజ్‌పై నిషేధం విధించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల మోమోస్ తిని ఒక మహిళ మరణించడంతో పాటు పలువురు అస్వస్థతకు గురైన నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులతో సమీక్ష నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో పలు హోటళ్లు, ఫుడ్‌స్టాళ్లలో తరచూ ఎంక్వైరీలను చేయాలని సంబంధిత అధికారులకు ఈ సందర్భంగా మంత్రి కీలక సూచనలు చేశారు.

**రాష్ట్రంలో మూడు టెస్టింగ్ ల్యాబ్‌లు**

రాష్ట్రంలో నూతనంగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు. కల్తీ ఆహారపదార్థాల్ని తీసుకొని పలువురు తీవ్ర అనారోగ్యం పాలవుతోన్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లుగా తెలుస్తోంది. సాధారణంగా ఈ మయోనైజ్‌ను ఎక్కువగా మండి బిర్యానీ, కబాబ్‌లు, పిజ్జాలు, బర్గర్లు, శాండ్‌విచ్‌లు, ఇతరత్రా ఆహార పదార్థాల్లో చెట్నీలా వేసుకుని తింటారు. ఇటీవల జరిగిన ఘటనలతో బల్దియా ఆహార కల్తీ నియంత్రణ విభాగం అప్రమత్తమైంది. ఎన్నిసార్లు చెప్పినప్పటికీ హోటళ్లు తీరు మారట్లేదంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ మేరకు ఆ పదార్థాన్ని నిషేధించేందుకు అనుమతి కోరింది.

**వరుస ఘటనల నేపథ్యంలో**

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ నందినగర్, సింగాడకుంట బస్తీ, గౌరిశంకర్‌కాలనీలలో గత శుక్రవారం సంత జరిగింది. అక్కడ ఏర్పాటు చేసిన 'దిల్లీ హాట్ మోమోస్' దుకాణంలో విక్రయించిన నాన్‌వెజ్ మోమోస్, వాటితో పాటు ఇచ్చిన మయోనైజ్, చట్నీని బస్తీకి చెందిన రేష్మబేగం అనే మహిళ, ఆమె పిల్లలు రుమ్షా, రఫియాలు తిన్నారు. అదేరోజు రాత్రి ముగ్గురికీ విరోచనాలు, వాంతులు అయ్యాయి. పిల్లలిద్దరినీ హాస్పిటల్‌లో చేర్చగా తల్లి ఇంట్లోనే ఉంది. ఆదివారం రేష్మబేగం (31) ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మరణించింది. ఈ కేసులో పోలీసులు ఇవాళ మోమోస్ విక్రయించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

**నాసిరకం మయోనైజ్ తిని హాస్పిటల్ పాలై**

ఇటీవలే అల్వాల్‌లోని గ్రిల్ హౌజ్ హోటల్‌లో నాసిరకమైన మయోనైజ్‌ను తిన్న కొందరు యువకులు ఇటీవల హాస్పిటల్ పాలయ్యారు. వారం కిందట ఐదుగురు వాంతులు, విరేచనాలతో స్థానిక హాస్పిటల్‌లో చేరడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది జనవరి 10న కూడా ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. అదే హోటల్‌లో షవర్మను తిన్న 20 మందికిపైగా యువకులు 3, 4 రోజులయ్యాక అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. కొంతమందికి బ్లడ్ టెస్ట్‌లు చేయగా హానికర సాల్మనెల్లా బాక్టీరియా ఉన్నట్లు వైద్యులు తేల్చారు. ఆ హోటల్‌లోని షవర్మ బాగోలేదని బల్దియాకు ఫిర్యాదులు అందాయి.

**ఇటీవల తనిఖీల్లో నాణ్యతలేని మయోనైజ్ గుర్తింపు**

ఇవి మాత్రమే కాదు సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌లోని ఓ హోటల్‌లో, టోలిచౌకి, చాంద్రాయణగుట్ట, కాటేదాన్, బంజారాహిల్స్‌లోని పలు హోటళ్లలోని మండి బిర్యానీ, బర్గర్లు, షవర్మ, బల్దియాకు వరుస ఫిర్యాదులు అందాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ హోటళ్లు, పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్లలో జరిపిన తనిఖీల్లోనూ చీఫ్ క్వాలిటీ మయోనైజ్‌ను అధికారులు గుర్తించారు. ఉడికించని పదార్థమైనందున మయోనైజ్‌లో హానికరమైన బాక్టీరియా విపరీతంగా వృద్ధి చెందుతుంది. చట్నీగా ఉపయోగించే మయోనైజ్‌ను గుడ్డులోని పచ్చసొన, నూనె, ఉప్పు, నిమ్మరసం, తయారు చేస్తారు.

# మహారాష్ట్ర ఎన్నికలపై కాంగ్రెస్ కసరత్తు

- రంగంలోకి దిగిన ఏ.ఐ.సి.సి పరిశీలకులు కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి,సచిన్ పైలెట్‌లు
- సమన్వయ సమావేశాలతో మార్గదర్శనం
- దక్షిణాదిలో పట్టు సాధించేందుకు వ్యూహ రచన




**విశ్వంభర, హైదరాబాద్:** కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాలలో సంచలన విజయాలు నమోదు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్రలోనూ విజయం సాధించి దక్షిణాదిన పట్టు సాధించేందుకు గట్టి కసరత్తు మొదలు పెట్టింది. కలసి వచ్చే భాగస్వామ్య పక్షాలతో సమన్వయం చేసుకుని సీట్ల సర్దుబాటు అంశంలో ఎటువంటి భిన్నాభిప్రాయాలు లేకుండా చూసేందుకు ఆ పార్టీ కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు ఏ.ఐ.సి.సి నుండి పరిశీలకులుగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి,సచిన్ పైలెట్ లు బుధవారం మహారాష్ట్ర లోని నాందేడ్ లో సమన్వయ సమావేశం నిర్వహించి లీడర్ తో పాటు క్యాడర్ కు ఎన్నికల రూట్ మ్యాప్ పై దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే తెలంగాణా,కర్ణాటక రాష్ట్రాలలో సంచలన విజయాలు నమోదు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర లోనూ భాగస్వామ్య పక్షాలతో కలిసి విజయం సాధించి దక్షిణాదిలో బిజెపి దూకుడుకు ముకు తాడు వేసేందుకు గట్టి ప్రయత్నాలు మొదలు పెట్టింది. తద్వారా మహారాష్ట్ర లో కాంగ్రెస్ పార్టీకీ పూర్వ వైభవం సంతరించుకునేలా ఆ పార్టీ చేసిన వ్యహరచనను నాందేడ్ లో జరిగిన సమన్వయ సమావేశంలో పరిశీలకులుగా వెళ్లిన కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి,సచిన్ పైలెట్ లు మార్గదర్శనం చేశారు.

# దేదీప్యమానంగా దీపోత్సవం..

**(మొదటి పేజీ తరువాయి)**

వెలిగించిన దాదాపు 22.23 లక్షల దీపాల వెలుగులో ధగధగలాడింది. శ్రీరామ జన్మభూమి అయోధ్యలో జరిగిన ఏడో దీపోత్సవం.. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది.ఈ కార్యక్రమాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మహాహారతి ఇచ్చి ప్రారంభించారు. గత తొమ్మిదేళ్లలో దేశంలో ప్రధాని మోదీ స్థాపించిన 'రామరాజ్యం' పునాదిని అయోధ్య మందిర నిర్మాణం బలపరుస్తుందని యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ దీపోత్సవం ద్వారా ఉజ్జయిని పేరిట ఉన్న 18లక్షల 82వేల దీపాల రికార్డ్‌ను బ్రేక్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**దీపోత్సవానికి భారీ ఏర్పాట్లు..**

రామమందిరం ప్రారంభమైన తర్వాత తొలిసారి వేడుకలు కావడంతో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. గిన్నిస్ రికార్డుల్లోకెక్కేలా ఉత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఇందుకు సంబంధించి 55 ఘాట్‌లలో ఏర్పాటు చేసిన ప్రమిదలను ప్రత్యేక డ్రోన్లతో గిన్నిస్ ప్రతినిధులు లెక్కించారు.25 లక్షల దీపాలను వెలిగించాలని లక్ష్యంగా పెట్టుకున్న నిర్వాహకులు.. దాదాపు 28 లక్షల ప్రమిదలను ముందస్తుగానే ఆర్డర్ చేశారు.రామమందిరంతోపాటు పరిసర ప్రాంతాలను దీపాలతో అలంకరించారు.దీపోత్సవ కార్యక్రమంలో 30వేల వాలంటీర్లు పాల్గొన్నారు. ఓ ఘాట్ వద్ద 80వేల దీపాలతో స్వస్తిక్ ఆకారంలో దీపాలను వెలిగించారు.పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆవు నెయ్యితో లక్షన్నర దీపాలను వెలిగించారు.ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక పూజలు చేసి.. హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.మయన్మార్, నేపాల్, థాయిలాండ్, మలేసియా, కంబోడియా, ఇండోనేసియాకు చెందిన కళాకారులతో వేదిక వద్ద ప్రదర్శన నిర్వహించారు.ఘాట్‌ల వద్ద దాదాపు 5 నుంచి 6వేల మంది అతిథుల కోసం ఏర్పాట్లు చేశారు.లైవ్ కవరేజీ కోసం పెద్ద తెరలు ఏర్పాటు చేశారునగరం మొత్తం దాదాపు 10వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు.

# నందనవనం ఆక్రమణదారులను ఖాళీ చేయించాలి

**విశ్వంభర, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా ఎల్. బి. నగర్ నియోజకవర్గం పరిధిలోని నందనవనంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకున్నవారిని తక్షణం ఖాళీ చేయించి అర్హులైన వారికి అందించాలని రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మంకాల్, నందనవనంలో ఉన్న ఇండ్ల సమస్య, కేటాయింపుపై అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాష్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ డి. దివ్య, ప్రస్తుత రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన డాక్టర్ ఎస్. హరీష్, కె. శశాంక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్రమంగా ప్రభుత్వ ఇండ్లను ఆక్రమించుకున్నవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఎలాంటి రాజకీయ వత్తిడులకు తలొగ్గవద్దని అధికారులకు సూచించారు.నందనవనంలో జె ఎన్ యూ ఆర్ ఎం పథకం కింద ప్రభుత్వం నిర్మించిన ఇండ్ల కోసం 2019లో దరఖాస్తు చేసుకొని, లబ్దిదారుని వాటా చెల్లించిన వారి ఇండ్లను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకోవడం పట్ల మంత్రిగారు తీవ్రంగా స్పందించారు. బాధితులకు న్యాయం చేయాలని , అక్రమంగా ఆక్రమించుకున్న వారినుంచి ఇండ్లు స్వాధీనం చేసుకొని వారికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే మంకాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో ఉన్న న్యాయపరమైన సమస్యలను తక్షణం పరిష్కరించి, అర్హులైన వారికి కేటాయించాలని అధికారులకు సూచించారు. ఈ రెండు అంశాలపై పూర్తిస్థాయి నివేదికను తనకు అందించాలని, వీలైనంత త్వరితగతిన ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు అన్యాయం జరిగితే ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. ప్రజావాణిలో గృహనిర్మాణానికి సంబంధించి వచ్చే ఫిర్యాదులను సచివాలయంలోని తన కార్యాలయానికి పంపించాలని నోడల్ అధికారికి దివ్యకు సూచించారు.వాటి పరిష్కారానికి తన కార్యాలయంలో ఒక ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పగించనున్నట్లు మంత్రి తెలిపారు.


# విధ్వంసపాలన చీకట్లు తొలిగాయి ఇక తెలంగాణలో వెలుగులే!

**(మొదటి పేజీ తరువాయి)**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రజలకు దీపావళి పండుగ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొనే దీపావళి పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ఈ దీపాల కాంతులతో ప్రతి ఇంటింటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నా పెద్దలందరూ పండుగ జరుపుకోవాలని, ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

**రాష్ట్ర ప్రజలకు కెసీఆర్ దీపావళి శుభాకాంక్షలు**

రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ దీపావళి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



మనిషి తనలోని మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందని ఆయన తెలిపారు. దీపావళి పర్వదినానికి హిందూ సంస్కృతి లో ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

**విషం చిమ్ముతున్న వారిలో జ్ఞాన దీపం వెలగాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో పదేళ్ల చీకటిని పారదోలి ప్రజలు వెలుగురేఖలను సృష్టించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రజాపాలనపై విషం చిమ్ముతున్న అజ్ఞానులకు.. జ్ఞానదీపం వెలిగేలా లక్ష్మీదేవి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా మంత్రి కోరుకున్నారు. ఈ దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగురేఖలను ఇనుమడింపచేయాలని ఆకాంక్షించారు. చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.




# మత్తులో ఊగుతున్న పల్లెలు

- కిరాణా షాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు
- ఎడదారి పడుతున్న యువత
- పచ్చని సంసారాలను పాడు చేస్తున్న మద్యం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్ అధికారులు

**విశ్వంభర చింతపల్లి :** పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. మారుమూల గ్రామాలు మత్తులో ఊగుతున్నాయి. గ్రామాలు, తండాల్లో పుట్టగొడుగుల్ల బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అనేక మంది బెల్టుషాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధి పాలవుతున్నాయి.

## పట్టించుకోని అధికారులు

బెల్టు షాపుల ద్వారా ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరుతోంది. మరింత ఆదాయాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బెల్టుషాపులను అంతర్గతంగా ప్రోత్సహిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో మహిళల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అటు ఎక్సైజ్ శాఖ అధికారులు కానీ.. ఇటు పోలీసులు కానీ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## అధికారుల కనుసన్నల్లోనే..

చింతపల్లి మండలంలో మద్యం అమ్మకాలు కోట్ల రూపాయల్లో జరుగుతున్నాయి. మండలంలోని వైన్స్ షాపులు జోరుగా నడుస్తున్నాయి. ఈ మద్యం దుకాణాలలో ప్రతీనెల కోట్ల రూపాయల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్స్ యజమానులు, ఎక్సైజ్ అధికారుల అండదండలతో మండల వ్యాప్తంగా ఊరూరా బెల్టుషాపులు నడుస్తున్నాయి. మద్యం అమ్మకాలు పెంచాలని ప్రభుత్వం ఎక్సైజ్ అధికారుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ఎక్కువ ధరలకు ఊరూరా బెల్ట్‌షాపులు పెట్టి అనధికారికంగా మద్యం అమ్ముతున్నట్లు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

## ప్రతీ కిరాణా కొట్టులో...

మండలంలోని పలు గ్రామాల్లో పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిజ్జులు ఏర్పాటు చేసుకుని బీర్లు విక్రయిస్తున్నారు. వైన్‌షాపుల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు నిత్యం ఆటోల ద్వారా పంపించి అమ్ముతున్నారు. మద్యం తాగి చాలామంది ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా మద్యం ఏరులై పారుతోంది.

## మద్యానికి బానిసై అఘాయిత్యాలకు..

మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతోంది. ఊరూరా బెల్లుషాపులు పట్టుగొడుగుల్లా వెలుస్తున్నాయి. దీంతో పొద్దంతా పనిచేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. మద్యానికి బానిసై అఘాత్యాలకు ఒడిగడుతున్నారు. మండలంలో నిత్యం ఎక్కడో ఓ చోట మద్యం మత్తులో నేరాలు, ఘోరాలు జరుగుతూనే ఉన్నాయి.

### మా ఊళ్లో బెల్టుషాపులు తీసేయాలి: ఘడియ గౌరారం మాజీ సర్పంచ్ ఎదుళ్ళ గిరిబాబు



చింతపల్లి మండలం ఘడియ గౌరారం గ్రామంలో విచ్చల విడిగా బెల్టుషాపులు వెలిశాయి. ఇటు అధికారులు కానీ.. అటు ప్రజాప్రతినిధులు కానీ.. పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పచ్చని సంసారాలు పాడవుతున్నాయి. వేకువ జామునే బెల్టుషాపులు తెరిచి ఉంటున్నాయి. ఈ గ్రామంలో ప్రతి కిరాణా షాపు బెల్టుషాపుగా మారింది. యువకులు తాడుగుకు బానిస అవుతున్నారు. ఉదయం లేవగానే చాయ్ తాగుతారో లేదో తెలియదు కానీ.. మద్యం మాత్రం తాగకుండా ఉండలేక పోతున్నారని, పనిచేసిన డబ్బులు మొత్తం తాగుడుకు ఖర్చు పెడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్లుషాపులు తొలగించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.

# రూ.12 కోట్లతో పటాన్‌చెరులో ఇండోర్, మరో రెండు సబ్ స్టేషన్లు : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..



**విశ్వంభర, సంగారెడ్డి :** నియోజక వర్గ ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు అందించేందుకు నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నట్లు పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్ చేరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణం, పటాన్ చేరు మండల పరిధిలోని రామేశ్వరం బండ, పోచారం పరిధిలో నూతన సబ్ స్టేషన్ లో ఏర్పాటు కోసం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కోతలు లేని నిరంతరాయ విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో పటాన్ చేరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో 12 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 33/11 కేవి సబ్ స్టేషన్, పోచారం, రామేశ్వరం బండ పరిధిలో ఏడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రెండు 33/11 కేవి సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో స్థలాలను కేటాయించి సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ భాస్కరరావు, ఏడి దుర్గాప్రసాద్, తహసిల్దార్ రంగారావు, రామేశ్వరం బండ మాజీ సర్పంచ్ అంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి సర్వేపై శిక్షణా శిబిరం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం యందు బుధవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోవు సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) పై ఎన్యూమరెటర్లకు శిక్షణ కల్పించుటకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాఘవ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి యాకుబ్ నాయక్, మండల పంచాయతీ అధికారి రావూఫ్ అలీ, మండల విద్యాధికారి, మండల వ్యవసాయ అధికారి, మండల సీడీపీఓ, మాస్టర్ ట్రైనర్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సూపర్వైజర్లు, రెవెన్యూ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, వీఓఏలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సమగ్ర కులగణన సర్వే పై శిక్షణ



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ కుల సర్వే శిక్షణ శిబిరాన్ని స్థానిక రైతుకు వేదికలో మున్సిపల్ కమిషనర్ వసంత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఏ విధంగా చెయ్యాలో తెలిపి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్యుమేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆశాకార్యకర్తలు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జియో ట్యాగ్ ద్వారా రైతుల వివరాలు ఆన్లైన్ చేయండి



**విశ్వంభర, మహబూబాబాద్:** కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అధ్యక్షతన 24-25, సంవత్సరం వానాకాలం సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అందుకు సంబంధించి ఐకేపీ 64, సహకార శాఖ 153, గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ 11, ఇతరులు 6, మొత్తం 234 దాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపామని, సన్న రకాలు, దొడ్డు రకాలు, కేంద్రాలను వేరువేరుగా ఏర్పాటు చేయనున్నట్లు, ప్రభుత్వ సూచనల మేరకు మాయిశ్చర్ వచ్చేంత వరకు చూసి కేంద్రాలకు దాన్యం తీసుకురావాలన్నారు. టార్పాలిన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని, కొనుగోలు చేసే ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని జియో ట్యాగింగ్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ధాన్యం తీసుకువచ్చే రైతుకు వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి అవగాహనను కల్పించాలని తద్వారా వెంట వెంటనే వారి అకౌంట్లో డబ్బులు జమవుతాయని తెలిపారు. సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్, ట్రాన్స్పోర్టేషన్, రెవెన్యూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీ ఆర్ డీ ఓ మధుసూదన్ రాజు, డీ సీ ఓ వెంకటేశ్వర్లు, డీ హెచ్ ఓ మరియన్న, వ్యవసాయ శాఖ ఏడీ మురళీ, లీగల్ మెట్రోలజీ విజయ్ కుమార్, ఆర్టీవో సాయి చరణ్, మెప్మా పీడీ విజయ, డీఎం మార్కెటింగ్, తదితరులు పాల్గొన్నారు.

# మధుయాష్కీపై ఆరోపణలు చేస్తే ఊరుకోం

## - డి.సి.సి అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్



**విశ్వంభర, ఎల్బీ నగర్ :** ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మధు యాష్కీ పై ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని డిసిసి అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ మండి పడ్డారు. ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని , నీ భూదందాలు, అవినీతి కబ్జాలు , ఎల్బీ నగర్ నియోజకవర్గ ప్రజలకు తెలియదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. చెరువుల కబ్జాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు , ఐదు సం.రాలు అధికారంలో ఉండి ఎన్నో అన్యాయాలకు పాల్పడ్డవని అన్నారు. 118 జీవో ద్వారా బి ఎన్ రెడ్డి , సాగర్ కాంప్లెక్స్ ప్రజలకు ఎందుకు న్యాయం చేయలేదు. మీ ఆస్తులు కాపాడుకోవడం కోసం పూటకో పార్టీ మారే మీరు దొంగ దొంగే అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేసారు. బిసి, ఎస్సి, ఎస్టి నాయకుల మీద అక్రమ కేసులు పెట్టి రాజకీయంగా ఎదగకుండా అడ్డుకున్నారని అన్నారు. జర్నలిస్టులు మీరు చేసిన భూదందాలు, అక్రమ ఆస్తులు, కబ్జాల పరంపర మీద వార్తలు రాస్తే జర్నలిస్టులను బెదిరించి కేసుల పెట్టించిన చరిత్ర నీది కాదా! అని ప్రశ్నించారు. గుర్తించుకో ఇంకోసారి మధు యాష్కీ పై ఆరోపణలు చేస్తే ఎల్బీ నగర్ ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని అన్నారు.

# జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

## - కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ దీపావళి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలంటూ ప్రజలకు పలు సూచనలు చేశారు. బాణాసంచాలు కాల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ముఖ్యంగా చిన్నారులు పెద్దల సమక్షంలో బాణాసంచాలు కాల్చే విధంగా చూడాలని సూచించారు. బాణసంచా విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, పురపాలక, పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బాణసంచా దుకాణాల వద్ద రక్షణ చర్యలు పాటించాలని, ఎక్కడ పడితే అక్కడ బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌లో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని, వాహన దారులు బాణసంచా దుకాణాలకు దూరంగా పార్కింగ్ చేయాలని సూచించారు. ఏదేని ప్రమాదం వాటిల్లితే తక్షణ చర్యలు చేపట్టేందుకు అగ్నిమాపక వాహనాలు, ఇసుక మరియు నీళ్ల డ్రములు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలను, కొత్త వెలుగులను నింపాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రైవేట్ పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** లెనోరా ప్రైడ్ స్కూల్ పైన విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆమనగల్లు ఎంఈఓ పాండు కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సంతోష్ మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న లెనోవా ప్రైడ్ స్కూల్ పైన విచారణ జరిపించాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ స్కూల్ల పైన విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా అమంగల్ లో ఉన్న అన్ని ప్రైవేట్ స్కూళ్లకు సంబంధించి ఎంఈఓ పాండు ఆర్టీఐ ద్వారా సమాచారం అడగడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నితిన్, మల్లేష్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 4న అఖిల పక్షాల రౌండ్ టేబుల్

## - ఆప్ డా.సుధాకర్



**విశ్వంభర, బషీర్ బాగ్:** మూసీ బాధితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి నవంబర్ 4 న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అనేకమంది బడుగుబలహీన వర్గాలవారు అనేక సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని, ఇళ్ళు కట్టుకొని కూలినాలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని, మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చితే వారు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ దూకుడు తీరుతో మూసీ బాధితులు అనేకమంది తీవ్ర భయాందోళనకు గురౌతున్నారని చెప్పారు. శాశ్వత పునరావాసం కల్పించాకే మూసీ బాధితుల ఇళ్ళు కూల్చాలని, డీపీఆర్ ప్రాజెక్టు రిపోర్ట్ తక్షణమే విడుదల, మూసీ నది ప్రక్షాళనకు సమగ్ర అధ్యయనం, నిపుణుల సలహాలు సూచనలు, మూసీ ప్రక్షాళనపై అఖిలపక్ష కమిటీ వేయడం వంటి డిమాండ్లపై ఈ అఖిలపక్ష సమావేశంలో చెర్చించి పలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని, ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలతోపాటు ఇతర జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలు కూడా పాల్గొని తమ పార్టీల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు అందిస్తారని డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు.

# రోడ్డు విస్తరణ పనులు సత్వరమే పూర్తి చేయాలి

## -జిల్లా అధికారులకు ఎమ్మెల్సీ రవీందర్ రావు ఆదేశాలు



**విశ్వంభర, మహబూబాబాద్:** మున్సిపాలిటీ పరిధిలో నెహ్రూ సెంటర్ నుండి పత్తిపాక వరకు టిఎఫ్ ఐడిసి నిధులు ఐదు కోట్ల నిర్మాణ వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు పరిశీలించారు. ఆ రోడ్డులో నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఎమ్మెల్సీ తక్షణం స్పందించి జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో, మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్స్, మున్సిపాలిటీ కమిషనర్ డి. ఈ. మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మారినేని వెంకన్న, మున్సిపాలిటీ అధికారులు కమిషనర్ నోముల రవీందర్ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రవీణ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిప్ప ఉపేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# జోరుగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు



**విశ్వంభర, రామన్నపేట:** కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే పార్టీ తెలుగు దేశం పార్టీ అని రామన్నపేట తెలుగు యువత మండల అధ్యక్షుడు మీర్జా ఫజల్ బేగ్, తెలంగాణ తెలుగుదేశం పార్టీ టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నకిరేకంటి గణేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని పోచబోయిన మల్లేష్, కుర్మ మహేందర్‌ల ఆధ్వర్యంలో తుమ్మలగూడెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ 2024-26కు సంబంధించిన పార్టీ సభ్యత్వాలు చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించాలని, సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో అన్న కీ.శే. నందమూరి తారక రామారావుచే తెలంగాణ గడ్డమీద పురుడు పోసుకున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని, విజనరీ లీడర్, జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ముందు చూపుతో నడుస్తున్న పార్టీ అని, వినూత్నంగా ప్రతి ఒక్కరికి ఆన్ లైన్‌లో సభ్యత్వాలు ఇచ్చే పార్టీ అని, నిత్యం ప్రజాసమస్యల మీద అలుపులేని పోరాటం చేసే పార్టీ అని, నాయకులు పోయినా, కార్యకర్తలు చెక్కుచెదరని పార్టీ అని, కార్యకర్తలని నాయకులుగా తయారు చేసే రాజకీయ విశ్వవిద్యాలయం అని అన్నారు. వారి కాళ్ళపై వాళ్లు నిలబడే విధంగా నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు, వారికి ఉద్యోగం ఇప్పించే ప్రయత్నం పార్టీ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సత్యనారాయణ, దగ్గుల ఐలయ్య, వెలకుర్తి వీరాచారి పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తూ చెరువులోపడి యువకుడు మృతి



**విశ్వంభర, పెద్ద శంకరం పేట్:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కమలా పూర్ గ్రామ శివారులోని గోపాన చెరువులో ప్రమాదవశాత్తు వ్యక్తి పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పేట ఏఎస్ఐ విటల్ తెలిపిన వివరాల ప్రకారం పెద్ద శంకరం పేట కు చెందిన నాందేడ్ సునీల్ కుమార్ అతని స్నేహితుడు చంద్రశేఖర్ ఇరువురు మంగళవారం సాయంత్రం కమలాపూర్ గోపాన చెరువు చివరన చెట్టు కింద కూర్చొని మద్యం సేవించడం తో పాటు చిన్నపాటి విందు చేసుకున్నారు. అనంతరం మద్యం మత్తులో చెరువులోకి ఈతకు దిగారు. నాందేడ్ సునీల్ కుమార్ మత్తులో ఉండడంతో ప్రమాదవశాత్తు చెరువులోనే మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా సునీల్ కుమార్ మృతదేహం లభించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కేసీఆర్, కేటీఆర్, కవిత చిత్రపటాలకు పాలాభిషేకం

**విశ్వంభర, జగిత్యాల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పైన వేయాలనుకున్న 18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ఆపడంలో విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రజల తరపున బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఏస్ శ్రేణులు కేసీఆర్, కేటీఆర్, కల్వకుంట్ల కవిత చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు జరిపారు. పది సంవత్సరాల్లో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచని బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా కేవలం 10 నెలల్లోనే 18,500 కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం చేస్తే ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకించామని పబ్లిక్ హియరింగ్ లో పాల్గొని ఈ ఆర్ సీని ఒప్పించామని అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపించిన ఇలాంటి సందర్భం చారిత్రాత్మకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ ఛైర్మన్ దావ వసంత సురేష్, మాజీ ఎంపీపీ మారుసాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘం సన్నాహక సమావేశం



**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండల ముదిరాజ్ సంఘ నాయకులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడానికి బుధవారం సన్నాహక సమావేశాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నవంబర్ 5వ తేదీన దేవకీ గార్డెన్ లో జరుగు నూతన కార్యవర్గ సమావేశానికి ముదిరాజ్ కుల పెద్దలు యువకులు హాజరుకావాలని అనంతరం ముదిరాజ్ మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు బొల్లా యాదగిరి, మాజీ జడ్పిటిసి పద్మ నర్సింహా, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్ట్, శానమోని పాండు , ముదిరాజ్ సంఘం కల్వకుర్తి తాలూకా ప్రధాన కార్యదర్శి పద్మ అనిల్ , మాజీ మండల అధ్యక్షులు రొయ్యల యాదయ్య, ముదిరాజ్ సంఘం మండల యువజన అధ్యక్షులు పుట్ట నాగరాజు, గ్రామ అధ్యక్షులు బొల్ల బాలయ్య, శానామోని పాండు, నూకం శేఖర్, భాషమోని శ్రీరాములు, నూకం శేఖర్, నూకం శ్రీరామ్, పద్మ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

# సర్వే మ్యాపింగ్ పరిశీలించిన జేసీ



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణంలోని 14వ వార్డు రామ చంద్రపురం, సమగ్ర ఇంటింటికి సర్వే మ్యాపింగ్ ను పరిశీలించిన అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, లెనిన్ వత్సల్ టోప్పో, ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని ఏ ఒక్క ఇల్లు మిస్ కాకుండా సర్వే నిర్వహించాలని, డబుల్ సర్వే రాకుండా చూడాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ భగవాన్ రెడ్డి ఉన్నారు.

# పార్వతమ్మకు ఘన నివాళులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలానికి చెందిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) భువనగిరి జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి, తన చిన్ననాటి మిత్రుడు, భువనగిరి న్యాయవాది, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా నాయకుడు గోలనుకొండ లింగయ్య తల్లి గోలనుకొండ పార్వతమ్మ దశదినకర్మ చిట్యాల మండలంలోని వారి స్వగ్రామం ఏపూరులో జరిగిన కార్యక్రమానికి హాజరై, పార్వతమ్మ చిత్ర పటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

## సమగ్ర కుటుంబ సర్వే పై శిక్షణా శిబిరం




**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండల కేంద్రం కంప సాగర్ లో గల మోడల్ స్కూల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోవు సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే( సమగ్ర ఇంటింటి సర్వే) పై ఎమ్యునరేటర్లకు ట్రైనింగ్ ఇవ్వడానికి ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలం స్పెషల్ ఆఫీసర్ (జడ్పీ సీఈఓ) ప్రేమ్ కరణ్ రెడ్డి, ఎంపీడీఓ విజయ కుమారి, ఎం.ఆర్.ఓ ప్రమీల, ఏఓ పార్వతి, ఎంపీవో సుధీర్ కుమార్, ఏఎస్ఓ దీప, ఏపీఓ శ్యామల, ఏపీఎం అశోక్, ఇతర గ్రామపంచాయతీ సెక్రటరీ లు, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ 2024 ను విజయవంతం చేయాలి

- సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం కప్ 2024 విజయవంతనికి రాష్ట్రంలోని క్రీడా సంఘాలన్నీ సమిష్టిగా కృషి చేయాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి కోరారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో ఆయన క్రీడా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి లలో నిర్వహించే ఈ పోటీలను మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతిభకు ప్రోత్సాహం దక్కేలా క్రీడా సంఘాలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఎండీ సోనీ బాలాదేవి తో పాటు అధికారులు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం



**విశ్వంభర, అంబర్ పేట్:** గోల్నాక డివిజన్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో అంబర్పేట్ నియోజకవర్గం పలు అభివృద్ధి పనులను, పెండింగ్ లో ఉన్న పనులు వాటి పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూనూతనంగా చేపట్టాల్సిన పనులను ప్రతిపాదనలు వెంటనే తయారు చేయవలసిందిగా మరియు పెండింగ్లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రశాంతి, సంజయ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పృథ్వి, పవన్, శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్లు నరేందర్, మనోహర్, రవి, రాము, దుర్గా పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసిన ఆర్డీవో



**విశ్వంభర, హైదరాబాద్:** రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని హైదరాబాద్ ఆర్డీవో కే రామ కృష్ణ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్ ఆర్డీవో గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, నవీన్ మిట్టల్, హైదరాబాద్ కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ను కలవడం జరిగిందని తెలిపారు.

## బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి



**విశ్వంభర, షాద్ నగర్:** బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేద్దామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం కొందుర్గు మండల బీజేపీ సభ్యత్వ ప్రముఖ్ చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పాత ఆగిరాల, కొత్త ఆగిరాల, లాలపేట్, చిన్న ఉమ్మెంతాల, ముట్పూర్, టేకులపల్లి, మహాదేవ్ పూర్, పులుసు మామిడి, శ్రీరంగాపూర్ గ్రామాలలో 12 పోలింగ్ బూత్ లలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 31 తో సభ్యత్వ నమోదు చివరి రోజు కనుక ప్రతి ఒక్కరు బీజేపీ సభ్యత్వం నమోదు చేసుకొని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. ప్రతి పోలింగ్ బూత్ లలో ఇద్దరు క్రియాశీలక సభ్యులు కావాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గమనించి బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మొండి చెయ్యి చూపిందని అన్నారు. భవిష్యత్తు లో తెలంగాణ లో బీజేపీదే అధికారం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శివారెడ్డి, ఇస్నాతి శ్రీనివాస్, బోయ అశోక్, అత్తాపూర్ మహేందర్ రెడ్డి, కరెడ్ల నరేందర్ రెడ్డి, కుమ్మరి మహేష్, రవీందర్ రెడ్డి, మరాఠి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు ఏబీవీపీ వినతి పత్రం

**విశ్వంభర, షాద్ నగర్:** నూతనంగా నియమితులైన ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టారెడ్డికి ఏబీవీపీ రాష్ట్ర శాఖ శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలు, ఇంజనీరింగ్ కళాశాలల్లో, ఉన్నత విద్య మండలి పరిధిలో ఉన్నటువంటి అన్ని కళాశాలల్లోను అనేకరకాల సమస్యలు ఎదుర్కొంటూ విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ నుంచి విద్యాసంస్థలకు సంబంధించిన అన్ని విషయాలలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యాసంస్థలు మెరుగుపరిచి పేద విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పిస్తారని ఆశించిన తెలంగాణ విద్యార్థులకు నిరాశే మిగిలింది. గడిచిన 10 సంవత్సరాల బీఆర్ఎస్ పరిపాలనలో విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో నియామకాలు చేపట్టకుండా, నిధులు ఇవ్వకుండా, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు మరుగున పడ్డాయి. నాణ్యమైన విద్య, మౌలిక వసతులు అందించకుండా పూర్తిగా ఉన్నత విద్యను నీరు గార్చింది. కోర్స్ ఫీజు, ఎగ్జామ్ ఫీజులు పెంచుతూ ప్రైవేటు విద్యా సంస్థల తో పోటీపడే విధంగా ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్ర చేసింది ప్రభుత్వం. గతంలో శ్రీనిధి మరియు గురునానక్ విద్యాసంస్థలు యూనివర్సిటీ పర్మిషన్ రాకముందే దాదాపు 4 వేల ఇంజనీరింగ్ అడ్మిషన్స్ తీసుకొని లక్షలకు లక్షలు వసూలు చేసి వేల మంది విద్యార్థుల జీవితాలను రోడ్డుపాలు చేసిన తీరుకు ఉన్నత విద్యా మండలి బాధ్యత వహించాల్సి వచ్చింది. ఇంజనీరింగ్ బీ కేటగిరి సీట్ల పేరుతో లక్షల దందా సాగిస్తుంటే కనీసం పట్టించుకుంది లేదు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో క్వాలిఫైడ్ ఫ్యాకల్టీ లేకుండా కళాశాలలు నడుపుతున్న కూడా వారి పైన ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒకవైపు ఫీజుల దోపిడీ జరుగుతుంటే మరొకవైపు విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ రాని కారణంగా పేద మధ్యతరగతి విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీలు



పూర్తిచేసిన కూడా రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామంటూ యాజమాన్యాలు పెడుతున్న ఒత్తిడి వల్ల తమ ఉన్నత భవిష్యత్తును మధ్యలోనే ఆపేసే పరిస్థితి. అదేవిధంగా స్వయంగా ప్రభుత్వమే ప్రైవేట్ యాజమాన్యాలకు అనుమతి ఇచ్చిందంటూ విద్యార్థుల నుంచి ఫీజు రియంబర్స్మెంట్ పూర్తిగా విద్యార్థుల నుంచి కట్టించుకోవాలని లేదంటే ఎగ్జామ్ ఫీజు కట్టుకోమని కండిషన్ పెట్టి రోజు రోజుకి ఫైన్ పేరుతో విద్యార్థుల నుంచి చెల్లించవలసిన దానికంటే ఎక్కువ ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను నానా రకాలుగా హింసిస్తున్నారు. ఈ విధంగా అక్రమాలకు పాల్పడుతున్న యాజమాన్యాల పైన చర్యలు తీసుకోవాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ఇప్పటికైనా అధికారులు ఉన్నత విద్యా మండలి పరిధిలోని యూనివర్సిటీలను, కళాశాలలు సందర్శించి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని, విశ్వవిద్యాలయాలకు, కళాశాలలకు తగిన బడ్జెట్ ను తీసుకొచ్చే విధంగా ప్రయత్నించి నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, మెరుగైన పరిశోధనలు జరిగే విధంగా ప్రత్యేక దృష్టి సారించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని మరియు ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి. పెంచిన ఎగ్జామ్ మరియు కోర్స్ ఫీసులను తగ్గించాలి. ఇంజనీరింగ్ బి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని, తెలంగాణ విద్యార్థుల తరపున ఏబీవీపీ రాష్ట్ర శాఖ నుండి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రెటరీ శ్రీకాంత్, స్టేట్ జాయింట్ సెక్రటరీలు పృథ్వి తేజ, కళ్యాణీ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు స్థానం లేదా..?

- బీసీ యువజన సంఘం అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చిలో జరగనున్న నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని ఉపాధ్యాయ సంఘాలు అగ్రవర్ణాల అభ్యర్థులనే నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అసమానతలు లేని సమాజం కొరకు పనిచేయాల్సిన ఉపాధ్యాయ సంఘాలు ఒకే వర్గానికి జై కొట్టడం



బాధాకరమన్నారు. ఆయా సంఘాల్లో 80 శాతం బడుగు బలహీన వర్గాలకు చెందిన ఉపాధ్యాయులు ఉండగా ఎవరికి టికెట్ కేటాయించకుండా తమ వారినే ప్రకటించుకోవడం సంఘాల నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. తమ సంఘం సామాజిక దృక్పథం తో పని చేస్తాయని చెప్పుకునే సంఘాలు వరుసగా అగ్ర వర్ణాలకే అవకాశం ఇవ్వడం ఉపాధ్యాయ లోకాన్ని మోసం చేయడమే అన్నారు. ఇప్పటికే పీఆర్ టీ యూ అభ్యర్థి గా పింగళి శ్రీపాల్ రెడ్డి, యూటీఎఫ్ నుండి నర్సిరెడ్డి, టీపీఆర్టీయూ నుండి హర్షవర్ధన్ రెడ్డి నీ ప్రకటించడం ద్వారా వారి ఆధిపత్య వైఖరి బట్టబయలు అయింది అన్నారు. బడుగు బలహీవర్గాలకు చెందిన ఉపాధ్యాయులు బయటికి వచ్చి బీసీ అభ్యర్థిని పోటీలో నిలిపి ప్రధాన ఉపాధ్యాయ సంఘాలకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నారాయణపురం మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ, ఉపాధ్యక్షులు కొల్లూరు నవీన్, కట్కూరి శ్రీకాంత్, పల్చం శివ సంపత్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వైన్స్ షాపులో ప్రత్యేక కౌంటర్ ఓపెన్

- చోద్యం చూస్తున్న ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్
- రిపోర్టర్ కనుసన్నల్లో అక్రమ మద్యం వ్యాపారం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని వైన్స్ షాపులు సిండికేట్ అయి బెల్ట్ షాపులకు అమ్మేందుకు ప్రత్యేక హోల్ సేల్ కౌంటర్ తెరిచి వైన్స్ షాప్ యజమానులు మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో బాటిల్ పై 8 శాతం అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమ మద్యం అమ్మకాల వెనుక మోత్కూర్ కి చెందిన ఒక విలేకరి కనుసన్నల్లో అక్రమ వ్యాపారం నడుస్తున్నది. ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ అధికారులు మామూళ్ల మత్తులో మునికి తేలుతున్నారా లేక ఈ విషయం వాళ్ల కంటపడడం లేదా? మార్క్ గా మిగిలిన వైనం, మద్యం ప్రియులకు వైన్స్ షాప్ లో దొరకని కేఎఫ్సీ బ్రాండ్ బెల్ట్ షాపులో దొరకడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. నాసిరకం మద్యం అంట కడుతున్నారని




మద్యం ప్రియులు అంటున్నారు. వైన్స్ లపై ఎక్సైజ్ అధికారుల సరియైన పర్యవేక్షణ లేకపోవడతో అక్రమ దందాతో రెచ్చిపోతున్నారని మద్యం ప్రియులు అంటున్నారు. రోజుకో కొత్త కొత్త పేర్లతో అమ్ముతున్న బీర్లను చూసి మద్యం ప్రియులు ఆశ్చర్యపోతున్నారు. ఈ విషయాన్ని పూర్తిగా పర్యవేక్షణ చేసి సమస్య పరిష్కారం చూపుతారో లేక చూసి చూడనట్టు వదిలేస్తారో ఎక్సైజ్, టాస్ఫోర్స్ అధికారులకే తెలియాలి. సుమారుగా ఒక ఊరికి 8 లేక 12 బెల్ట్ షాపులు నడుస్తున్న పట్టించుకునే సరైన అధికారులు లేరని మద్యం ప్రియులు అంటున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



**విశ్వంభర, ఊర్కొండ:** ఊరుకొండ మండలంలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన పోలే జంగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా 5 వేల రూపాయలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీరెడ్డి వెంకట్ రెడ్డి 2 వేల రూపాయలను కలిపి మొత్తం 7 వేల రూపాయలు బాధిత కుటుంబానికి అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీరెడ్డి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పాయిళ్ళ గోపాల్, నాయకులు పులిమామిడి శ్రీశైలం, రమేష్ గౌడ్ ప్రభాకర్, రాఘవేందర్, నిరంజన్, పీ. లక్ష్మయ్య, ఏ.లక్ష్మయ్య, జంగయ్య, గిరి, కాశయ్య, శేఖర్ రెడ్డి, అర్జున్, అనిల్, భరత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## గీతంలో ఉత్సాహభరితంగా 'రాష్ట్రీయ ఏక్తా దివస్'




**విశ్వంభర, సంగారెడ్డి:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, సంగారెడ్డి జిల్లా ఎన్ఎస్ఎస్ లు బుధవారం సంయుక్తంగా 'జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని' ఉత్సాహభరితంగా నిర్వహించాయి. భారతదేశ ఏకీకరణ కోసం పాటుపడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గీతం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు ఘననివాళులు అర్పించి, జాతీయ ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఐక్యతా స్ఫూర్తికి అనుగుణంగా, విద్యార్థులు తమ సమష్టి బలాన్ని, సంఘటిత సమాజాన్ని పెంపొందించే అంకితభావానికి ప్రతీకగా 'ఐక్యతా నడక'లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నడక సంఘీభావం, పరస్పర గౌరవం ప్రాముఖ్యతను చాటిచెప్పింది. జాతీయ ఐక్యతపై దృష్టి సారించడంతో పాటు, శారీరక దృఢత్వం ప్రాముఖ్యతను కూడా గీతం నొక్కి చెప్పింది. జాతీయ సమగ్రత, వ్యక్తిగత శ్రేయస్సు కోసం, సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి విద్యార్థులు ప్రేరణ పొందారు. ఈ కార్యక్రమంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పీవీ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హలో బీసీ ఛలో మిర్యాలగూడ' పోస్టర్ ఆవిష్కరణ

- బీసీ గర్జనను విజయవంతం చేయాలి



**విశ్వంభర, మిర్యాలగూడ:** త్రిపురారం మండల కేంద్రంలోని బీసీ సంఘం యువ నాయకుల ఆధ్వర్యంలో హలో 'బీసీ చలో మిర్యాలగూడ' అనే పోస్టర్ను అవిష్కరించారు. నవంబర్ 3న ఆదివారం మిర్యాలగూడ పట్టణము లో నిర్వహించనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని పులిజాల విష్ణు కుమార్, దూళిపాల రామచంద్రయ్య, జంగిల్ శ్రీనివాస్ యాదవ్‌లు పిలుపునిచ్చారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలో 'హలో బీసీ – ఛలో మిర్యాలగూడ' బీసీ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ లకు రాజకీయ, విద్యా రంగాలలో తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. బీసీ ల జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ గర్జనను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, దీని వెనుక దాగి ఉన్న కుట్రలను ఛేదించాలని పలువురు ఈ సందర్భంగా కోరారు. ఈ డబ్ల్యూ యస్ రిజర్వేషన్లతో ఒక వైపు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలు జి.ఓ 29 తీసుకువచ్చి బీసీ లకు ఉన్నత ఉద్యోగాలు రాకుండా అనేక కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ లు రాజకీయ రంగంపై పట్టు సాధించుకోకపోవడం వలననే విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. బీసీ లు రాజకీయాల్లో రాణించాలని అందు కోసం రాజకీయ పార్టీలు కృషి చేయాలని కోరారు.

## డాక్టర్ వృత్తి సమాజంలో పవిత్రమైనది

- డా. కమల్ చంద్



**విశ్వంభర, ఎల్బీనగర్:** సమాజంలో డాక్టర్ వృత్తికి ఎంతో గౌరవ మర్యాదలు ఉన్నాయని డాక్టర్ కమల్ చంద్ అన్నారు. బుధవారం ఎల్బీనగర్ లోని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసెర్చ్ సెంటర్ లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు వైట్ కోట్ సెర్మోని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. ఈ సందర్భంగా ఆర్.కె పురంలోని మార్గ దర్శి కాలనీకి చెందిన పెంబర్తి హర్షితకు వైట్ కోట్‌ని అందజేశారు.

## రక్తదానం మహాదానం: డా. ముస్తఫా




**విశ్వంభర, హైదరాబాద్:** రక్తదానం మహాదానమని ఫైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు డా. ముస్తఫా అన్నారు. బుధవారం బోయిన్పల్లి లోని డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డ్ లో రక్తదాన శిబిరాన్ని ఫైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా తయారవుతారని అన్నారు. రక్తదానం చేయడం వల్ల అనారోగ్యానికి గురవుతారని సమాజంలో కొంత అపోహ ఉందని, ముమ్మాటికి ఆపోహ నిజం కాదన్నారు. రక్తదానం తోటే ఆరోగ్య పరంగా మంచి ఉపయోగాలు ఉంటాయన్నారు. అధికారులు, పండ్ల వ్యాపారులు, కూలీలు రక్తాన్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. అనంతరం రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

## సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వినతి



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి ని బుధవారం టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎమ్. హుస్సేని ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ నగర అధ్యక్షుడు కే. శ్రీకాంత్, కేంద్ర సంఘం నేతలు కొండల్ రెడ్డి, గోవర్దన్ రెడ్డి కలిశారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



విశ్వంభర, ఎల్బీనగర్: నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడా వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీ.సీ రోడ్డు పనులను బుధవారం ఎల్.బీ నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధికారుల తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్స్, డబ్బాలు, ప్రైవేట్ స్తంభాలు తొలగిస్తే రోడ్డు ఇంకా విశాలంగా అవుతుంది అని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రోడ్డు పనులు పూర్తి అయితే ఫ్లైఓవర్ నిర్మించడానికి ఎంతో వీలు అవుతుంది అని తెలిపారు. ప్రస్తుతం రోడ్డు నందు ఉదయం, సాయంత్రం తీవ్రంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవ్వడం జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ ఒక ఫ్లై ఓవర్ నిర్మిస్తే బాగుంటుంది అని ఆలోచన చేయడం జరిగిందని తెలిపారు. వ్యాపారస్తులు అధికారులకు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మాణం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, చెరుకు ప్రశాంత్ గౌడ్, సతీష్ యాదవ్, చెరుకు జంగయ్య, ఎల్.బీ.నగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నాగరాజు, జీ.హెచ్.ఎం.సీ. అధికారులు దీపక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తాహసిల్దార్‌ను సన్మానించిన మాజీ జడ్పీటీసీ



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల తహసిల్దార్ ముంతాజ్ ను కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ సన్మానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో కడ్తాల్ మండల కేంద్రం లో పూర్తైన నూతన భవనం లోకి అడుగుపెట్టిన సందర్భంగా ఎమ్మార్వో ను ముంతాజ్ ను శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ కడ్తాల్ మండల కేంద్రానికి నూతన తాహసిల్దార్ కార్యాలయం కోసం తాను ఎంతగానో శ్రమించి అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యే జయపాల్ యాదవ్ సహకారంతో నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. మొత్తానికి కడ్తాల్ మండల కేంద్రంలో నూతన ఎమ్మార్వో కార్యాలయం ప్రారంభమైనందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలికోట భారతమ్మ, నరసింహ గౌడ్, పాండు, భిక్య తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా తనతో పాటు ఉన్న మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మల్కాపూర్ క్రాస్ రోడ్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి పేట ఏఎస్ఐ విటల్, పోలీస్ సిబ్బంది చేరుకొని వివరాలు సేకరించారు. రేగోడు మండలం పెద్ద తండాకు చెందిన మెగావత్ రమేష్, బాచేపల్లి తండాకు చెందిన సురేష్ లు పెద్ద శంకరంపేట నుండి రేగోడు కు బైక్ పై వెళ్తుండగా మల్కాపూర్ చౌరస్తాలో బైక్ అదుపుతప్పి ముందున్న ఇనుప మెట్లను ఢీ కొట్టింది. దీంతో రేగోడు మండలం పెద్ద తండాకు చెందిన మెగావత్ రమేష్ (46) అక్కడికక్కడే మృతి చెందాడు. బాచేపల్లికి చెందిన సురేష్ కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సన్‌షైన్‌లో ఘనంగా దీపావళి వేడుకలు




**విశ్వంభర, చండూర్ :** దీపావళి పండుగ సందర్భంగా స్థానిక సన్ షైన్ పాఠశాలలో పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థినిలు స్వయంగా తయారు చేసిన మట్టి ప్రమిదలతో దీపాలను వెలిగించి వాటి గొప్పతనాన్ని తెలిపారు. అదేవిధంగా చిన్నారి విద్యార్థులు హ్యాపీ దీపావళి అక్షరమాల ఆకారంలో కూర్చొని అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతూ దీపావళి పండుగ అనేది సత్యభామ నరకాసురుని వధించి ప్రజలకు మంచి చేకూర్చిన సందర్భంగా జరుపుకుంటారని, దీపాలు వెలిగించడం ద్వారా చీకటిని తొలగించి ప్రజల జీవితాల్లో వెలుగు నింప వచ్చని అన్నారు. ఎంత గొప్ప కార్యక్రమమైనా చిరు దీపాన్ని వెలిగించి ప్రారంభించడం ద్వారా దీపం యొక్క గొప్పతనాన్ని మనం గుర్తించాలని అన్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోడి సుష్మ గారు, ప్రిన్సిపాల్ రవికాంత్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన రైతు సంఘం



**విశ్వంభర,ఆత్మకూరు(ఎం) :** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరు రాజయ్య మాట్లాడుతూ రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి అనేక రకాల కొరివిలు పెట్టి సాంకేతిక కారణాలతో 50 శాతం మంది రైతులకు రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్న ప్రభుత్వం 2 లక్షల పైన గల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని అలాగే రైతు భరోసాను రైతులకు వర్తింపజేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు చేయాలని దళారు వ్యవస్థను అరికట్టాలని రాజయ్య డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, జక్క దయాకర్ రెడ్డి, రైతులు గుంటుపల్లి సత్తయ్య, తెడ్డు ఆంజనేయులు, ఎర్ర యాదయ్య, గణేష్, యుద్ధంరెడ్డి, బోదాసు స్వామి, రవికృష్ణ, దొండ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి మాజీ సర్పంచ్ నగేష్ ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని ఇందిరనగర్ కాలనీకి చెందిన రాళ్ళబండి సత్తయ్య తల్లి అండమ్మ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. బుధవారం రోజు వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య స్ఫూర్తితో తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ వారి కుటుంబానికి 5000-/ రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ ఛైర్మెన్ జిల్లాల శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దిగోజు నర్సింహచారి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేష్, పిఏసిఎస్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, నాయకులు కట్టేకోల హన్మంతు,రంగ స్వామి, దిగోజు శ్రీనివాస చారి, ఉగ్గె నరేష్, మజీద్, కొంగరి విద్యాసాగర్, తొండల అనిల్, దిగోజు సురేంద్రచారి, ఎలిమినేటి పుల్లయ్య, పోలేపాక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కొమ్మాయిగూడెం గ్రామంలో రాష్ట్ర ఉద్యాన శాఖ ఆద్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిగతా నూనె గింజల కన్నా నాలుగు నుండి ఐదు రెట్లు ఎక్కువగా దిగుబడి వస్తుందని, ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల నుండి కాపు మొదలై 30 సంవత్సరాల వరకు దిగుబడిని ఇవ్వడం జరుగుతుందని, మొదటి మూడు సంవత్సరాలు రైతులు ఆదాయం కోసం అంతర పంటలుగా కూరగాయలు, వేరుశనగ, బొప్పాయి లాంటి పంటలను పండించుకొని అదనపు ఆదాయం తీసుకోవచ్చని, ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ లో చీడపీడల సమస్య చాలా తక్కువగా ఉంటుందని అన్నారు. ఎకరానికి నాలుగు సంవత్సరాల వరకు ప్రతి ఏటా ?4,200 చొప్పున యాజమాన్య, అంతర పంటల ఖర్చుల కొరకు రైతు ఖాతాలో జమ చేయడం జరుగుతదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట ఉద్యాన శాఖ అధికారిణి కే.కవిత, రామన్నపేట క్లస్టర్ ఏఈఓ వెంకన్న, డిసిఓ ప్రవీణ్, పి.ఎం.ఓ శ్రీరాం , ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్ మరియు రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు గాంధీజీ విద్యార్థుల ఎంపిక

- ఎస్.జి.ఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు గాంధీజీ విద్యార్థులు ఎంపిక
- విద్యార్థులను అభినందించిన ఎస్ఐ
- బంగారు పథకాలతో సత్తా చాటిన గాంధీజీ విద్యార్థులు
- వచే నెల 2,3,4 తేదీలలో సంగారెడ్డిలో జరగనున్న రాష్ట్రస్థాయి యస్.జి.ఎఫ్. కరాటే టోర్నమెంట్



**విశ్వంభర, నల్గొండ :** ఉమ్మడి నల్గొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్.జి.ఎఫ్.) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -14 ,అండర్ -17 కరాటే జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో చండూరు మున్సిపాలిటీకీ చెందిన గాంధీజీ విద్యాసంస్థల విద్యార్థులు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు ఎంపికై, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నారు. కరాటే మాస్టర్ శ్రీధర్ సాగర్ శిక్షణలో శిక్షణ పొందిన గాంధీజీ విద్యాసంస్థల విద్యార్థులు అండర్ -14 లో సి.హెచ్. విష్ణు, ఎం. చక్రధర్ అండర్ -17 లో ఎం. శ్రీనిధి జిల్లా కరాటే జట్టుకు ఎంపికయ్యారు. నవంబర్ 2, 3, 4 తేదీలలో సంగారెడ్డి లో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్ టోర్నమెంట్లో పాల్గొననున్నారు. అలాగే వి. ఐశ్వర్య, ఎన్.గోపిలతలు సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గాంధీజీ విద్యాసంస్థలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఐదుగురు విద్యార్థులను స్థానిక ఎస్.ఐ. వెంకన్న గౌడ్ ఘనంగా సన్మానించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో పాల్గొని గెలుపొంది తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, తెలంగాణ రాష్ట్రానికి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఆశించారు. విద్యతో పాటు విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తున్న గాంధీజీ విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్ సత్యనారాయణ మూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, విజయ కుమారి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

**-టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**విశ్వంభర, ఆమనగల్లు :** అమెరికా లాస్ వేగాస్ లో నిర్వహించిన "ఐటి సర్వ్ సినర్జీ సమ్మిట్" లో తెలంగాణ రాష్ట్రం తరపున కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన తెలంగాణలో పెట్టుబడి పెట్టండని, దానికి సంబంధించిన అవకాశాలను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అభివృద్ధిలో పయనిస్తుందని హైదరాబాద్ పట్టణం విశ్వ నగరంగా విస్తరించిందని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మూసీ నది ప్రక్షాళన, మెట్రోలు, ఫోర్త్ సిటీతో మరింత అభివృద్ధిలో దూసుకుపోతుందని ఇవన్నీ గమనించి విదేశీ పెట్టుబడులకు తెలంగాణ మంచి ప్రదేశం అని అన్నారు. క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్లో తెలంగాణ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లక్ష్యాల సాధన, స్మార్ట్ గవర్నెన్స్ కోసం తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల అమలు, ఎఐ హబ్ ఇన్నొవేషన్ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ ను మార్చాలన్న తెలంగాణ ప్రజా ప్రభుత్వ ఆశయం, తెలంగాణ రాష్ట్రంలో పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ సిస్టమ్, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల, ఈ-గవర్నెన్స్ కార్యకమాలు, స్కిల్ డెవలప్మెంట్, యంగ్ ఇండియా స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ లక్ష్యాలు గురించి వివిధ కంపెనీల ప్రతినిధులతో చర్చించి, వారి నిబద్ధత, శ్రద్ధ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉపయోగ పడుతుందని, తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని కోరారు.

# గాంధీజీ ఫౌండేషన్ సేవలు అభినందనీయం : ఎస్సై వెంకన్న గౌడ్

**- గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ**



**విశ్వంభర, చండూర్ :** రెండు సంవత్సరాల వరకు ప్రతినెల 22 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలనే లక్ష్యంతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు జనవరి నెల ఒకటో తేదీన ప్రారంభించిన నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం దీపావళి పండుగను పురస్కరించుకొని రెండు రోజులు ముందుగానే బుధవారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థల యందు పదకొండవ నెల పంపిణీ చేసారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా ఎస్సై వెంకన్న గౌడ్ హాజరై వారు మాట్లాడుతూ డాక్టర్ కోడి శ్రీనివాసులు చండూరు మున్సిపాలిటీకి ఆదర్శవంతమైన వ్యక్తి అని, సమాజంలో డబ్బులు ఉన్న వారందరూ సేవ చేయరని, సేవ చేయాలనే ఆలోచన డాక్టర్ కోడి శ్రీనివాసులు రావడం అభినందనీయమని, నిరుపేదలకు ఆయన చేసిన సేవ ఎంతో గొప్పదని కొనియాడారు. ఏ ఆసరా లేని నిరుపేదలను చూస్తుంటే మనసు కలచివేస్తుందని, వీరికి త్వరలోనే నా వంతు సహాయ సహకారాలు అందిస్తూ మంచి కార్యక్రమం చేస్తానని తెలిపారు. గాంధీజీ ఫౌండేషన్ ఇంకా ఎక్కువ మందికి సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని, రాబోయే రోజుల్లో ఈ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవలు పేద ప్రజలకు అందాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కోడి అరుణ, కోడి ప్రీతి, కోడి శృతి, గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ సత్యనారాయణమూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 4న ఎంఆర్పీఎస్ మాదిగల దర్మయుద్ధ మహాసభ



**విశ్వంభర, రామన్నపేట:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయకుండా, మాదిగ జాతిని మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి మోసాన్ని నిరసిస్తూ, తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే వర్గీకరణ అమలు చేయాలని డిమాండుతో నవంబర్ 4న మాదిగల ధర్మ యుద్ధ ఉమ్మడి నల్లగొండ జిల్లా మహాసభ నల్లగొండ జిల్లా కేంద్రంలో ఐటీ టవర్ ఎదురుగా జె.ఎస్.ఎం గార్డెన్ లో జరగబోతుందని జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ తెలిపారు. రామన్నపేట మండల కేంద్రంలో జరిగిన ఎం.ఆర్.పి.ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎం.ఎస్.పి నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జి మేడి శంకర్ మాదిగలు హాజరై మాట్లాడుతూ నవంబర్ 4న జరిగే సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మాదిగ, కక్కిరేణి పాపయ్య, కందాల దేవేందర్, జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ, మండల కన్వీనర్ నకిరేకంటి సతీష్, కోళ్ల జహంగీర్, నోముల చిరంజీవి, కొండగడప నరేష్, కోళ్ల వెంకన్న, కొండగడప సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన సమాచార శాఖ కమిషనర్



**విశ్వంభర, హైద్రాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ఎస్.హరీష్ బుధవారం నాడు మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ని బి.ఆర్.కె భవన్ లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త కమిషనర్ కు ఛైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ చర్యలపై వారు కాసేపు చర్చించారు.

# బీఆర్ఎస్ నాయకులతో చల్లా సమావేశం



**విశ్వంభర, పరకాల :** నియోజకవర్గంలోని సంగెం మండల బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం హనుమకొండలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలో గ్రామాలలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. గ్రామాలలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవని, రైతుబంధు, రైతుభీమ రాక, విద్యుత్ సరఫరా సరిగా లేక రైతులు కష్టాలు పడుతున్నారని, ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీ అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, పరిపాలన కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేయడంతో గ్రామాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మండల నాయకులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ...గ్రామాల వారీగా కార్యకర్తలతో కలిసి సమావేశాలు నిర్వహించాలని సమన్వయ కమిటీ సభ్యులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ఆరు గ్యారెంటీల హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్ళాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మండల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇది బీఆర్ఎస్ విజయం -బీఆర్ఎస్ పోరాటానికి తలొగ్గిన కాంగ్రెస్




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పైన వేయాలనుకున్న 18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారం పడకుండా ప్రభుత్వం పైన పోరాటం చేయటం లో ప్రధాన ప్రతిపక్షంగా విజయం సాధించమన్నారు. గత పది సంవత్సరాల్లో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచని గత ప్రభుత్వానికి భిన్నంగా కేవలం 10 నెలల్లోనే 18,500 కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతి పాదనలను ప్రభుత్వం చేస్తే ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకించాలని పబ్లిక్ హియరింగ్ లో పాల్గొని కేటీఆర్ ఈ ఆర్ సి ని ఒప్పించ గలిగారన్నారు. ఇది తెలంగాణ ప్రజల విజయం. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపించిన ఇలాంటి సందర్భం చారిత్రాత్మకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రెటరీ జనరల్ పంజాల వెంకటేష్ గౌడ్,జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరే బిక్షపతి, పట్టణశాఖ అధ్యక్షులు కోరే వెంకన్న, మండల కార్యదర్శి అబ్బ సాయిలు, కొరటికల్ మాజీ సర్పంచ్ కోలసత్తయ్య గౌడ్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు సోలిపురం అరుణ, మండల ఉపాధ్యక్షులు గొడ్డేటి శ్రీనివాస్ యాదవ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఎలగందుల విజయ్, సీనియర్ నాయకులు నర్సిరెడ్డి, సోలిపురం ఉపేందర్ రెడ్డి, మేడి వెంకన్న, దంతూరి యాదగిరి గౌడ్, లోడి ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల మాక్ డ్రిల్



**విశ్వంభర, మహబూబాబాద్ :** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా సివిల్ పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) పోలీసు సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఎలా స్పందించాలో ప్రదర్శన నిర్వహించారు. హింసాత్మక సంఘటన జరిగితే, గుంపును నియంత్రించడానికి పోలీసులు ఎలా మొదటి హెచ్చరిక చేస్తారో చూపించారు. హెచ్చరిక వినకపోతే, వారు మేజిస్ట్రేట్ అనుమతితో బాష్పవాయువు ప్రయోగిస్తారు, తమను తాము రక్షించుకోవడానికి లాఠీ చార్జ్ చేస్తారు.జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులను అణిచివేసేందుకు ఇలాంటి మాక్ డ్రిల్స్ ఉపయోగపడతాయ్ అని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. అలాగే అల్లర్లు సృష్టించి ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. . తరచు ఇలాంటి 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.

## బెల్టు షాపులపై దాడి - నిర్వాహకుల అరెస్ట్



**విశ్వంభర, పాతబస్తీ :** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపు నిర్వాహకులను దక్షిణ మండలం టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పుగూడ కందికల్ గేట్ కు చెందిన ప్రభాకర్ రెడ్డి (58) ఉప్పుగూడ జెండా ప్రాంతంలో జె .చంద్రమోహన్. (చందు)(50) వైన్ షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి తమ ఇంటి వద్ద ఉదయం, అర్ధరాత్రి వేళలో అక్రమంగా బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్ స్పోర్ట్స్ ఇన్ స్పెక్టర్ ఎస్. రాఘవేంద్ర బృందం, ఛత్రినాక పోలీసులతో కలిసి దాడులు చేసి ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి ల విలువ జేసే 405 బాటిళ్లలో ఉన్న 82.46 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఛత్రినాక పోలీసులకు అప్పగించారు. గతంలోను కూడా వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచిన వీరు మాత్రం మారడం లేదు.

## ఏక్తా దివస్ సందర్భంగా యూనిటీ ఫర్ రన్

- ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి
- కార్యక్రమాన్ని నిర్వహించిన మహాత్మ జ్యోతిబాపూలే ట్రైబల్ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజ్




**విశ్వంభర, షాద్ నగర్ :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతిని పురస్కరించుకుని ఏక్తా దివస్ రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని మహాత్మ జ్యోతిబాపూలే ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కాలేజీ నుండి ర్యాలీగా బయలుదేరి స్థానిక పట్టణ రైల్వే స్టేషన్ వద్ద ముగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రజాకర్ల నుండి విముక్తి పొందడానికి , తెలంగాణ భారత దేశంలో విలీనం కావడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అమోఘం అని కొనియాడారు. ర్యాలీ అద్భుతంగా జరిగే విధంగా తోడ్పడినందుకు పోలీసులకు, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కాశప్ప, డిప్యూటీ వార్డెన్ రవికుమార్, జూనియర్ లెక్చరర్ శంకరాచారి, డిగ్రీ కాలేజ్ సీనియర్ లెక్చరర్ హనుమా, మహిళా లెక్చరర్లు యశస్వి, సాయి శ్రీ, దానమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి పుస్తె మెట్టెలు అందజేత



**విశ్వంభర,సంగారెడ్డి :** పటాన్ చేరు జిన్నారం మండలం రాళ్ళకత్వ గ్రామానికి చెందిన ఒగ్గు సత్యనారాయణ కూతురు వివాహానికి పుస్తె మెట్టెలు రాళ్ళకత్వ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నీరుడి మహేష్ ముదిరాజ్ అందించారు. గ్రామంలో పేదవారికి పెళ్లిలకు పుస్తెమెట్టలు, ఆపదలో ఉన్న ప్రజలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ సమాజంలో బడుగు బలహీన వర్గాలను సామాజికంగా ఆర్థికంగా ఆదుకొని వారికి అండగా నిలబడుతున్నారు. సామాజిక కార్యక్రమాలు చేయడం వల్ల నాకు ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జింక గణేష్, రాము, అనిల్, మహమ్మద్, శ్రీనివాస్, ప్రవీణ్, మెట్టు, మనోహర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# నటుడు దర్శన్‌కు మధ్యంతర బెయిల్.. జైలు నుంచి విడుదల



**బెంగళూరు:** అభిమాని హత్య కేసులో అరెస్టయి జైలుకెళ్లిన కన్నడ నటుడు దర్శన్‌కు కాస్త ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు మధ్యంతర బెయిర్ మంజూరైంది.వైద్యచికిత్స కోసం ఆరు వారాల పాటు బెయిల్ మంజూరు చేస్తూ కర్ణాటక హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.కన్నడ నటుడు దర్శన్ జైలు నుంచి బయటకు వచ్చారు.అనారోగ్య కారణాల రీత్యా తనకు బెయిల్ మంజూరుచేయాలని కోరుతూ దర్శన్ తొలుత సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వెన్నునొప్పి, మూత్రపిండాల సంబంధిత అనారోగ్యం, కాళ్ల నరాల్లో రక్త ప్రసరణ లేక ఇబ్బంది పడుతున్నాడని, సర్జరీ చేసుకునేందుకు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌ను సెషన్స్ కోర్టు తిరస్కరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. నటుడి ఆరోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని తాజాగా ఆరు వారాల పాటు మధ్యంతర బెయిల్ కల్పించింది.కోర్టు తీర్పుతో దాదాపు నాలుగు నెలల తర్వాత ఆయన జైలునుంచి విడుదలయ్యారు.ఈ సందర్భంగా ఆయన భార్య విజయలక్ష్మి స్వయంగా జైలు వద్దకు వెళ్లారు.

కర్ణాటకలో దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసు ఇటీవల సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అతడిని చిత్రహింసలకు గురిచేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. పవిత్ర గౌడకు సంబంధించిన అసభ్యకర ఫొటోలు పంపించాడన్న ఆరోపణల్లో దర్శన్ అండ్ టీం రేణుకాస్వామిని బెంగళూరుకు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిత్రదుర్గకు తీసుకెళ్లి దారుణంగా హత్య చేసిందని విచారణలో తేలింది. పవిత్ర గౌడకు అసభ్యకరమైన సందేశాలు పంపాడన్న కారణంతో రేణుకా స్వామిని దారుణంగా కొట్టి, కరెంటు షాక్‌లు ఇచ్చినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. శరీరంపై అనేక గాయాలను కూడా గుర్తించారు. పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న దర్శన్‌ను.. బెంగళూరు న్యాయస్థానం ఆదేశాలమేరకు ఇటీవల బళ్లారి జైలుకు తరలించారు.ఈ కేసులో దర్శన్, ఆయన స్నేహితురాలు పవిత్రగౌడ సహా 15 మందిని అరెస్టు చేశారు. వీరంతా ప్రస్తుతం బెంగళూరులోని వివిధ జైళ్లలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.ఇక ఈ కేసులో దర్శన్‌తోపాటు పవిత్ర బెయిల్ కోసం బెంగళూరు కోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం వీరి అభ్యర్థనను తిరస్కరించింది. వారి బెయిల్ పిటిషన్‌ను బెంగళూరు కోర్టు కొట్టివేసింది. దీంతో దర్శన్ ఇటీవలే కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు.

## దిల్లీలో అధ్వానస్థితికి గాలి నాణ్యత..

### 300కి పడిపోయిన ఏక్యూఐ

దిల్లీ: దిల్లీలో గాలి నాణ్యత అధ్వాన స్థితికి చేరింది. బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఢిల్లీలో ఏక్యూఐ 300కి పడపోయింది. అనేక ప్రాంతాల్లో 300కి పైనే నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది.ఆనంద్ విహార్‌లో 351, బవానాలో319, అశోక్ విహార్ ప్రాంతంలో 351, వాజీపూర్‌లో 327గా ఏక్యూఐ నమోదైంది. ఇక అయా నగర్‌లో 290, ఐటీవో వద్ద 284గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. గాలి నాణ్యత పడిపోవడంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొం టున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో సతమతమవుతున్నారు. ఇదిలా ఉండగా.. కాళింది కుంజ్‌లోని యమునా నదిలో కాలుష్యం తీవ్ర స్థాయిలోపెరిగిపోయింది. నదిలో విషపూరితమైన నురగ తేలుతూ కనిపిస్తోంది.ఈ మధ్య ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళన కరంగా మారుతున్న విషయం తెలిసిందే. గత కొన్ని రోజుల నుంచి దేశరాజధాని ఢిల్లీలోవాయు కాలుష్యం తీవ్రమవుతోంది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహిస్తోంది. దీంతో నగరంలో రోజురోజుకూ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరుకుంటున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 0-100మధ్య ఉంటేగాలినాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, ఏక్యూఐ 100-200 మధ్య ఉంటేగాలి నాణ్యత మధ్యస్తంగా ఉందనిఅర్థం. ఇక ఏక్యూఐ 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, ఏక్యూఐ 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యతమరింత అధ్వాన్నంగాఉందని, ఏక్యూఐ 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్రస్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

## 'మహాయుతి' పనైపోయింది: రమేశ్ చెన్నితాల



ముంబయి: మహారాష్ట్రలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఇక 'మహాయుతి' కూటమి పనైపోయిందని జోస్యం చెప్పారు. మహావికాస్ అఘాడీలోని అన్ని పార్టీలకు కాంగ్రెస్ సమాన గౌరవం ఇచ్చిందని..అందుకే అందులో ఎలాంటి అలకలు, కొట్లాటలు లేవని ఆయన అన్నారు. తిరుగుబాటుదారులందరూ నామినేషన్లు ఉపసంహరించుకునేలా చూడాలని తమ పార్టీ నాయకుడు నసీం ఖాన్‌ను సమాజ్‌వాదీ పార్టీతో మాట్లాడాల్సిందిగా కోరామని, నవంబర్ 4 నాటికి (రెబెల్స్ నామినేషన్ల) సమస్య పరిష్కారమవుతుందని తాము ఆశిస్తున్నామని తెలిపారు. అయితే 'మహాయుతి'లో శివసేన, ఎన్సీపీలకు దక్కాల్సిన సీట్లను కూడా బీజేపీ లాగేసుకుందని విమర్శించారు. ఎన్నికల్లో మహాయుతి నేతలు పోటీ చేస్తున్నట్టు లేదని, కేవలం భాజపా నేతలే పోటీ చేస్తున్నట్లుందని అన్నారు. మహారాష్ట్రలో ఎంవీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని రమేశ్ చెన్నితాల తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ కూటమి పక్షాలు క్రమశిక్షణతో పోరాడతాయని చెప్పారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల నామినేషన్ గడువు ముగిసినప్పటికీ..అధికార మహాయుతి (భాజపా, శివసేన, ఎన్సీపీ) కూటమి ఇంకా నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయలేదు. మరోవైపు శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ) నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ సైతం 11 స్థానాల్లో అధికారికంగా అభ్యర్థుల పేర్లను వెల్లడించలేదు. ఇప్పటివరకు భాజపా 152స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపగా.. అజిత్ పవార్ వర్గం నుంచి 52 మంది.. ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన 80 మంది పేర్లను అధికారికంగా ప్రకటించాయి. దీంతో అధికార పక్షానికి సంబంధించి మొత్తంగా 284 స్థానాల్లో అభ్యర్థులు ఖరారు కాగా.. మిగతా నాలుగు సీట్లపై సందిగ్ధత నెలకొంది.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 20న ఒకే దశలో పోలింగ్ జరగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

## కాలుష్య కోరల్లో యమునా నది..దిల్లీలో నీటి కొరత



**దిల్లీ:** దిల్లీ వాసులను గాలి కాలుష్యంతోపాటు.. నీటి కొరత తీవ్ర ఇబ్బంది పెడుతోంది. నగరంలో యమునా నది కాలుష్యంతో నురగలు కక్కుతోన్న విషయం తెలిసిందే. ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, మురుగునీటిని వదులుతుండటంతో యమునా నదిలో విషపూరితమైన తెల్లటి నురగ ప్రవహిస్తోంది. నదిలో అమ్మోనియా సాంద్రత ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. దీంతో పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది.నదిలో అమ్మోనియా కంటెంట్ అధికంగా ఉన్నందున నవంబర్ 1 వరకూ తూర్పు, ఈశాన్య, దక్షిణ ఢిల్లీలో నీటి సమస్య ఉంటుందని ఢిల్లీ జల్ బోర్డు తెలిపింది. ఎగువ గంగా కాలువ నిర్వహణ కోసం మూసివేయడంతో.. భాగీరథి, సోనియా విహార్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు డిమాండ్‌ను తీర్చడానికి కష్టపడుతున్నాయని పేర్కొంది. ఈ ప్లాంట్లు యమునా నదిపైనే ఆధారపడి ఉన్నాయని.. అయితే, ప్రస్తుతం యమునా నీరు కాలుష్యంతో నిండిపోవడంతో.. నీటి శుద్ధి కష్టతరంగా మారిందని వివరించింది. ఈ కారణంగా నీటి ఉత్పత్తి 30 శాతం తగ్గిందని పేర్కొంది. ఢిల్లీ వాసులు అవసరాల మేరకే నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించింది. కాగా, యమునా నది కాలుష్య కాసారంగా మారిన విషయం తెలిసిందే. ఇటీవల విష పూరితమైన నురగ నదీ జలాలపై పొరగా ఏర్పడటంతో అవి మరింత అధికమయ్యాయి. ఇక నదిలో కాలుష్యంపై బీజేపీ, ఆప్ పరస్పరం రాజకీయ విమర్శలు చేసుకుంటున్నాయి. యమునా నది అలా కావడానికి కారణం బీజేపీయేనని, ఆ పార్టీ పాలిత యూపీ, హర్యానాల్లోని వందలాది పరిశ్రమల్లోని శుద్ధి చేయని మిలియన్ గ్యాలన్ల పారిశ్రామిక వ్యర్థాలు డ్రైన్ల ద్వారా యమునలో కలవడం వల్లే పూర్తిగా కలుషితం అయినట్టు ఆప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది.మరోవైపు మరో వారం రోజుల్లో ఛట్ పూజ వస్తుండటంతో యమునా నదిలో కాలుష్య పరిస్థితిపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి పండుగ పూర్తయిన ఆరు రోజుల తర్వాత ఉత్తరాదిలో ఛట్ పూజ చేస్తారు. ఈ సందర్భంగా సమీపంలోని నదిలో స్నానమాచరించి సూర్యభగవానుడికి పూజలు నిర్వహిస్తారు. కానీ కాలుష్యం కారణంగా యమునా నది విషపు నురగలతో ఉప్పొంగుతోంది. సరిగ్గా పండుగ సమయంలోనే ఈ పరిస్థితి రావడంతో నగర వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషిత నీటిలోనే పుణ్య స్నానాలు ఆచరించాల్సిన పరిస్థితి తలెత్తింది.

## భారత్‌లో కింగ్ చార్లెస్ దంపతుల సీక్రెట్ పర్యటన.. వెల్‌నెస్ కేంద్రంలో థెరపీ చికిత్సలు..!



బెంగళూరు: బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్ - 3 సీక్రెట్‌గా భారత్ పర్యటకు వచ్చినట్లు తెలిసింది. సతీమణి క్వీన్ కెమిల్లా తో కలిసి మూడు రోజుల పర్యటన నిమిత్తం బెంగళూరు కు వచ్చినట్లు సమాచారం. అక్టోబర్ 27 నుంచి వారు బెంగళూరులోని ఓ వెల్‌నెస్ సెంటర్‌లో బస చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.కింగ్ చార్లెస్ దంపతులు ఈ నెల 21 నుంచి 26 మధ్య కామన్వెల్త్ ప్రభుత్వాధినేతల సమావేశానికి హాజరైన తర్వాత సమోవా నుంచి నేరుగా భారత్‌కు సీక్రెట్‌గా వచ్చినట్లు సదరు కథ నాలు తెలిపాయి. వారు బెంగళూరులోని ఓ వెల్‌నెస్ సెంటర్‌లో బస చేస్తున్నట్లు పేర్కొంది. ఈ సెంటర్‌లో యోగా, ధ్యానం వంటి సెషన్స్‌తో సమయం గడుపుతున్నట్లు తెలిసింది. వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది కింగ్ చార్లెస్, కెమిల్లాకు వివిధ రకాల థెరపీ చికిత్సలు నిర్వహిస్తున్నట్లు సదరు కథనాలు వెల్లడించాయి. ఈ సీక్రెట్ ట్రిప్ ముగిం చుకొని బుధవారం వీరు బ్రిటన్ బయల్దేర నున్నట్లు తెలిసింది. వీరు బస చేస్తున్న వెల్ నెస్ సెంటర్.. యోగా, ధ్యాన సెషన్‌లు, థెరపీ చికిత్సలకు ప్రసిద్ధి చెందినదిగా ఓ అధికారిని ఉటంకిస్తూ సదరు కథనాలు నివేదించాయి.

## లారెన్స్ బిష్ణోయ్ హత్యకు బంబిహా గ్యాంగ్ ప్లాన్..!



**ముంబయి:** గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ హత్యకు మరో క్రిమినల్ ముఠా బంబిహా నాయకుడు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది. తన గ్యాంగ్ పలుకుబడిని పెంచుకోవడానికే బిష్ణోయ్‌ను అడ్డం తొలగించుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. బంబిహా ముఠా నాయకుడు కుశాల్ చౌధ్రీ తన అనుచరుడు పవన్ షూకీన్ అలియాస్ సోనూతో కలిసి ఓ పథకం పన్నినట్లు ఆంగ్లపత్రిక ఇండియాటుడే పేర్కొంది. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంటున్న పవన్ ఇద్దరు షార్ప్ షూటర్లను పురమాయించి అక్టోబర్ 26న దిల్లీ రాణీబాగ్‌లోని ఓ వ్యాపారవేత్త ఇంటివద్ద రెక్కీ నిర్వహించి కాల్పులు జరిపించాడట. అనంతరం అతడిని రూ.15 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశాడు. లేకపోతే మరణం తప్పదని హెచ్చరించడంతో.. ఆ వ్యాపారవేత్త కూడా డబ్బు ఇవ్వడానికి సిద్ధమయ్యాడట. ఈలోపు ఇద్దరు షార్ప్ షూటర్లను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి సెమీ ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. వీరిని విచారించగా.. లారెన్స్‌ను చంపేందుకు దిల్లీ జైల్లో ఉన్న కుశాల్ చౌధ్రీ ప్లాన్ చేస్తు న్నట్లు తేలింది. దీనిలోభాగంగా డబ్బులు సమీకరించేందుకే ఆ వ్యాపారవేత్తను బెదిరించినట్లు గుర్తించారు. కుశాల్‌ను 2019లో థాయ్‌ల్యాండ్‌లో అరెస్టు చేసి భారత్‌కు తరలించారు. ఆ తర్వాత ఎన్ఐఏ అతడి స్థావరాలపై వరుసగా దాడులు చేసి కట్టడి చేసింది. గాయకుడు సిద్ధూమూసేవాల హత్యకు ప్రతీకారంగా లారెన్స్ చంపుతానని అతడు 2022లో సోషల్ మీడియాలో ప్రకటించాడు. గతేడాది పోలీస్‌కస్టడీలో ఉండగా ఇతడు ఆత్మహత్యకు యత్నించినట్లు వార్తలొచ్చాయి. మరోవైపు లారెన్స్ కూడా కుశాల్‌ను అంతం చేయాలని చూస్తున్నాడు. ఇటీవల సబర్మతి జైల్లో అతడిని ఎన్ఐఏ ప్రశ్నించగా.. తన హిట్ లిస్ట్‌లో బంబిహా గ్యాంగ్ నాయకుడు ఉన్నట్లు చెప్పాడని సమాచారం. ఇటీవల మహారాష్ట్ర రాజకీయ నాయకుడు బాబా సిద్ధిఖీ హత్యతో లారెన్స్ మరోసారి దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే.

## ఖలిస్తానీలను చంపించింది అమిత్ షానే కెనడా మంత్రి ఆరోపణలు

**టొరంటో:** కెనడాలో ఉన్న సిక్కు వేర్పాటువాదల ఏరివేతకు ప్లాన్ వేసింది భారత హోంశాఖ మంత్రి అమిత్ షా అని కెనడా ప్రభుత్వం ఆరోపించింది. ప్రధాని మోదీకి సన్నిహితుడైన అమిత్ షా .. సిక్కు వేర్పాటువాదులను టార్గెట్ చేసినట్లు ఆ దేశం పేర్కొన్నది. కెనడా చేసిన ఆరోపణలను భారత ప్రభుత్వం కొట్టిపారేసింది. ఖలిస్తానీల ఏరివేత వెనుక అమిత్ షా పాత్ర లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. సిక్కు వేర్పాటువాదులను షా టార్గెట్ చేసిన విషయాన్ని కెనడా విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్ మారిసన్ తొలుత అమెరికాకు చేరవేశారు. అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రికకు ఆ సమాచారం ఇచ్చింది తానే అని డేవిడ్ పార్లమెంటరీ ప్యానెల్ భేటీలో తెలిపారు. సిక్కు వేర్పాటువాదుల హత్యకు ప్లాన్ వేసిన వ్యక్తి షానేనా అని ఓ జర్నలిస్టు అడిగారని, అయితే ఆ వ్యక్తికి అవునని తాను సమాధానం ఇచ్చినట్లు మారిసన్ తెలిపారు.

## ఆలయంలో పేలిన పటాకులు.. టెంపుల్ కమిటీ అధ్యక్షుడు అరెస్ట్



**కాసరగోడ్:** కేరళలోని కాసరగోడ్‌జిల్లాలో వీరర్‌కవు ఆలయంలో జరిగిన పటాకులపేలుళ్ల ఘటనలో దేవాలయ కమిటీ ఛైర్మన్ సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాత్రి నీలేశ్వరం సమీపంలోని వీరర్‌కవు దేవాలయంలో ప్రజలు తెయ్యం ప్రదర్శన చూస్తుండగా, అక్కడ నిల్వ ఉంచిన పటాకులు ఒక్కసారిగా పేలాయి. దీంతో జరిగిన తొక్కిసలాటలో 150 మంది గాయపడ్డారు. వారిలో 10 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీకి చెందిన ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు. వారిలో అధ్యక్షుడు చంద్రశేఖరన్‌తోపాటు కార్యదర్శి భరతన్ సహా మరొకరిని అదుపులోకి తీసుకున్నారు.తెయ్యం లేదా కాళియాట్టం అనేది ఉత్తర కేరళ ప్రాంతంలోని ఆలయాల్లో నిర్వహించే పురాతన కళా ప్రదర్శన. ఇందులో భాగంగా వీరర్కవు దేవాలయంలో సోమవారం రాత్రి తెయ్యం ఉత్సవం జరుగుతుండగా ప్రమాదం జరిగింది. ఉత్సవాల కోసం ఆలయ ప్రాంగణంలోని ఓ రేకుల షెడ్డులో పెద్ద ఎత్తున బాణసంచా నిల్వ ఉంచారు. ఆలయానికి వచ్చిన వందలాది మంది భక్తులు తెయ్యం ప్రదర్శన చూస్తుండగా ఆ షెడ్డులో పేలుడు సంభవించింది. పేలుడు శబ్దంతో జనం ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగింది. కాగా, భద్రతకు సంబంధించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతోనే ప్రమాదం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. తెయ్యం ప్రదర్శనకు, టపాసుల నిల్వకు కనీసం 100 మీటర్ల దూరాన్ని పాటించాలన్న నిబంధనను పాటించలేదన్నారు. పటాకుల నిల్వకు అనుమతి తీసుకోలేదని చెప్పారు.

## దీపావళి వేళ పువ్వులతో కేదార్‌నాథ్ ఆలయ అలంకరణ




**డెహ్రాడూన్:** దీపావళి సందర్భంగా కేదార్‌నాథ్ ఆలయాన్ని పువ్వులతో అలంకరించారు. శీతాకాలం ప్రారంభం అవుతున్న సందర్భంగా ఉత్తరాఖండ్‌లోని ఆ జ్యోతిర్లింగ క్షేత్రాన్ని నవంబర్ 3వ తేదీన మూసివేయనున్నారు. ఆ రోజు ఉదయం 8.30 నిమిషాలకు ఆలయ ద్వారాలను మూసివేస్తారు. కేదార్‌నాథ్ థామ్‌లో ఉన్న శ్ర భకుంత్ భైరవనాథ్ ఆలయాన్ని మంగళవారమే మూసేశారు. కేదార్‌నాథ్‌ను మళ్లీ ఆర్నెళ్ల తర్వాత వేసవి కాలంలో ఓపెన్ చేయనున్నారు. దీపావళి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు కేదారీశ్వరుడి దర్శనం కోసం వచ్చారు.

## బోల్తాపడ్డ బస్సు.. 29 మంది స్పెషల్ పోలీసులకు గాయాలు

**బాల్లియా:** వేగంగా వెళ్తున్న బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో 29 మంది స్పెషల్ పోలీసులకు గాయాల య్యాయి.ఉత్తరప్రదేశ్ లోని బాల్లియా పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బీహార్ రాష్ట్రానికి చెందిన స్పెషల్ ఆర్మడ్ పోలీసులు ఉత్తరప్రదేశ్ మీదుగా బీహార్‌లోని సివాన్ కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ప్రమాద సమాచారం అందిన వెంటనే బాల్లియా పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు. రాష్ట్రానికి చెందిన స్పెషల్ సాయుధ పోలీసులు సివాన్‌కు వస్తుండగా ప్రమాదం జరిగిందని బీహార్ ఆర్మడ్ పోలీస్ ఫోర్స్ డిప్యూటీ ఎస్పీ లలన్ ప్రసాద్ సింగ్ చెప్పారు.కాగా ప్రమాదంలో గాయపడిన 29 మంది సాయుధ పోలీసులలో 10 మందిని మెరుగైన చికిత్స కోసం బాల్లియాలోని సదర్ హాస్పిటల్‌కు తరలించారు. మిగిలిన 19 మంది సోన్‌బర్సాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు.

## సల్మాన్‌ఖాన్‌కు మరోసారి బెదిరింపులు



**ముంబయి:** బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ కు వరుస బెదిరింపులు వస్తున్నాయి. తాజాగా గుర్తుతెలియని ఓ వ్యక్తి నుంచి ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు సందేశం వచ్చింది. రూ.రెండు కోట్లు చెల్లించకపోతే.. నటుడిని చంపేస్తామని బెదిరించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించి గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఇటీవల ఓ ఆగంతకుడి నుంచి సందేశం వచ్చిన విషయంతెలిసిందే. "ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్‌ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5 కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే మాజీ ఎమ్మెల్యే సిద్ధిఖీ (ఇటీవల హత్యకు గురైన) కంటే దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని అందులో ఉంది. అనంతరం అతడు మరో సందేశం పంపించాడు. "నేను కావాలని బెదిరింపులకు పాల్పడలేదు.అనుకోకుండాజరిగిపోయింది. క్షమించండి" అని పేర్కొన్నాడు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఝార?ండ్ పోలీసుల సాయంతో జంషెడ్‌పూర్ చెందిన ఓ కూరగాయల వ్యాపారి ఇదంతా చేసినట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.కృష్ణజింకలను వేటాడిన కేసు నేపథ్యంలో ఇప్పటికే పలుమార్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి సల్మాన్‌ఖాన్‌కు బెదిరింపులు ఎదురయ్యాయి. ఆయన స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ ఇటీవల దారుణ హత్యకు గురయ్యారు. దీంతో మరోసారి బిష్ణోయ్ గ్యాంగ్ పేరు తెరపైకి వచ్చింది. ఆ హత్యకు బాధ్యత వహిం చింది. అలాగే సల్మాన్‌కు సంబంధించిన వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ పలువురికి బెదిరింపుల సందేశాలు పంపింది.

# కుటుంబ సర్వే పై అవగాహన కార్యక్రమం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్డీఓ టి నాగిరెడ్డి




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు, ఐకేపీ సిబ్బందికి, అంగన్వాడీ టీచర్లకు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు, ఉపాధి హామీ సిబ్బందికి అవగాహన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి (డీఆర్డీఓ)టి నాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో బ్లాక్ లను ఏర్పాటు చేసి ఒక్కొక్క బ్లాక్‌లో 150 కుటుంబాలకు ఒక్క ఎన్యూమరేటర్ని ఏర్పాటు చేయాలని, పది మంది ఎన్యూమరేటర్లకు ఒక్క సూపర్వైజర్ నియమాకం వారు ఎన్యూమరేటర్ చేసిన సర్వేలో పది శాతం తనిఖీ చేయాలని అన్నారు. నవంబరు 01 నుంచి 03 వరకు ఇండ్ల జాబితా సిద్ధం చేయాలి. జాబితా అనంతరం నవంబరు 06 నుంచి 18 వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కుటుంబ వివరాల షెడ్యూల్, ఎన్యూమరేటర్ సేకరించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన కుటుంబ వివరాలను నవంబరు 19 నుంచి 27 వరకు కంప్యూటర్లో ఎంటర్ చేయించాలి. ఏన్యూమరేటర్ దగ్గర ఉండి తప్పులు దొర్లకుండా నమోదు చేయించాలని అన్నారు. ఇలా కంప్యూటర్‌లో ఎంటర్ చేసిన వివరాలను నవంబరు 27 నుంచి 30 వరకు ప్రభుత్వానికి సబ్మిట్ చేయాలని అన్నారు. అనంతరం టీఓటీ శేఖర్ అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక అధికారి ఎం రాజారామ్, మండలాభివృద్ధి అధికారి జె రాములు నాయక్, ఇంచార్జి ఎంపీఓ మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎల్మినేటి లోకేశ్వర్ రెడ్డి, అంగన్వాడీ సూపర్వైజర్, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు,ఉపాధిహామీసిబ్బంది,ఎంపీడీఓఆఫీసుసిబ్బంది పాల్గొన్నారు.

## సదర్ సమ్మేళనానికి ఆహ్వానం



**విశ్వంభర, బడంగ్పేట్:** నవంబర్ 1 తేదిన నిర్వహించనున్న సదర్ సమ్మేళనం కార్యక్రమనికి మహాత్మా గాంధీ లా కాలేజ్ ఛైర్మన్ గంగుల గోవర్ధన్ రెడ్డి కి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి లకు జిల్లెలగూడ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్ యాదవ్ ఆహ్వాన పత్రికను అందజేశారు. రవి యాదవ్, రాజు యాదవ్, రమేష్ యాదవ్, మురళీ యాదవ్, ప్రమోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ సభ్యునిగా నియామకమైన శాంతారాంకు శుభాకాంక్షలు



**విశ్వంభర, హైదరాబాద్:** తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులుగా నియమి తులైన వైద్యం శాంతారాంకు పొలిటికల్ కార్టూనిస్ట్ నారు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలోని కుప్పంలో జన్మించి, స్వామి వారికి సేవ చేసే భాగ్యం రావడం మీ పూర్వజన్మ సుకృతమని అన్నారు. అది మీరు నాయి బ్రాహ్మణులు కావడం మాకు గర్వకారణమని, సమాజంలో నాయి బ్రాహ్మణుల నేపథ్యాన్ని విస్తరించడంలో భాగంగా మీరు చేస్తున్న సేవ అద్భుతమని కొనియాడారు. మిమ్మల్ని టీటీడీ సభ్యులుగా నియమించిన హైటెక్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కార్టూనిస్ట్ నారు కృతజ్ఞతలు తెలిపారు.

## పిడుగుపాటుతో వ్యక్తి మృతి



**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పాలిమేలా మండలం సర్వాయి పేట గ్రామానికి చెందిన మల్లయ్య (35) పిడుగుపాటుకు మృతి చెందాడు. బుధవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా కురిసిన అకాల వర్షానికి పిడుగు పడి మృతి చెందాడని మృతుని బంధువులు తెలిపారు. మృతునికి ఇద్దరు అబ్బాయిలు ఒక అమ్మాయి ఉన్నారు.

## హమాలీ కార్మికుల హక్కుల కోసం పోరాడతా

### హమాలీ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్

**విశ్వంభర, మహబూబ్‌నగర్:** హమాలీ కార్మికుల మేలు కోసం నేను ఎవ్వరి కాలైన పట్టుకుంటా.. అవసరమైతే కాలరైనా పట్టుకుంటా నని తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంఘం హమాలీ యూనియన్ అధ్యక్షుడు హమాలీ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణరాష్ట్ర సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ ఆత్మీయ సమ్మేళనం మహబూబ్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ సంఘం పుట్టిందే కార్మికులకు మేలు చేయాలని, హమాలీలు, వారి పిల్లలు బాగు పడాలని నాడు స్థాపించి ఎన్నో మైలురాళు సాధించి పెట్టిందన్నారు. కానీ కొంతమంది మేమె సాధించాం అని చెప్పుకోవటం సిగ్గుచేటు, దమ్ముంటే బహిరంగంగా చర్చకు రావలని సవాల్ విసిరారు. అనంతరం హాజరైన ప్రతి ఒక్కరికి కండువాకప్పి కృతజ్ఞతలు తెలిపి తన కుమారుడి పెళ్లి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులూ రాంబాబు యాదవ్, శివకుమార్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## కోడి పందేల స్థావరాలపై దాడులు

**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం రాపల్లికోట గ్రామంలో కొందరు వ్యక్తులు కోడి పందాలు ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం రాగా వెంటనే ఎస్ఐ పవన్ తన సిబ్బందితో యుక్తంగా రాపల్లికోట గ్రామ శివారులో కొంత మంది వ్యక్తులు కోడి పందాలు ఆడుతూ కనిపించారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారిలో నలుగురి వ్యక్తులను పట్టుకొని వారి దగ్గర నుండి 2,510 రూపాయలు, 2కోళ్ళు, 2 కోడి కత్తులు స్వాధీనం చేసుకొని, నలుగురిపై కేసు నమోదు చేశారు.

## రోడ్డును మరమ్మతులు చేయించిన ఎంపీఓ



**విశ్వంభర, కుల్కచర్ల:** కుల్కచర్ల మండల కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా వర్షాకాలంలో గుట్ట వైపు నుండి వచ్చే వర్షపు నీరు రోడ్డుపై పారి, నిల్వ ఉండడంతో దుర్వాసన, దోమల బెడదతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ విషయాన్ని గ్రామస్తులు ఎంపీఓ భాస్కర్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా బుధవారం వెంటనే స్పందించి డోజర్, జేసీబీ సహాయంతో దగ్గరుండి మట్టి పోయించి రోడ్డును బాగు చేయించడం జరిగింది. దీంతో గ్రామస్తులు ఎంపీఓ భాస్కర్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# యువజన సమితిలో భారీ చేరికలు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయంలో యువ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలీం పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో మలక్‌పేటకు చెందిన సివిల్ ఇంజనీర్ మహమ్మద్ వసీం అక్రమ్ మిత్రబృందం యువ జన సమితిలో చేరారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం వారికి కండువా కప్పి ఆహ్వానించారు. యువ జన సమితి రాష్ట్ర నాయకులు ఎర్ర వీరన్న, కొత్త రవి, టీజేఎస్ పార్టీ హైదరాబాదు జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టల రాంచందర్, హైదరాబాదు జిల్లా యువజన అధ్యక్షుడు సుశీల్ కుమార్ తదితరులు పాల్గొని కొత్తగా చేరిన యువకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సలీం పాషా మాట్లాడుతూ, కోదండరాం తెలంగాణ ఉద్యమం నుండి నేటివరకు నిస్వార్థంగా, నిరాడంబరంగా రాష్ట్రానికి సేవ చేస్తున్నారని, గత బీఆర్ఎస్ నిరంకుశ పాలనను ఓడించడంలో కీలక పాత్ర పోషించారని, ఇప్పుడు ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా కీలక స్థానంలో ఉన్నారని తెలిపారు. కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ జన సమితి ఎప్పుడూ ప్రజా గొంతుకగా నిలిచిందని, ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని చూసి యువకులు ఆకర్షితులై యువ జన సమితిలో చేరుతున్నారని తెలిపారు. యువజన సమితిలో చేరిన వసీం అక్రమ్, ఆయన మిత్ర బృందానికి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ అభివృద్ధిలో యువకుల పాత్ర అత్యంత కీలకమని, యువ జన సమితి ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా, ఫరాజ్, కిషోర్, సైఫ్, మహమ్మద్, అజంగర్, అర్బాజ్, ఇర్ఫాన్, ఖాలేద్, సఫ్దర్ తదితరులు పాల్గొని యువ జన సమితిలో చేరారు.

## మైనర్ బాలికను తీసుకెళ్లిన ఇద్దరు వ్యక్తుల రిమాండ్

**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి మహదేవపూర్ మండలానికి చెందిన ఒక మహిళ తన కూతురు, భూపాలపల్లి లోని హాస్టల్ కి వెళ్తున్నానని చెప్పి ఈ నెల 7 న ఇంటి నుండి వెళ్ళింది. ఇదిలా ఉండగా ఈ నెల 11 న తన కూతురు చదువుకునే హాస్టల్ సిబ్బంది ఫోన్ చేసి మీ కుమార్తె ఇంకా హాస్టల్ కు రాలేదని తెలిపింది. దీంతో కంగారు పడిన ఆ మహిళ అదే రోజున మహదేవపూర్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి మహదేవపూర్ బస్టాండ్ ఆవరణలో ఆ అమ్మాయి, వేరే వ్యక్తితో కనిపించడంతో పోలీసులు వెంటనే వాళ్లను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అమ్మాయి స్టేట్ మెంటును మహిళా కానిస్టేబుల్ చేత రికార్డు చేయించి, అమ్మాయిని వాళ్ళ తల్లిదండ్రులకు అప్పచెప్పారు. ఆ అబ్బాయిని విచారించగా అతను పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామానికి చెందిన లింగీ రాజశేఖర్‌గా గుర్తించారు. ఆ అమ్మాయిని తను ఓకే కాలేజీలో చదివేవారని అలా పరిచయం చేసుకొని ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని, నువ్వు లేకపోతే చచ్చిపోతానని బెదిరించి ఆ అమ్మాయిని ఇంటి నుంచి తన మిత్రుడైన లెంకలగడ్డ గ్రామానికే చెందిన మడప బాపు సహాయంతో తీసుకెళ్లాడు. అమ్మాయి రాజశేఖర్ ఇద్దరూ కలిసి దేవాలయాలు, సత్రాలలో తిరుగుతూ, తింటూ ఇన్ని రోజులు గడిపారని తెలిపాడు. మైనర్ బాలికను అలా తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమైనందున పోలీసులు లింగి రాజశేఖర్‌ను, అతడికి సహకరించిన మడప బాపును ఇద్దరిని అరెస్టు చేసి బుధవారం కోర్టు ముందు ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

## మహిళల ఆరోగ్య సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



**విశ్వంభర, మహబూబ్ నగర్:** మహిళలు, మహిళల సంపూర్ణ ఆరోగ్య సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం మూసాపేట్ మండలంలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ రూలర్ హెల్త్ రిసోర్స్ యూనిట్ ను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, గర్భిణీలకు అన్ని రకాల సమతుల్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతోనే ఈ యూనిట్‌ను ప్రారంభించామని, మహిళా తల్లులు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మహిళల్లో రక్తహీనత ఎనీమియా వ్యాధి నివారణ కోసం కావలసిన పోషక విలువలు పోషక పదార్థాలు వాటిపై సమగ్ర అవగాహన పెంపొందించుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఆమె సూచించారు. ఎం.ఆర్.హెచ్.ఆర్.యూ యొక్క ముఖ్య ఉద్దేశం ఆరోగ్య సేవలో నాణ్యతను మెరుగుపరచడం కోసం గ్రామీణ సమాజానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడానికి అట్టడుగు స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించడం. దేశంలో ఆరోగ్య పరిశోధన మౌలిక సదుపాయాలను విస్తరించడం, కొత్త టెక్నాలజీ డెవలపర్ లో (వైద్య సంస్థలలో పరిశోధకులు రాష్ట్రం లేదా కేంద్రం), ఆరోగ్య వ్యవస్థ ఆపరేటర్లు( కేంద్రం లేదా రాష్ట్ర ఆరోగ్య సేవలు) మరియు లబ్ధిదారులు (గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు/సంఘాలు) మధ్య అనుసంధానంగా ఉండటం. కేంద్ర మంత్రిత్వ శాఖ నిధులు రూపాయల నాలుగున్నర కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని 2021లో పనులు చేపట్టగా ప్రస్తుతం నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభించారు. డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ భాను ప్రకాష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ బాధ్యులు కొండ ప్రశాంత్‌రెడ్డి, బాల్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు అధికారుల నియామకం

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



విశ్వంభర, భూపాలపల్లి: సామాజిక ఆర్థిక సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు నోడల్ అధికారిని, కోర్ కమిటీ అధికారులను, మండల ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి జిల్లా కోర్ కమిటీ అధికారులుగా కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబూరావు, ఆర్డీఓ మంగిలాల్, మండల, మున్సిపల్ ప్రత్యేక అధికారులుగా జిల్లా అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లికి జిల్లా పంచాయతీ అధికారి నారాయణ రావు, మహాముత్తారంకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం వెంకటేశ్వర్లు, కాటారంనకు జిల్లా ఉద్యాన వనశాఖాధికారి డి సంజీవరావు, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌జిఎ సిదార్థ రెడ్డి, రేగొండ కు జిల్లా భూగర్భ జల వనరుల అధికారి కె శ్రీనివాస్, చిట్యాలకు జిల్లా సంక్షేమ అధికారి కె చిన్నయ్య గణపురంకు జిల్లా పశు సంవర్ధక అధికారి కె కుమారస్వామి, మల్హర్‌కు జిల్లా మత్యశాఖ అధికారి, ఏ అవినాష్, మొగళ్లపల్లికి జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి డి సునీత, పలిమెలకు జిల్లా వ్యవసాయ అధికారి ఎం విజయ భాస్కర్, టేకుమట్లకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి శైలజ, మహాదేవపూర్ కు డివిజనల్ పంచాయతి అధికారి వీరభద్రయ్య, కొత్తపల్లి ఘోరికి సహాయ గ్రామీణాభివృద్ధి అధికారి మంజులా దేవిలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

## రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశ్వంభర, నల్గొండ:** "చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండగ" సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో పదేండ్ల చీకటిని పారద్రోలి ప్రజలు వెలుగుల రేఖలను సృష్టించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రజాపాలనపై విషం చిమ్ముతున్న అజ్ఞానులకు జ్ఞానదీపం వెలగేలా లక్ష్మీదేవి ఆశీర్వదించాలని మంత్రి కోరుకున్నారు. ఈ దీపావళి పండగ ప్రజల జీవితాల్లో వెలుగురేఖలను ఇనుమడింప చేయాలని ఆ భగవంతుడిని కోరుకున్నారు. చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకొని వెలుగుల పండగను సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

### - తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్ 2 ఫ్లోర్‌లో తెలంగాణ ఫుడ్ కమీషన్ సమావేశం బుధవారం ఏర్పాటు చేసింది. ఇందులో 33 జిల్లాల జిల్లా ఫిర్యాదుల పరిష్కార అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఇతర కమిషన్ సభ్యులు వి. ఆనంద్, కె.గోవర్ధన్ రెడ్డి, ఎం. భారతి, ఆర్. శారద, బి. జ్యోతి, సభ్యుల కార్యదర్శి ఎం.నరేందర్ రావు తో పాటు నోడల్ అధికా రులు, పౌరసరఫరాల శాఖ, విద్యాశాఖ, ఎంహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ డిపార్ట్‌మెంట్, డబ్ల్యూడీసీడబ్ల్యూ డిపార్ట్‌మెంట్‌లు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సమావేశంలో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, ఆహార కమిటీల ఏర్పాటు, న్యాయమైన ధరల దుకాణాల పర్యవేక్షణ, ఫోన్ నంబర్లతో కూడిన బోర్డుల ప్రదర్శన, ఫిర్యాదు బాక్సులను ఉంచడం, హెచ్‌బి స్థాయి పర్యవేక్షణపై దృష్టి సారించాలని ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విజిలెన్స్ కమిటీల ఏర్పాటు చేయాలని, ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని పట్టుబట్టారు. గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఇంటికీ ఆహారం తీసుకెళుతూ పథకం లక్ష్యం పక్కదారి పడుతోందని ఆయన ఎత్తిచూపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళు, సరసమైన ధరల దుకాణాలలో సంబంధిత అధికారుల ఫోన్ నంబర్‌ల ప్రదర్శన చేయాలన్నారు. సమావేశానికి హాజరైన జిల్లా ఫిర్యాదుల పరిష్కార అధికారులు జాతీయ ఆహార భద్రతా చట్టం-2013ని పూర్తి లేఖ, స్ఫూర్తితో అమలు చేస్తామని కమిషన్‌కు హామీ ఇచ్చారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, గిరిజన సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలకు చెందిన పిల్లలకు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం, పీడీఎస్ (ప్రజా పంపిణీ వ్యవస్థ) కింద లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను జిల్లా అధికారులతో చర్చించారు. ఫిర్యాదుల పరిష్కార అధికారులు మరియు డీఆర్డీఓ లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి కూడా విస్తృతంగా చర్చించారు.

## సాయిబాబా పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

### శ్రీ షిరిడి సాయి భక్త ఐక్యవేదిక ప్రతినిధి గుండా మల్లయ్య గుప్తా



**విశ్వంభర, ఎల్బీనగర్:** షిరిడి సాయి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టి, బాబా పై నమ్మకానికి బలం చేకూర్చే విధంగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అన్ని సాయి ఆలయాలను కలుపుకొని ముందుకు వెళ్లనున్నట్లు శ్రీ షిరిడి సాయి భక్త ఐక్యవేదిక ప్రతినిధులు గుండ మల్లయ్య, ధనుంజయులు వెల్లడించారు. బుధవారం దిల్ సుఖ్ నగర్ లోని శిరిడి సాయి భక్త ఐక్యవేదిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారా బాబా పై జరుగుతున్న విష ప్రచారాన్ని సమర్థవంతంగా, శాస్త్రబద్ధంగా ఎదుర్కొనేందుకు ఐక్యవేదిక కృషి చేస్తుందన్నారు. ఇందుకోసం తెలుగు ప్రభుత్వాల సహకారం కూడా తీసుకునే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అవసరమైతే చట్ట పరంగా కూడా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ నెలలో తెలుగు రాష్ట్రాల సాయిబాబా ఆలయాల ప్రతినిధులతో పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణలు ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రతినిధులు పూర నరసింహ గుప్తా, శ్యాం కుమార్, సాయి,కృష్ణ, సాయిబాబా, నారాయణ, సాయి శ్రీనివాస్, ప్రవచకులు ప్రసాద్ పాల్గొన్నారు.

## నియోజక వర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

### బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ



**విశ్వంభర, ఎల్బీనగర్:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండగ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ తెలిపారు. ఈ దీపావళి పండగ ప్రజల జీవితాల్లో వెలుగురేఖలను నింపాలని ఆ భగవంతుడిని కోరుకున్నారు. 10 నెలల కాంగ్రెస్ పాలన అంతా అస్తవ్యస్తంగ ఉందన్నారు. 6 హామీలను విస్మరించి మూసీ ప్రక్షాళనని ఎత్తుకున్నారన్నారు. రైతు భరోసాను ఎగ్గొట్టారని, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్‌కు తులం బంగారం మాట ఊసే లేదన్నారు. రాష్ట్రానికి ఒక్క కంపెనీ కూడా తీసుకురాలేకపోయారని ఎద్దేవా చేశారు. చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకొని వెలుగుల పండగను సంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి



**విశ్వంభర, నల్గొండ:** డిండి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఎన్యుమరేటర్ల శిక్షణా కార్యక్రమానికి నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సర్వే చట్ట ప్రకారంగా చేయవలసిన ప్రక్రియని, ప్రణాళిక బద్ధంగా, సమర్థవంతంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు ఆమె సూచించారు. బాధ్యతాయుతంగా సర్వే నిర్వహించి సకాలంలో పూర్తి చేయాలని ఆమె తెలిపారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా సక్రమంగా ప్రజలకు అందించుటకై ఈ సర్వే ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, డిండి తహసిల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంపీడీఓ వెంకన్న, ఎంపీ ఓ సత్యనారాయణ, ఎంఈఓ గోపియా నాయక్, ఏవో రామలింగేశ్వరరావు, ఎమ్మార్వో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా, ఆర్ఐలు శ్యాం నాయక్, నరసింహ, మాస్టర్ ట్రైనర్స్ జయరాజ్, పురుషోత్తం, జంగయ్య, నాగరాజు తో పాటు 90 మంది ఎనిమరేటర్లు 9 మంది సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల ఆకస్మిక తనిఖీలు



**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో గల పలు ఫర్టిలైజర్ షాపులలో వ్యవసాయ శాఖ అధికా రుల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్, స్టాక్ రిజిస్టర్లు, సేల్స్ రిజిస్టర్, బిల్ బుక్స్ లను వ్యవసాయ శాఖ అధికారిని సుప్రజ్యోతి పరిశీ లించారు. ఆమె మాట్లాడుతూ డీలర్లు అందరూ స్టాక్ రిజిస్టర్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తు ఉండాలని, రైతులకు బిల్స్ తప్పకుండా ఇవ్వాలని, ఎరువులను ఎక్కువ ధరలకు రైతులకు విక్రయించరాదని, ఇతర రాష్ట్రాలకు ఎటువంటి ఎరువులను కూడా సరఫరా చేయరాదని, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ యాక్ట్ రూల్స్ ప్రకారం షాపులు నిర్వహించాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల అమ్మకం జరిగితే అటువంటి షాపుల పై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ధర్మేందర్, శరత్ లు పాల్గొన్నారు.

# విరాట్.. ఎమోషన్స్‌ను నియంత్రించుకో: బ్రాడ్ హాగ్



**ముంబాయి:** న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో భారత స్టార్‌బ్యాటర్ విరాట్ కోహ్లీ పెద్దగా ప్రభావం చూపించలేదు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో వర్షం ప్రభావం కారణంగా ఇబ్బంది పడ్డాడని భావిస్తే.. రెండో టెస్టులోనూ అదే పున రావృతమైంది. కీలకమైన సమయంలో వికెట్‌ను సమర్పించుకొని విఫలమయ్యాడు. మరీ ముఖ్యంగా స్పిన్నర్లకు వికెట్లను ఇచ్చే యడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. దూకు డుగా ఆడేద్దామనే భావనతో ఔట్ అవుతున్నట్లు ఆసీస్ మాజీ క్రికెటర్ బ్రాడ్ హాగ్ వెల్లడించాడు. కోహ్లీ తన భావోద్వే గాలను నియంత్రించుకో లేకపోతున్నాడని హాగ్ వ్యాఖ్యానించాడు. భారత్ - కివీస్ మూ డో టెస్టు శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. కోహ్లీ బ్యాటింగ్ విషయంలో కీలక సూచనలు చేశాడు.

**"న్యూజిలాండ్‌ను భారత్ చాలా తేలిగ్గా తీసుకుంది.**

సులువుగా విజయం సాధించ వచ్చని భావిం చినట్లుంది. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లీ దూకు డుగా ఆడేందుకు ప్రయత్నించా డు. చాలా అగ్రెసివ్‌గా బ్యాటింగ్ చేసి పరుగులు రాబట్టాలని చూశాడు. ప్రత్యర్థి బౌలింగ్‌ను తక్కు వగా అంచనా వేశాడు. షాట్లు కొట్టేట ప్పుడు భావోద్వేగాలను నియంత్రించుకో లేకపోయినట్లు అనిపిస్తోంది. అందుకే, స్పిన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఇక మూడో టెస్టులోనూ టెక్నిక్‌ను మరింత మెరుగు పర్చు కోవాలి. సౌథీ బౌలింగ్‌లో రోహిత్ శర్మ ఇబ్బంది పడ్డాడు. సిరీస్ క్లీన్ స్వీప్ కాకుండా ఉం డాలంటే వీరిద్దరూ బ్యాటింగ్‌లో రాణించా ల్సిందే" అని హాగ్ వెల్లడించాడు.

**ఓడిపోవడం మంచిదే.. కానీ**

"న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓడిపోవడం మంచిదే. ముమ్మందు నాణ్యమైన ఆటతీరును ప్రదర్శించాల్సి ఉంటుంది. టీమ్ ఇండియా అను కున్నంత మేర గొప్పగా ఆడలేదు. తప్ప కుండా విజయం సాధించడానికి విభిన్నంగా ప్రయత్నించాలి. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే గెలవా ల్సిందే. ఆసీస్ పర్యటనకు వచ్చేనాటికి గెలవా లనే కసితో భారత్ సిద్ధమవ్వాలి. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ఆస్ట్రేలియా కూడా ఉంది. భారత్‌కు అదే చివరి టెస్టు సిరీస్ కాబట్టి.. రసవత్తరంగా ఉండటం ఖాయమే" అని ఆసీస్ మాజీ స్పిన్నర్ వ్యాఖ్యానించాడు. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్, ఆస్ట్రేలియా టాప్-2లో ఉన్నాయి. కివీస్‌తో చివరి మ్యాచ్‌లోనూ ఓడితే మాత్రం టీమ్ ఇండియా పరిస్థితి క్లిష్టంగా అవకాశం లేకపోలేదు.

## ఓలా నుంచి మరిన్ని సర్వీస్ సెంటర్లు!

**ముంబాయి:** ఓలా ఎలక్ట్రిక్ తన సర్వీస్ సెంటర్ల సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తోంది. తాజాగా 50కి పైగా సర్వీస్ సెంటర్లు, 500 మంది టెక్నీషియన్లను నియమించుకున్నట్లు తెలుస్తోంది. మెరుగైన సేవలు అందించే దిశగా విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ వేగంగా విస్తరిస్తోంది. తన సర్వీస్ సెంటర్ల సామర్థ్యాన్ని 30శాతం పెంచుకున్నట్లు తెలుస్తోంది. కొత్తగా 50కు పైగా సర్వీస్ సెంటర్లను, 500 మంది టెక్నీషియన్లను పెంచుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. కస్టమర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న తరుణంలో కంపెనీ కేంద్రాలను, శ్రామిక శక్తిని పెంచుకుంటోంది.

## రిషభ్ పంత్ వేలంలోకి వస్తే రూ.30 కోట్లు దక్కించుకుంటాడు



**దిల్లీ:** ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు మెగా వేలంలో నిర్వహించనున్న సంగతి తెలిసిందే. వేలానికి ముందు ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అక్టోబర్ 31లోపు ఫ్రాంఛైజీలు అట్టిపెట్టుకునే ఆటగాళ్ల వివరాలను సమర్పించాల్సి ఉంది. ఈ డెడ్‌లైన్ సమీపించినా ఇప్పటి వరకు ఏ ఫ్రాంఛైజీ కూడా తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను అధికారికంగా ప్రకటించలేదు. అయితే, దిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌ను ఫ్రాంఛైజీ రిటైన్ చేసుకోకుండా మెగా వేలంలోకి వదిలేస్తే అతడిని దక్కించుకోవడానికి ఫ్రాంఛైజీలు పోటీపడతాయని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు. "రిషభ్ పంత్ మెగా వేలానికి అందుబాటులో ఉండవచ్చని వినికిడి. అతను కీపర్-బ్యాటర్. టీ20ల్లో పంత్ గణాంకాలు బాగా లేవని, ఐపీఎల్‌లో ఒక్క సీజన్‌లో మాత్రమే సక్సెస్ అయ్యాడని, ముఖ్యంగా ఎక్కువ రన్స్ చేయలేదని చాలామంది అంటున్నారు. కానీ, పంత్ వేలంలోకి వస్తే భారీ ధరకు అమ్ముడవుతాడని రాతపూర్వకంగా హామీ ఇవ్వగలను. ఆర్సీబీకి ఒక వికెట్‌కీపర్, బ్యాటర్, కెప్టెన్ కూడా కావాలి. పంజాబ్, కోల్‌కతా, చెన్నై టీమ్‌లకు పంత్ అవసరం ఉంది. దిల్లీ అతడిని తిరిగి దక్కించుకోవాలంటే ఆర్‌టీఎం కార్డు అందుబాటులో ఉంటుంది. ఇషాన్ కిషన్‌ను వదులుకుంటే ముంబయికి కూడా పంత్ కావాలి. లఖ్‌నవూ నికోలస్ పూరన్‌ని రిటైన్ చేసుకున్నా పంత్‌పై ఎందుకు ఆసక్తి చూపదు? రాజస్థాన్, గుజరాత్‌తో పాటు అన్ని జట్లకు అతని అవసరం ఉంది. రిషభ్ పంత్ వేలంలో భారీ ధరపలుకుతాడు. రూ.25-30 కోట్లుదక్కిం చుకుంటాడు" ఆకాశ్‌చోప్రా అభిప్రాయ పడ్డాడు.

### ఆర్సీబీ రిటైన్ చేసుకునేది వీరినేనా..?

## సోషల్ మీడియాలో హింట్ ఇచ్చిన ఫ్రాంఛైజీ



**బెంగుళూర్:** ఐపీఎల్ ఫ్రాంఛైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను రేపటిలోగా (అక్టోబర్ 31) సమర్పించాల్సి ఉంది. ఇప్పటికే అన్ని ఫ్రాంఛైజీలు ఎవరిని అట్టిపెటుకోవాలనే దానిపై ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కానీ, ఏ జట్టు కూడా రిటైన్ చేసుకునే ఆటగాళ్ల వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రస్తుతం తమ జట్టులో ఉన్న ప్రధాన ఆటగాళ్ల పేర్లతో కూడిన ఓ పజిల్‌ని సోషల్ మీడియాలో పోస్టు చేసింది. "మా రిటెన్షన్స్ రహస్యంగా ఉన్నాయి. ఈ ఆధారాలను అర్థం చేసుకుని కోడ్‌ను ఛేదించగలరా మా మాస్టర్ ప్లాన్‌ని కనుక్కోండి!" అని హింట్ ఇచ్చేలా పజిల్‌ను అభిమానులతో పంచుకుంది. ఈ పజిల్‌లో విరాట్ కోహ్లీ, ఫాఫ్ డుప్లెసిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, కామెరూన్ గ్రీన్, విల్ జాక్స్, మహ్మద్ సిరాజ్, యశ్ దయాళ్, రజత్ పటిదార్, అనుజ్ రావత్ పేర్లు ఉన్నాయి. బహుశా వీరిలో నుంచే కొంతమందిని ఆర్సీబీ రిటైన్ చేసుకోవచ్చు. ఒక్కో ఫ్రాంఛైజీ గరిష్ఠంగా ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవచ్చు. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కార్డు ఉంటుంది. జట్టు దగ్గర ఉండే మొత్తం రూ.120 కోట్లు. కాగా అట్టిపెట్టుకున్న అయిదుగురి కోసం రూ.75 కోట్లు ఖర్చు పెట్టాల్సివుంటుంది. అట్టిపెట్టుకున్న మొదటి ఆటగాడికి ఫ్రాంఛైజీ రూ.18 కోట్లు ఇవ్వాలి. రెండో ఆటగాడికి రూ.14 కోట్లు, మూడో ఆటగాడికి రూ.11 కోట్లుచెల్లించాల్సి వుంటుంది. ఫ్రాంఛైజీ నాలుగు, అయిదో ఆటగాణ్ని కూడా అట్టిపెట్టుకుంటే తిరిగి వరుసగా రూ.18 కోట్లు, రూ.14 కోట్లు ఇవ్వాల్సివుంటుంది. అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌కు రూ.4 కోట్లు చెల్లించాలి.

### టీమ్‌ఇండియా పాకిస్థాన్‌కు రావాలి

## అద్భుతమైన స్వాగతం పలుకుతాం: రిజ్వాన్



**ఇష్లామాబాద్:** పాకిస్థాన్ వేదికగా వచ్చే ఏడాది జరిగే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 పై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. తాము పాకిస్థాన్‌లో ఆడేదిలేదని ఇప్పటికే పలుమార్లు టీమ్‌ఇండియా తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. తటస్థ వేదికలను ఏర్పాటుచేసి హైబ్రిడ్ ఫార్మాట్‌లో ఈ టోర్నీ నిర్వహించాలనే సూచనలూ వచ్చాయి. మరోవైపు పాక్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ మాత్రం.. ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్థాన్‌లోనే జరుగుతుందని.. అన్ని జట్లు వస్తాయనే నమ్మకం తమకుందని విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు. ఈనేపథ్యంలో ఆ జట్టు పరిమిత ఓవర్ల క్రికెట్‌కు ఇటీవల కెప్టెన్‌గా ఎంపికైన వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ ఈ అంశంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు పాకిస్థాన్‌కు టీమ్ ఇండియా రావాలని కోరాడు. "పాకిస్థాన్ అభిమానులు భారత ఆటగాళ్లపై ప్రేమ చూపిస్తారు. మేం కూడా టీమ్‌ఇండియా అభిమానుల నుంచి 2023 ప్రపంచకప్ సందర్భంగా అదేవిధమైన ప్రేమను పొందాం. అందుకే పాకిస్థాన్‌కు భారత్ వచ్చి ఆడాలని మేం కోరుకుంటున్నాం. అయితే.. టీమ్ ఇండియా ఆటగాళ్లు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్‌కు వస్తారా.. రారా..? అనే విషయం నాకు తెలియదు. ఒకవేళ వస్తే మాత్రం వారికి ఇక్కడ అద్భుతమైన స్వాగతం లభిస్తుంది" అని రిజ్వాన్ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నాడు. ఇక 2025 ఛాంపియన్స్ ట్రోఫీ వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. ఫైనల్ మ్యాచ్ మార్చి 9న ఉండనుంది. ఇందుకోసం లాహోర్, కరాచీ, రావల్పిండిలను వేదికలుగా ఎంపిక చేశారు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీపై ఇటీవల టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ స్పందించాడు. టీమ్‌ఇండియా ఆటగాళ్ల భద్రత చాలా ముఖ్యమని వ్యాఖ్యానించాడు. గ్యారంటీ లేకపోతే భారత ఆటగాళ్లు పాకిస్థాన్‌లో పర్యటించకూడదని తాను ఎప్పుడూ చెబుతానని.. ఇప్పుడూ అదే విషయాన్ని నమ్ముతున్నానని చెప్పాడు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బీసీసీఐ టీమ్‌ఇండియా జట్టును దాయాది దేశానికి 2008 నుంచి పంపించడం లేదు. ఐసీసీ ట్రోఫీల్లో మాత్రమే ఇరు జట్లు తలపడుతున్నాయి.

### స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో వివో టాప్..

## విలువ పరంగా శాంసంగ్‌కు అగ్రస్థానం



**ముంబాయి:** భారత స్మార్ట్‌ఫోన్ విక్రయాల్లో విలువ పరంగా శాంసంగ్, విక్రయాల పరంగా వివో అగ్రస్థానాల్లో నిలిచాయి.దక్షిణ కొరియాకు చెందిన శాంసంగ్ సంస్థ దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో తన హవా కొనసాగిస్తోంది. స్మార్ట్‌ఫోన్ విక్రయాల్లో విలువ పరంగా అగ్రస్థానంలో నిలిచింది. 22.8 శాతం మార్కెట్ వాటాతో తొలిస్థానం ఉంది. ఐఫోన్లు తయారు చేసే యాపిల్ రెండో స్థానంలో నిలిచిందని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ సంస్థ నివేదిక తెలిపింది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో మూడో త్రైమాసికానికి సంబంధించిన గణాంకాలను వెలువరించింది. శాంసంగ్ తన ప్రీమియం ఫోన్లయిన ఎస్ సిరీస్ విక్రయాలు పెంచుకో వడం ద్వారా విలువ పరంగా మార్కెట్‌లో అగ్రస్థానం సాధించిందని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ అనలిస్ట్ ప్రచీర్ సింగ్ పేర్కొన్నారు. మిడ్ రేంజ్ స్మార్ట్‌ఫోన్లు, అందుబాటు ధరలో లభించే ప్రీమియం ఫోన్లలో గెలాక్సీ ఏఐ ఫీచర్లు అందించడం కూడా ప్రీమియం సెగ్మెంట్‌కు యూజర్లు మారడానికి ఉపయోగపడిందని సింగ్ పేర్కొన్నారు. గతేడాది విలువ పరంగా 21.8 శాతంగా ఉన్న శాంసంగ్ మార్కెట్ వాటా ఈ ఏడాది సెప్టెంబర్ త్రైమాసికంలో 22.8 శాతానికి పెరగడం గమనార్హం. యాపిల్ వాటా 21.8 నుంచి 21.6 శాతానికి తగ్గడం గమనార్హం. ఇక విక్రయాల పరంగా.. చైనా కంపెనీ వివో 19.4 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే 26 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ విషయంలో షావోమి 16.7 శాతం వాటాతో రెండో స్థానంలో ఉండగా.. 15.8 శాతం వాటాతో శాంసంగ్ మూడో స్థానంలో నిలిచింది. ఒప్పో 13.4 శాతం, రియల్‌మీ 11.3 శాతం వాటాతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇతర మొబైల్ కంపెనీలు 23.3 శాతం వాటాను కలిగి ఉన్నాయి. వివో విక్రయాల్లో ఐకూ, షావోమి విక్రయాల్లో పోకో విక్రయాలు కలిసి ఉంటాయి. ఒప్పో నంబర్లలో వన్‌ప్లస్ విక్రయాలను జోడించలేదని కౌంటర్ పాయింట్ తెలిపింది.

### విదేశాల్లో విద్యుత్ ప్రాజెక్ట్ ఆర్డర్లను పొందిన ఎల్ అండ్ టీ

**ముంబాయి:** అధిక-వోల్టేజీ విద్యుత్ గ్రిడ్‌లను విస్తరించడం, బలోపేతం చేయడం కోసం మధ్యప్రాచ్యం(మిడిల్ ఈస్ట్), ఆఫ్రికాలో ప్రధాన ప్రాజెక్టులను చేజిక్కించుకున్నట్లు ప్రముఖ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ లార్సెన్ టూబ్రో ఈరోజు తెలిపింది. ప్రాజెక్టుల్లో భాగంగా కెన్యాలో నేషనల్ సిస్టం కంట్రోల్ సెంటర్‌ను, సౌదీ అరేబియాలో హై-వోల్టేజ్ ట్రాన్స్‌మిషన్ లైన్లు, ఖతార్‌లో గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్లను నిర్మిస్తారు. ఎల్అండ్‌టీ సంబంధించిన ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ వర్టికల్ ద్వారా ఈ ఆర్డర్ల ను పొందినట్లు కంపెనీ ఫైలింగ్‌లో తెలి పింది. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్ర క్షన్ ప్రాజెక్టులు, హైటెక్ తయారీ సేవల్లో నిమగ్నమై ఉన్న 27 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ బహుళజాతిసంస్థ. ఇది ప్రపంచవ్యాప్తంగా 50కు పైగా దేశాలలో విస్తరించి ఉంది.

### అనవసరపు రికార్డు వద్దు..

## చివరి మ్యాచ్‌లోనైనా గెలవండి : ఆకాశ్ చోప్రా



**న్యూజిలాండ్:** న్యూజిలాండ్ పై వరుసగా రెండు టెస్టుల్లో ఓటమి పాలై 12 ఏళ్ల తర్వాత స్వదేశంలో టీమ్‌ఇండియా సిరీస్‌ను కోల్పోయిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ముంబయి వేదికగా జరిగే మూడో టెస్టుపై అందరి దృష్టి నెలకొంది. ఆ మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలుపుకోవాలని భారత అభిమానులు కోరుతున్నారు. చివరి టెస్టునూ కోల్పోయి అనవసరపు రికార్డును తమ ఖాతాలో వేసుకోవద్దని పలువురు సూచిస్తున్నారు. మూడో టెస్టులోనైనా టీమ్‌ఇండియా విజయం సాధించాలని మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా కోరాడు. ఇప్పటివరకూ సొంత గడ్డపై టీమ్‌ఇండియా 0-3 తేడాతో టెస్టు సిరీస్‌ను కోల్పోలేదని అపఖ్యాతిని తెచ్చే ఇలాంటి రికార్డును సృష్టించవద్దని ఆటగాళ్లకు సూచించాడు. "టీమ్‌ఇండియా స్వదేశంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎప్పుడూ వైట్‌వాష్ కాలేదు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒకసారి అలా జరిగింది. కానీ, మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎప్పుడూ అలా జరగలేదు. అలాంటి రికార్డును బ్రేక్ చేయొద్దు. దయచేసి చివరి మ్యాచ్ గెలవాలని కోరుతున్నాను. ఎందుకంటే పాయింట్లు కూడా మనకెంతో ముఖ్యం. ఈ మ్యాచ్ గెలిస్తే 33 శాతం పాయింట్లు మనకు లభిస్తాయి. ఇక హెడ్ కోచ్‌గా గౌతం గంభీర్ పదవీ కాలంలో ఇప్పటికే అనవసరపు రికార్డులు ఉన్నాయి. మరొకటి చేర్చకండి" అని ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానల్‌లో సూచించాడు. గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆగస్టులో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌ను టీమ్‌ఇండియా కోల్పోయింది. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో టీ20, టెస్టు సిరీస్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే తాజాగా స్వదేశంలో కివీస్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌ను మాత్రం మరో మ్యాచ్ మిగిలి ఉండగానే కోల్పోయింది. బెంగళూరు, పుణె టెస్టుల్లో ఓటమి పాలైన రోహిత్ సేన ముంబయి వేదికగా నవంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న ఆఖరి టెస్టు ఆడనుంది.

## యాపిల్, ఐఫోన్ 17 ముందస్తు తయారీ భారత్‌లోనే



**దిల్లీ:** కొవిడ్ సమయంలో ఎదురైన చేదు అనుభవంతో చైనా నుంచి ఐఫోన్ల తయా రీని ఇతర దేశాలకు తరలించిన యాపిల్.. తాజాగా ఆ దేశానికి మరో ఝలక్ ఇచ్చింది. యాపిల్ 17 ముందస్తు తయారీని తొలిసారి భారత్‌లో చేపడు తోంది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియను చైనాలో మాత్రమే నిర్వహించిన యాపిల్ సంస్థ.. తొలిసారి డ్రాగన్ దేశానికి వెలు పల చేపడుతుండడం గమనార్హం. కొన్నేళ్లుగా ఐఫోన్ మోడళ్లు భారత్‌లో తయారవు తున్నా యి. ఇక్కడి నుంచి భారీ సంఖ్యలో ఇతర దేశాలకూ యాపిల్ వీటిని ఎగుమతి చేస్తోంది. సాధా రణంగా ఒక ప్రొడక్ట్ విడుదలైన తర్వాత ఇక్కడ తయారీ చేపడుతుంటారు. కానీ, అమెరికాలో యాపిల్ పార్క్‌లో తదుపరి తరం మొబైల్ డిజైన్ రూపు దిద్దుకున్నాక.. కమర్షియల్ లాంచ్‌కు ముందు ఫోన్లను మాత్రం చైనాలోనే ఇన్నాళ్లూ యాపిల్ చేపడుతూ వస్తోంది. అంటే పూర్తి స్థాయి తయారీకి ముందు ఉన్న ఫోన్లన్నీ చైనాలో రూపొందినవే అన్నమాట. అక్టోబర్ నుంచి మే నెల మధ్యలో సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, తొలిసారి యాపిల్ తన మనసు మార్చుకున్నట్లు తెలుస్తోంది. యాపిల్ 17 విషయంలో ముందస్తు తయారీని భారత్‌లోని ఓ ప్లాంట్‌లో చేపడుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇలా రూపొందిన ఫోన్‌ను 2025 రెండో అర్ధభాగంలో యాపిల్ సాధారణంగా విడుదల చేయనుంది. ముఖ్యంగా కరోనా సమయంలో యాపిల్‌కు ఎదురైన చేదు అనుభవం దృష్ట్యా యాపిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫాక్స్‌కాన్ ప్లాంట్ మూత పడి, ఉత్పత్తి నిలిచిపోవడంతో యాపిల్ తన ఐఫోన్ల ఉత్పత్తిని చైనా వెలుపల చేపట్టాలని నిర్ణ యించింది. అలా భారత్‌లోకి ఎంట్రీ ఇచ్చిన యాపిల్.. తొలుత బేస్ మోడళ్ల తయారీ మాత్రమే చేపట్టింది. ఇటీవల విడుదలైన యాపిల్ 16ప్రో మోడళ్లను ఇక్కడే చేపడుతున్నట్లు తెలుస్తోంది.

## గూగుల్‌లో 25 శాతం కోడింగ్ 'ఏఐ'తోనే

### సుందర్ పిచాయ్



ముంబయి: గూగుల్ తన సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించడానికి కృత్రిమ మేధ పై ఎక్కువగా ఆధారపడుతోందని కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. జనరేట్ చేసిన కోడ్‌ను ఇంజినీర్లు రివ్యూ చేస్తున్నప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిందన్నారు. గూగుల్ మూడో త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన సందర్భంగా పిచాయ్ ఏఐ గురించి ఆసక్తికర విషయాలను తన బ్లాగ్ పోస్ట్‌లో పంచుకున్నారు. గూగుల్ మెరుగైన వృద్ధి వ్యూహంలో ఏఐది కీలక పాత్ర అని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. 'గూగుల్'లో కొత్త కోడింగ్‌లో 25 శాతానికిపైగా కృత్రిమ మేధతోనే సృష్టిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏఐ సాయంతో కోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా.. సమయాన్ని తగ్గించి, ఆవిష్కరణల విషయంలో వేగం పెంచడమే సంస్థ లక్ష్యమని వెల్లడించారు. 'కృత్రిమ మేధ ఆధారిత కోడింగ్ ప్రక్రియ అనేది.. సంస్థ కార్యకలాపాల క్రమబద్ధీకరణలో ఓ భాగం. జెమినీ వంటి కొత్త మోడళ్లను మరింత వేగంగా తీసుకొచ్చేలా.. పరిశోధన, మెషిన్ లెర్నింగ్, సెక్యూరిటీ విభాగాలతోపాటు ఆయా ప్లాట్‌ఫామ్, డివైస్‌లకు చెందిన సిబ్బందిని ఏకీకృతం చేసింది' అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ వినియోగం మరింత విస్తరిస్తోందన్నారు. కోపైలట్ ద్వారా జెమినీని అందుబాటులో తీసుకొచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డెవలపర్లకు ఏఐ టూల్స్ అందుబాటులోకి తేవడమే దీని వెనుక ఉన్న ఉద్దేశమని అన్నారు. 'వీడియో ఏఐ'పైనా పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపిన ఆయన.. యూట్యూబ్‌లో వీడియోల జనరేట్ కోసం త్వరలోనే 'వియో'ను తీసుకురానున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ మూడో త్రైమాసికంలో 88.3 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. సెర్చ్ ఇంజిన్ ఆదాయం 13శాతం పెరిగిందని తెలిపింది.

### బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలతో

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు రోజంతా అదే బాటలో పయనించాయి. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 80,237.85 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,369.03) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే బాటలో పయనించింది. ఇంట్రాడేలో 79,821.99 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ చివరకు 426.85 పాయింట్ల నష్టంతో 79,942 వద్ద ముగిసింది. నిఫ్టీ 126 పాయింట్లు కుంగి 24,340 వద్ద స్థిరపడింది. 30 సూచీలో ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎంఅండ్ఎం, కోటక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. మారుతీ సుజుకీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీపోర్ట్స్, ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్అండ్‌టీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.61 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా. బంగారం ఔన్సు 2,795.80 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## తారాజువ్వలా దూసుకెళ్తున్న బంగారం..

### తొలిసారి తులం రూ.82 వేలు పైకి



**ముంబయి:** బంగారం ధర మరోసారి పెరిగింది. దీపావళి వేళ తారాజువ్వలా దూసుకెళ్తోంది. దేశ రాజధానిలో దిల్లీలో తాజాగా 10 గ్రాముల మేలిమి పసిడి ధర తొలిసారి రూ.82 వేలు దాటేసింది. దీపావళి డిమాండ్ దృష్ట్యా బంగారు ఆభరణ విక్రేతలు భారీగా బంగారం కొనుగోలు చేయడం బంగారం పెరుగుదలకు కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం (99.9%) ధర బుధవారం రూ.1000 మేర పెరిగి రూ.82,400కు చేరినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.82 వేల మార్కును చేరిందని తెలిపింది. అంతకుముందు స్వచ్ఛమైన పసిడి రూ.81,400గా ఉంది. గతేడాది ఇదే సమయంలో దిల్లీలో 10 గ్రామల పసిడి రూ.61,200గా ఉంది. ఏడాదిలో 35 శాతం మేర పెరిగింది. వెండి కిలో సైతం రూ.1300 మేర పెరిగి రూ.1.01 లక్షలకు చేరింది. దీపావళి వేళ బంగారం కొనుగోళ్లు ఊపందుకుంటాయన్న అంచనాల నేపథ్యంలో స్థానిక వర్తకులు భారీ స్థాయిలో పసిడి కొనుగోళ్లు జరపడం డిమాండ్‌కు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికాలో నవంబర్ 5న అధ్యక్ష ఎన్నికలు పోటాపోటీగా జరిగే అవకాశం ఉందన్న అంచనాలూ అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ పెరగడానికి కారణమని విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఔన్సు బుధవారం ఇంట్రాడేలో 2797.90 డాలర్ల పలకడం గమనార్హం.














Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com

# 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీ





**విశ్వంభర, అమరావతి:** విజన్ డాక్యుమెంట్ 2047కు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం సమావేశమై చర్చించారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన ఈ భేటీలో నీతి ఆయోగ్‌కు సంబంధించినసలహాదారు, డైరెక్టర్లతోపాటు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ప్రణాళిక రూపొందించినట్లు సీఎంచంద్రబాబు వివరించారు. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీ అభివృద్ధే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో రూపొందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. వ్యవసాయం, ఆక్వా తదితర రంగాల్లో అభివృద్ధి సాధించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు సీఎం నీతిఆయోగ్ సీఈఓకు వివరించారు. పేదరిక నిర్మూలన, ఈజ్‌ఆఫ్ లివింగ్, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, డెమోగ్రాఫిక్ మేనేజిమెంట్, డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి గ్రోత్ ఇంజిన్లతో వృద్ధిరేటు సాధించేలా ఈ ప్రణాళికలు రూపొందాయని, వీటిని సమర్థంగా అమలు చేసేలా కార్యాచరణ చేసినట్లు సీఎం తెలిపారు.

### తెలుగు ప్రజలకు సీఎం చంద్రబాబు దీపావళి శుభాకాంక్షలు..

తెలుగు ప్రజలందరికీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. "నరకాసుర వధ తర్వాత ఇంటింటా దీపాలు వెలిగించుకొని సంతోషంగా నిర్వహించుకొనే వెలుగుల పండుగ దీపావళి. ఒక దీపాన్ని వెలిగించడం ద్వారా మన చుట్టూ ఉన్న చీకట్లను పారద్రోలినట్లుగా.. సూపర్-6 హామీల్లో భాగంగా 'దీపం 2.0' పథకంతో ఈ దీపావళి పండుగను మరింత కాంతివంతం చేస్తున్నాం. తెలుగింటిఆడబిడ్డల కళ్లల్లో ఆనందం చూసేందుకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అర్హులైన మహిళలు ఇప్పటికే ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇది ఎంతో సంతోషించదగినవిషయం. వారి నుంచి వస్తున్నస్పందనతో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసేలా స్ఫూర్తిని పొందుతున్నాం. ఈ ఆనంద దీపావళి.. రాష్ట్ర ప్రజల జీవితంలో కొత్త వెలుగులు నింపాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

### ఉచిత గ్యాస్ సబ్సిడీ.. పెట్రోలియం సంస్థలకు చెక్కు అందజేసిన సీఎం చంద్రబాబు

సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకానికి ఖర్చయ్యే నిధులను సీఎం చంద్రబాబు పెట్రోలియంసంస్థలకు అందజేశారు. అమరావతిలోని సచివాలయంలో హిందుస్థాన్ పెట్రోలియం,భారత్ పెట్రోలియంకార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఈ సబ్సిడీ మొత్తాన్ని అందించారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు అయ్యే రూ.2,684 కోట్ల ఖర్చుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో మొదటి ఉచిత సిలిండర్‌కు ఖర్చు అయ్యే రూ.894 కోట్లను పెట్రోలియం సంస్థలకు ప్రభుత్వం అందించింది. దీపం-2 పథకంలో భాగంగా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందించనుంది. మూడు విడతల్లో ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లకు అయ్యే ఖర్చు సొమ్మును విడుదల చేయనుంది. 29వ తేదీ నుంచి గ్యాస్ బుక్ చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకు కల్పించింది. గ్యాస్ సిలిండర్ అందిన 48 గంటల్లో లబ్ధిదారులు సిలిండర్‌కు వెచ్చించిన సొమ్ము వారి ఖాతాలో జమ కానుంది.

## పోలీసుల పేరుతో కిడ్నాప్.. రూ.4లక్షలు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరింపు నలుగురు నిందితులను అరెస్టు



**విశ్వంభర, ఎస్.కోట:** విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలో కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను బుధవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మీడియా సమావేశంలో వెల్లడించారు. "ఈ నెల 28న ఉదయం 5.30 గంటలకు ఎస్.కోట మండలం కొట్టాం గ్రామానికి చెందిన దంతులూరి వెంకటసూర్యనారాయణరాజు ఇంటికి ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చారు. తాము పోలీసులమని, విచారణ నిమిత్తం తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత సూర్యనారాయణరాజు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. దీంతో ఆయన కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కిడ్నాప్ ఘటనపై 29న ఉదయం సూర్యనారాయణరాజు అల్లుడు కాకార్లపూడి శివప్రసాద్.. ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ భాస్కరరావు బుధవారం ఉదయం 5గంటలకు ఉసిరి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రెండు కార్లలో వస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. గమనించిన పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా.. కిడ్నాప్ వ్యవహారం బట్టబయలైంది. ఏడుగురు కిడ్నాపర్ల నుంచి సూర్యనారాయణరాజును పోలీసులు రక్షించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు విశాఖపట్నం మధురవాడ కొమ్మాది ప్రాంతానికి చెందిన కసిరెడ్డి రాజుకు, బాధితుడు సూర్యనారాయణరాజుకు దాదాపు 20 ఏళ్లుగా పరిచయం ఉంది. కొంతకాలంగా కసిరెడ్డి రాజు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. సూర్యనా రాయ ణరాజు ఆస్తిపరుడని తెలిసి.. తన ఇద్దరు కుమారులు ప్రవీణ్, సాయి వారి స్నేహితులు మరో నలుగురితో కలిసి కసిరెడ్డి రాజు కిడ్నాప్‌నకు ప్రణాళిక వేశాడు. ఇందులో భాగంగా ఈనెల 28న అతని ఇంటికి వెళ్లి పోలీసులమని చెప్పి కిడ్నాప్ చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశామని, మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నాం" అని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

## జెత్వానీ కేసు.. విచారణ ప్రారంభించిన సీఐడీ

CRIME INVESTIGATION DEPARTMENT
CID
ANDHRA PRADESH POLICE
సత్యమేవ జయతే

**విశ్వంభర, అమరావతి:** ముంబయి నటి జెత్వానీ కేసులో సీఐడీ అధికారులు విచారణ ప్రారంభించారు. కేసుకు సంబంధించిన దస్త్రాలను ఇబ్రహీంపట్నం పోలీసులనుంచి స్వాధీనం చేసుకున్నారు. జెత్వానీ, ఆమె తల్లిదండ్రుల నుంచి వాంగ్మూలం సేకరించారు. ఈ కేసులో ఇప్పటికే వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మరోవైపు వైకాపాతో అంటకాగి అక్రమ కేసులు బనాయించారనే ఆరోపణలపై ఇప్పటికే ఐపీఎస్ అధికారులు కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ, పీఎస్ఆర్ ఆంజనేయులతో పాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. వారిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

## దిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ANDHRA PRADESH
సత్యమేవ జయతే

**విశ్వంభర, అమరావతి:** దిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలుపెట్టింది. 'రీ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏపీ భవన్' పేరుతో 11.53 ఎకరాల్లో నిర్మాణం కోసం డిజైన్లకు టెండర్లను ఆహ్వానించింది. 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్'ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని నోటిఫికేషన్‌ఇచ్చింది. సాయంత్రంలోపు గుత్తేదారులు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అందులో పేర్కొంది. నవంబర్ 28 లోపుప్రతిపాదనలు సమర్పించాలని చెప్పింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత దిల్లీలోని ఏపీ భవన్‌ను విభజించారు. ఎన్నికలకు ముందు 2 తెలుగు రాష్ట్రాల అధికారులు చర్చించి భవన్ విభజనను ఖరారు చేశారు. 2 రాష్ట్రాల అధికారుల ప్రతిపాదనకుకేంద్ర హోంశాఖఆమోదం తెలి పింది. ప్రస్తుతం ఉన్న భవనాలను తెలుగు రాష్ట్రాలుకలిసి వినియోగించకుంటు న్నాయి..

# ఏపీలో అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు చేయండి

## ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్‌లో లోకేశ్




**లాస్‌వెగాస్:** ఏపీ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. ఇందులోభాగంగా ఆయన లాస్‌వెగాస్ నగరంలో నిర్వహించిన ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్‌లో పాల్గొన్నారు. సమ్మిట్ ప్రాంగణంలో పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఎండీ రేచల్, పెప్సికో మాజీ సీఈవో ఇంద్రానూయి, రెవేచర్ సీఈవో అశ్విన్‌భరత్, సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షియాతో లోకేశ్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలతలను వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఎండీ రేచల్‌ను లోకేశ్ కోరారు. సులభతరమైన పౌరసేవలకు సహకారం అందించాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులఅవకాశాలను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌పై దృష్టి పెట్టామని రేచల్ స్కాఫ్ చెప్పారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై అమెజాన్‌దృష్టి సారించిందన్నారు. ఏఐ, ఎంఎల్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. రెవేచర్ సీఈవో అశ్విన్ భరత్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్ టాలెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పడానికి భాగస్వామ్యం వహించాలని కోరారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఇతర డిమాండ్ ఉన్న ఐటీ నైపుణ్యాల్లో రాష్ట్రంలోని యువత కు శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక కోడింగ్ బూట్ క్యాంప్‌లను అందించడానికి ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థలతో కలసి పనిచేయాలని చెప్పారు. క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ఏపీటీడీ లక్ష్యాల సాధనకు ఏడబ్ల్యూఎస్ ఉపకరిస్తుందని లోకేశ్ తెలిపారు. స్మార్ట్ గవర్నెన్స్‌లో ఏడబ్ల్యూఎస్‌క్లౌడ్‌సేవలు రాష్ట్రంలో కీలకమన్నారు. ఏఐ,ఎంఎల్‌లో ఏడబ్ల్యూఎస్ శ్రద్ధ, నిబద్ధత తమ ఆశయాలకు ఊతమిస్తాయని లోకేశ్ చెప్పారు. ఏపీలో క్లౌడ్ సేవలు అందించే అంశాన్ని పరిశీలిస్తామని ఏడబ్ల్యూఎస్ ఎండీ తెలిపారుబీ.

## ఏపీని కేంద్రానికి తాకట్టుపెట్టిన చంద్రబాబు : మాజీ మంత్రి కారుమూరి



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి తాకట్టుపెట్టారని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు ఒక్క అంగుళం తగ్గినా రాష్ట్రమంతా ఉద్యమిస్తామని మీడియా సమావేశంలో హెచ్చరించారు. పోలవరం ఎత్తు తగ్గిస్తే కూటమి ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని విమర్శించారు. రైతుల కోసం చంద్రబాబు ఏ ఒక్క కార్యక్రమాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతు భరోసా కేంద్రాలను, రైతు బీమాకు మంగళం పాడారని మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో (%ాబజూవతీ ాఱఇ%) రైతులకు రూ. 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఎగ్గొట్టారని తెలిపారు. వైసీపీ హయాంలో వైఎస్ జగన్ అన్ని రకాలుగా ఆదుకున్నారని పేర్కొన్నారు. సకాలంలో రైతు బీమాను రూ. 900 కోట్లు ప్రీమియం చెల్లించి ఉంటే ఇటీవల వచ్చిన తుఫాన్ కారణంగా రూ. 13,000 కోట్ల పంట పరిహారం బీమా కంపెనీల నుంచి వచ్చేదని అభిప్రాయపడ్డారు. రైతు అంటే చంద్రబాబుకు నచ్చదని అన్నారు. రైతు భరోసా కేంద్రాలను గాలి కొదిలేశారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారని తెలిపారు.

## నవంబర్ 9 నుంచి యూరప్‌లో శ్రీనివాస కళ్యాణోత్సవాలు : టీటీడీ



**విశ్వంభర, తిరుపతి :** టీటీడీ ఆధ్వర్యాన నవంబర్, డిసెంబర్ నెలల్లో యూకే, ఐర్లాండ్,యూరప్ లో 8 దేశాలు 13 నగరాల్లో శ్రీనివాస కళ్యాణాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు సూర్య ప్రకాష్ వెలగా, కృష్ణ జవాజీ టీటీడీ ఈవోజె శ్యామలరావును తిరుపతి పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీనివాస కళ్యాణాలలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించారు. అనంతరం వారు యూకే, ఐర్లాండ్, యూరప్ లోని 8 దేశాల్లోని 13 నగరాల్లో నవంబర్ 9 నుంచి డిసెంబర్ 21 వరకు టీటీడీ సహకారంతో స్థానిక స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థలతో కలిసి ఏపీ ఎన్ఆర్టీఎస్ శ్రీనివాస కళ్యాణాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఈవోకు వివరించారు. తిరు కళ్యాణ కార్యక్రమాలను టీటీడీ వేదపండితులు వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించనున్నాట్లు టీటీడీ వెల్లడించారు. నవంబర్ 9న ఐర్లాండ్‌లోని బెల్ఫాస్ట్, నవంబర్ 10న డబ్లిన్, 16న యూకేలోని బేసింగ్‌స్టోక్, 17 న నెదర్లాండ్‌లోని ఐండ్‌హోవెన్, 23న జర్మనీలోని హాంబర్గ్‌లో కల్యాణ ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. 24న ఫ్రాన్స్ లోని పారిస్, 30న పోలాండ్‌లోని వార్సా , డిసెంబర్ 1న స్వీడన్‌లోని స్టాక్‌హోమ్, 7న యూకే లోని మిల్టన్ కీన్స్,8న యూకే లోని గ్లౌసెస్టర్, 14న జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్, 15న బెర్లిన్, 21న స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్‌లలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## పోలవరం బాధితులకు న్యాయం చేయాలి సీపీఐ నేత రామకృష్ణ



**విశ్వంభర, అనంతపురం టౌన్ :** కరవు జిల్లాకు నీరు అందించే హంద్రీనీవాపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో ప్రాజెక్టుల అంశంపై ఆయన మాట్లాడారు. నవంబర్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులకు ఒక్కొక్కదానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రాష్ట్రానికి ప్రయోజనాలు చేకూర్చే పోలవరం ఎత్తు కుదించడానికి కేంద్రం ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్యాకేజీ డబ్బులు ఎగ్గొట్టడానికి కేంద్రం ఈ చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. అలాగే పోలవరం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో పోలవరం ప్రాజెక్టు అంశంపై విజయవాడలో సమావేశం కానున్నట్లు చెప్పారు.

## బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా?: షర్మిల



అమరావతి: వైసీపీ అధ్యక్షుడు జగన్ బెయిల్ రద్దుకు కుట్రగా ఆ పార్టీ నేతలు పేర్కొనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్‌తో ఆస్తుల వివాదం నేపథ్యంలో ఆమె మరోసారి స్పందించారు. "ఈడీ అటాచ్ చేసింది షేర్లు కాదు.. రూ.32కోట్ల విలువైన కంపెనీ స్థిరాస్తి. షేర్ల బదలాయింపుపై ఎలాంటి ఆంక్షలు, అభ్యంతరాలు లేవు. స్టేటస్‌కో ఉన్నది షేర్లపై కాదు. గతంలోనూ ఎన్నో కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. వాటికి స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్, బదిలీలు మాత్రం ఆపలేదు. ఈడీ అటాచ్ చేసినందువల్ల షేర్ల బదిలీ చేయకూడదనడం హాస్యాస్పదం. నాకు 100 శాతం వాటాలు బదలాయిస్తామని ఎంవోయూపై జగన్ సంతకం చేశారు. బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా? 2021లో రూ.42 కోట్లకు క్లాసిక్ రియాలిటీ, సండూర్, సరస్వతి షేర్లను విజయమ్మకు ఎలా అమ్మారు? బెయిల్ రద్దవుతుందని షేర్లు విక్రయించినప్పుడు తెలియదా? అలా అమ్మడం స్టేటస్ కోను ఉల్లంఘించినట్లు కాదా? షేర్ల బదిలీకి, బెయిల్ రద్దుకు సంబంధం లేదని మీకు తెలుసు. షేర్లు విక్రయించి ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. జగన్ బెయిల్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదని విజయమ్మకు తెలుసు." అని షర్మిల పేర్కొన్నారు.

## ఏపీలో పలుచోట్ల మద్యం డిస్టిలరీల్లో సీఐడీ సోదాలు

విశ్వంభర, కాకినాడ: ఏపీలో పలుచోట్ల మద్యం డిస్టిలరీల్లో సీఐడీ సోదాలు చేపట్టింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 8 మంది సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. పెద్దాపురం మండలం చిన బ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ పరిశ్రమలో అధికారులు సోదాలు చేశారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. నల్లజర్ల మండలం ఆవపాడు, రాయవరం మండలం చెల్లూరు, తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలోని డిస్టిలరీల్లో తనిఖీలు కొనసాగిస్తున్నారు. వైకాపా హయాంలో జరిగిన అక్రమాలపై వివరాలు సేకరిస్తున్నారు. డిస్టలరీలకు ఎంతమేర మద్యం సరఫరా చేశారనే విషయంపై ఆరా తీస్తున్నారు.